జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో సెక్షన్ 51 విచారణ అంతా నర్మగర్భంగా సాగుతోంది. మొదటి నుంచి సక్రమంగా లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విచారణాధికారైన సహకార శాఖ అదనపు రిజిస్ట్రార్ గౌరీశంకర్ వ్యవహరిస్తున్న తీరు అందుకు కారణమైంది. తొలి విడత ఈనెల 9, 10 తేదీల్లో విచారణకు వచ్చిన ఆయన తొలిరోజు రాత్రికి ఒంగోలు చేరుకొని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సేదతీరారు. రెండో రోజు నామమాత్రంగా బ్యాంకును సందర్శించి వెళ్లిపోయారు. మళ్లీ మంగళవారం బ్యాంకు అధికారులకు ఎటువంటి సమాచారం లేకుండా నేరుగా వచ్చి విచారించారు. అది కూడా సహాయకులైన అధికారులు లేకుండానే చేపట్టడం అనేక అనుమానాలకు తావిస్తోంది.




బ్యాంకు నుంచి బయటకు వస్తున్న విచారణాధికారి గౌరీశంకర్

అంతా రహస్యం

డీసీసీబీలో సెక్షన్ 51కు సంబంధించి విచారణాధికారి తీరు అనుమానాస్పదం | రెండో విడత గుట్టుగా విచారణ

- కమిషనర్ కేటాయించిన అధికారులు లేకుండా ఒక్కరే బ్యాంకుకు రాక
- ఆయన తీరుపై అనేక విమర్శలు
- కార్యాలయం లోపలికి మీడియా నిషేధం

ఒంగోలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో గత వైసీపీ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రభుత్వ ఆదేశాలతో సహకారశాఖ ఉన్నతాధికారి చేపట్టిన విచారణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ప్రక్రియనే సజావుగా సాగడం లేదన్న చర్చ నడుస్తోంది. తొలి విడత విచారణ సమయంలో తనకు అవసరమైన రికార్డులు అప్పగించాలని, ఒక అధికారిని బ్యాంకు నుంచి తనకు అందుబాటులో ఉంచాలని ముందుగానే నోటీసు ఇవ్వాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా రెండో రోజు బ్యాంకుకు వచ్చినప్పుడు ఆ నోటీసు ఇచ్చారు. అంతేకాక సెక్షన్ 51 విచారణ అత్యంత ముఖ్యమైనది. అనేక రికార్డులు పరిశీలించాల్సిన విషయం కావడంతో విచారణాధికారికి సహాయకులుగా విజయవాడలోని ఒక

మిగతా 6వ పేజీలో

ఒంటరిగానే వచ్చి.. ఆంక్షలు పెట్టి..

తొలి విడత విచారణను తూచ్ అనిపించిన విచారణాధికారి గౌరీశంకర్ రెండో విడత మంగళవారం వచ్చారు. ఈసారి కూడా తనకు సహాయకులుగా నియమించిన ఇద్దరు అధికారులను వెంట తీసుకురాలేదు. అంతేకాక గతంలో ఆర్అండ్‌బీ అతిథిగృహానికి వచ్చి అక్కడి సహకారశాఖ అధికారులు, సిబ్బందిని కలిసిన తర్వాత బ్యాంకుకు వెళ్లిన ఆయన ఈసారి నేరుగా డీసీసీబీకి వచ్చారు. బ్యాంకు ప్రధాన కార్యాలయం పైఅంతస్తుకు వెళ్లిన ఆయన్ను కలిసేందుకు కానీ.. విచారణ సందర్భంగా రికార్డుల పరిశీలన, ఇతర సిబ్బందితో మాట్లాడే వాటిని ఫొటోలు తీసేందుకు కానీ మీడియాను అనుమతించకుండా బ్యాంకు వద్ద ఆంక్షలు పెట్టారు. అలా రహస్యంగా విచారణ ప్రక్రియ సాగుతుండటం తెలిసి సహకార వర్గాల్లో చర్చ సాగుతోంది. విచారణ తీరుపై అందరూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కీలక రంగాలపై దిశానిర్దేశం

- ముగిసిన కలెక్టర్ల సదస్సు
- రెండోరోజు శాంతి భద్రతలపై సమీక్ష
- హాజరైన కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు
- పలు అంశాలపై స్పష్టమైన చర్యలకు సీఎం ఆదేశం

ఒంగోలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో కీలక రంగాలు, ప్రభుత్వ ప్రాధాన్యతలు, తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. సోమ, మంగళవారాల్లో ఈ సదస్సు జరిగింది. స్థూల ఉత్పత్తి, పరిశ్రమలు, విద్య, వైద్యం, స్థానిక సంస్థల నిర్వహణ, రెవెన్యూ వంటి వాటితోపాటు శాంతిభద్రతలపైనా సమీక్ష నిర్వహించారు. గతంలో కలెక్టర్లు తమ జిల్లాల్లో పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రజా సమస్యలపై నివేదికలు సమర్పించే వారు. కొన్ని ముఖ్యమైన అంశాలను ప్రత్యక్షంగా వివరించే వారు. ఈసారి అందుకు భిన్నంగా ఆయారంగాల వారీ రాష్ట్రస్థాయి పురోగతికి సంబంధించి ఆయా శాఖల ముఖ్యకార్యదర్శులు, సెక్రటరీల స్థాయి అధికారులు వివరించారు. సందర్భానుసారం అవసరమైన కలెక్టర్లకు మాట్లాడే అవకాశం ఇచ్చారు. ఈసదస్సుకు రెండు, మూడు రోజులు ముందుగానే పెద్ద సంఖ్యలో కలెక్టర్లు, ఎస్పీలను బదిలీ చేయడంతో కొత్తవారికి తమ జిల్లాలపై పెద్దగా అవగాహన ఉండదు కనుక ఈ విడత సదస్సును అలా నిర్వహించారు.


సదస్సుకు హాజరైన కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రెవెన్యూ లోపాలపై తీవ్రంగా స్పందించిన సీఎం

తొలిరోజు స్థూల ఉత్పత్తి పెంపు ప్రధానాంశంగా సమావేశంలో చర్చ నడిచింది. రెండోరోజు రెవెన్యూ, స్థానిక సంస్థల నిర్వహణ

మిగతా 6వ పేజీలో


భార్య జుట్టుపట్టుకొని మోకాలితో తన్నుతున్న బాలాజీ

బెల్ట్‌తో బాదుతూ.. కాళ్లతో తన్నుతూ..

భార్య చేతులు కట్టేసి చిత్రహింసలు

- కలుజువ్వలపాడులో శాడిస్టు భర్త దారుణం
- రాత్రి 9 నుంచి వేకువజామున 5 గంటల వరకూ రాక్షసత్వం
- సహకరించిన అతని అక్క, మేనల్లుడు
- మరోసారి దాడికి యత్నం.. రక్షించిన స్థానికులు

తర్లుపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడులో దారుణం చోటుచేసుకుంది. శాడిస్టు భర్త తన భార్య రెండు చేతులను పాక గుంజలకు కట్టేసి తీవ్రంగా హింసించి చంపేందుకు ప్రయత్నించాడు. స్థానికులు అడ్డుకొని ఆమెను కాపాడారు. వివరాల్లోకి వెళితే.. కలుజువ్వలపాడు గ్రామానికి చెందిన గురునాథం బాలాజీకి దగ్గర బంధువైన భాగ్యలక్ష్మితో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మద్యానికి బానిసైన బాలాజీ భార్యను తీవ్రంగా హింసించేవాడు. ఈక్రమంలోనే కొంతకాలంగా భార్యాపిల్లల్ని వదిలేసి వేరే మహిళతో హైదరాబాద్‌లో ఉంటున్నాడు. భాగ్యలక్ష్మి స్థానిక బేకరీలో పనిచేస్తూ పిల్లలను చదివిస్తోంది. శనివారం గ్రామానికి వచ్చిన బాలాజీ భార్యను డబ్బుల కోసం వేధించడం మొదలు పెట్టాడు. ఆమె రెండు చేతులను తాళ్లతో గుంజలకు కట్టేసి బెల్టుతో బాదుతూ, జుట్టుపట్టుకొని వెనక్కి విరిచి కాళ్లతో తన్నుతూ తీవ్రంగా హింసించాడు. బాలాజీకి అతని అక్క రమణమ్మ, మేనల్లుడు విష్ణు సహకరించారు. రాత్రి 9 నుంచి వేకువజామున 5 గంటల వరకూ రాక్షసత్వాన్ని కొనసాగించారు. మరలా సోమవారం రాత్రి ఆమెపై దాడికి ప్రయత్నించగా తప్పించుకొని సమీపంలోని చర్చి వద్దకు వెళ్లడంతో అక్కడ ఉన్న స్థానికులు భాగ్యలక్ష్మిని కాపాడారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మంగళవారం రాత్రి పొదిలి సీఐ వెంకటేశ్వర్లు గ్రామానికి చేరుకొని బాధితురాలిని మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతోంది.

విచారణ చేపట్టాం : బ్రహ్మనాయుడు, ఎస్సై

కలుజువ్వలపాడులో భార్యను చిత్రహింసలకు గురిచేసిన భర్త విషయం నా దృష్టికి వచ్చింది. వెంటనే గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టా. ఇంట్లో నిందితుడు లేడు. ప్రస్తుతానికి భాగ్యలక్ష్మి ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి నిందితుడిపై చర్యలు తీసుకుంటాం.

ఇంటికో బాధితుడు

- జిల్లాలో విజృంభిస్తున్న విషజ్వరాలు
- ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిట
- వాతావరణంలో మార్పులే కారణమంటున్న వైద్యులు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జ్వరం.. ఒళ్లు నొప్పులు.. నలత.. కొందరిలో జలుబు, దగ్గు, తలనొప్పి.. ఇదీ ఇప్పుడు అందరి నోటా వినిపిస్తున్న మాట. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో జిల్లాలో జ్వరపీడితులు అధికమవుతున్నారు. వైద్యం కోసం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వద్ద బారులు తీరుతున్నారు. ఆర్ఎంపీల వద్ద కూడా క్యూకడుతున్నారు. కొందరైతే మెడికల్ షాపులను ఆశ్రయిస్తున్నారు. తమకు కలిగిన లక్షణాలను తెలియజేస్తూ మందుబిళ్లలతో సరిపెట్టుకుంటున్నారు. ఇదేవిషయమై వైద్యులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో జ్వరపీడితులు పెరుగుతున్న మాట వాస్తవమే అంటున్నారు. ఈ జ్వరం ఐదు రోజుల నుంచి వారం

మిగతా 6వ పేజీలో


రోగులతో కిటకిటలాడుతున్న జీజీహెచ్‌లోని ఓపీ విభాగం

జీజీహెచ్‌కు పెరుగుతున్న ఓపీలు

ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య వారంరోజులుగా పెరిగింది. సాధారణ రోజుల్లో 700 నుంచి వెయ్యి వరకు ఉండే ఓపీలు గత వారం, పదిరోజులుగా సుమారు 1,500కు చేరాయి. మొత్తం మీద వారంలో 8వేల మంది ఔట్‌పేషెంట్‌లు వివిధ కారణాలతో ఆసుపత్రికి వచ్చినట్లు వైద్యాధికారులు వెల్లడిస్తున్నారు. వారిలో అత్యధిక శాతం మంది జ్వర పీడితులేనని వారు వివరించారు. దీంతో ఆసుపత్రిలోని అన్ని వార్డులు కిటకిటలాడుతున్నాయి.


జ్వరపీడితులతో ఉన్న జీజీహెచ్‌లోని జనరల్ వార్డు

వ్యవసాయ కనెక్షన్లపై నిర్లక్ష్యం వీడండి

విద్యుత్ అధికారులతో సమీక్షలో సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల విషయంలో నిర్లక్ష్యం వీడాలని అధికారులను ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక విద్యుత్ భవన్‌లో జిల్లాలోని ఆశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ ఆర్డీఎస్ఎస్ పనులను వేగవంతం చేయాలని కోరారు. వ్యవసాయ కనెక్షన్‌ల మంజూరు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లు అధికంగా ఏర్పాటు చేసుకోవడం కోసం అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని కోరారు. నిత్యం ఫీడర్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు. స్మార్ట్ మీటర్లపై ఉన్న అపోహలను తొలగించి అవగాహన కల్పించాలని సూచించారు. స్మార్ట్‌మీటర్ల వలన ఉపయోగాలు తెలియజేయాలన్నారు. పీఎం కుసుమ్ పథకం అమలు కోసం కావాల్సిన భూసేకరణను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. సమావేశంలో ఏపీ సీపీడీసీఎల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్, ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లారెడ్డి, పక్కన ఎస్ఈ వెంకటేశ్వర్లు

ప్రజలు లేని ప్రజావేదిక

- ఉపాధి హామీ అధికారులు, తనిఖీ సిబ్బంది మిలాఖత్
- రూ. కోట్ల అవినీతిని కప్పిపుచ్చేందుకు యత్నాలు
- మస్టర్లలో మృతిచెందిన వారి పేర్లు
- ముందే అధికారి సంతకాలు

పెద్దారవీడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెద్దారవీడు మండలంలో ఉపాధి హామీ పథకం ప్రజావేదిక పేరుకే అన్నట్లు తయారైంది. అక్రమాలను, లెక్కల్లో తప్పులను వెలికితీయాల్సిన సామాజిక తనిఖీకి ప్రజలెవ్వరూ హాజరుకాలేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, పనులను తనిఖీ చేసి నివేదిక ఇచ్చే ఉద్యోగులు కుమ్మక్కయ్యారు. సిబ్బంది చేసిన అక్రమాలకు నామమాత్రంగా తప్పులు జరిగినట్లు నివేదికలు తయారు చేశారు. అలా చేయడానికి తనిఖీ చేసిన వారికి భారీ మొత్తం ముట్టజెప్పారన్న ప్రచారం జరుగుతోంది. తనిఖీ సిబ్బంది తయారుచేసిన నివేదికలపై ప్రజావేదిక జరగక ముందే జిల్లాస్థాయి ప్రభుత్వ అధికారి సంతకాలు చేయడం వారి మధ్య ఉన్న సత్సంబంధాలకు నిదర్శనం. అసలు ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రజావేదిక జరుగుతుందన్న సమాచారం మండలంలోని అధికారపార్టీ, ప్రతిపక్ష నాయకులకు, ప్రజలకు కూడా తెలియకపోవడం చర్చనీయాంశమైంది. మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ

మిగతా 6వ పేజీలో


సమావేశానికి హాజరైన ఫీల్డ్ అసిస్టెంట్లు, తనిఖీ సిబ్బంది

జిల్లాకు పెరిగిన నీటి పరిమాణం

- సాగర్ కాలువల్లో సమృద్ధిగా ప్రవహిస్తున్న జలాలు
- ముమ్మరంగా వరినాట్లు వేస్తున్న రైతులు

7


దర్శి వద్ద సాగర్ కాలువలో ప్రవహిస్తున్న నీరు

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు చర్యలు
- నేటి నుంచి పది రోజులపాటు స్పెషల్ డ్రైవ్

6

అంతా రహస్యం

(5వ పేజీ తరువాయి)

డీఎల్‌సీవో, గుంటూరులోని ఒక అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లను నియమిస్తూ కమిషనర్ గతంలోనే ఉత్తర్వులు ఇచ్చారు. అయితే తొలి విడత విచారణకు వస్తున్న సమయంలో వారిని విచారణాధికారి తన వెంట తీసుకురాలేదు.

డీజీఎం కేడర్ అధికారి కేటాయింపు

విశ్వసనీయ సమాచారం మేరకు.. మంగళవారం బ్యాంకు ప్రధాన కార్యాలయానికి ఉదయం 11 గంటల ప్రాంతంలో వచ్చిన విచారణాధికారి గౌరీశంకర్ సాయంత్రం వరకు బ్యాంకు పైఅంతస్తులోనే ఉన్నారు. తొలుత పలు అంశాలపై అధికారులతో మాట్లాడారు. తనకు అవసరమైన రికార్డులు అందజేయాలని, బ్యాంకు తరఫున ఒక అధికారిని సమన్వయం కోసం కేటాయించాలని కోరినట్లు తెలిసింది. దీంతో డీజీఎం కేడర్ అధికారికి సంబంధిత బాధ్యతలను సీఈవో అప్పగించినట్లు సమాచారం. అయితే విచారణ ఎలా సాగింది, రికార్డులను పరిశీలన చేశారా, లేదా అనే అంశాలు తెలియాల్సి ఉంది.

విచారణ తీరుపై విమర్శలు

బ్యాంకు ప్రధాన కార్యాలయం లోపలికి మీడియాను అనుమతించకపోవడం, ఉద్యోగులను ఐడీ కార్డులు చూపి సంతకాలు చేసి వెళ్లాలని ఆంక్షలు పెట్టడం వంటి అంశాలను ప్రస్తుత బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య దృష్టికి తీసుకెళ్లి వివరణ అడగ్గా ఉద్యోగుల విషయంలో రిజిస్టర్‌లో సంతకాలు పద్ధతిని తన సూచన ప్రకారమే ఏర్పాటు చేశారన్నారు. బ్యాంకు కార్యాలయంలోకి ఎవరు వస్తున్నారు, ఎవరెవరిని కలుస్తున్నరనే దానిపై స్పష్టత కోసం ఏర్పాటు చేశామన్నారు. అయితే మీడియా విషయంలో తన పాత్ర లేదని స్పష్టం చేశారు. కాగా తొలిసారి విచారణ తూచ్ అనిపించిన విచారణాధికారి ఈసారి నేరుగా బ్యాంకుకు రావడం, ఇతరులు కలిసే అవకాశం లేకపోవడం, మీడియాను అనుమతించకపోవడం వంటి చర్యలతో విచారణ తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ తరహా తతంగం అంతా గతంలో అక్రమాలకు పాల్పడి ప్రస్తుతం బ్యాంకు పాలకవర్గం దగ్గర కీలక వ్యక్తులుగా మసులుతున్న ఉద్యోగుల పనేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇంటికో బాధితుడు

(5వ పేజీ తరువాయి)

రోజుల వరకు ఉంటుందని తెలియజేస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుని డాక్టర్‌ను సంప్రదించి, వైద్య సహాయం పొందితే ప్రమాదం ఏమీ ఉండదని అంటున్నారు.

ముందస్తు చర్యలు కరువు

జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో దోమలదాడి తీవ్రమైంది. పట్టించుకోవాల్సిన యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహిస్తోంది. జిల్లా అంతటా ఇదే పరిస్థితి ఉంది. ప్రధానంగా నగరంలో పలు స్థలాల్లో మరుగునీరు నిలిచి కంపుకొడుతోంది. అంతేకాకుండా ఎటువంటి వ్యాధులు రాకుండా బ్లీచింగ్, ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో ఆయిల్ బాల్స్ విడుదల, మురుగు నీటి కుంటలు, చెరువుల్లో గంబూషియా చేపల విడుదల చేయకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇప్పటికీ ఆదిశగా చర్యలు కూడా లేకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

వాతావరణంలో మార్పులే కారణం

పగటి వేళ మండుతున్న ఎండ, రాత్రివేళలో ఉక్కపోత ఆపై వేకువజామున చలి, అప్పుడప్పుడూ వర్షం.. ఈ కారణంగానే ఇలాంటి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు వెల్లడిస్తున్నారు. ప్రతి సంవత్సరం మూడు సీజన్ల మధ్యలో ఇలా జరగడం సర్వసాధారణం అంటున్నారు. అయితే ముందస్తు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని వెల్లడిస్తున్నారు.

బాధితుల్లో కనిపిస్తున్న లక్షణాలు ఇవీ..

- ఒళ్లు నొప్పులు... తలనొప్పి... నీరసం...
- మూడు రోజులపాటు సాధారణ జ్వరం
- ఆ తర్వాత మరో ఐదు రోజులు ఆగకుండా కఫంతో కూడిన దగ్గు
- గొంతునొప్పి, ఎడతెరిపి లేని దగ్గు కారణంగా ఛాతీలో అసౌకర్యం
- గొంతు బొంగురుపోయి మాటలో తేడా రావడం.
- ముక్కు నుంచి జలుబు నీరులాగా కారుతుంది.

కీలక రంగాలపై దిశానిర్దేశం

(5వ పేజీ తరువాయి)

తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూశాఖలో లోపాలపై సీఎం తీవ్రంగా స్పందించారు. భూ సమస్యల పరిష్కారంలో మరింత క్రియాశీలకంగా పనిచేయల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. కలెక్టర్ తమ సమయంలో పదిశాతం వాటి కోసం పనిచేయాలని చెప్పారు. అలాగే ఇసుక, లిక్కర్ విషయాల్లో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ సదస్సులో జిల్లా నుంచి రాష్ట్ర మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, కలెక్టర్ పి.రాజాబాబు పాల్గొన్నారు. ఇక్కడ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిఎరెండు రోజులు మాత్రమే కావడంతో కలెక్టర్ రాజాబాబు ప్రత్యక్షంగా సమావేశంలో మాట్లాడే అవకాశం తీసుకోలేదని సమాచారం. మంగళవారం సాయంత్రం శాంతిభద్రతలపై జరిగిన సమీక్షకు జిల్లా నూతన ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు కూడా హాజరయ్యారు.

ప్రజలు లేని ప్రజావేదిక

(5వ పేజీ తరువాయి)

జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని 19 పంచాయతీలలో 637 పనులు చేసినట్లు, అందుకుగాను రూ.19,53,61,418కోట్లు ఖర్చు చేసినట్లు నిర్ధారించారు. ఆయా పనుల తనిఖీలకు సంబంధించి ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి. అయితే తనిఖీలలో వెలుగు చూసిన విషయాలను కప్పిపుచ్చేందుకు తనిఖీ, ఉపాధి సిబ్బందికి మధ్య భారీ స్థాయిలో ఆర్థిక ఒప్పందాలు కుదిరినట్లు సమాచారం.

మృతి చెందినవారికీ మస్టర్లు

మండలంలోని తోకపల్లి పంచాయతీ పరిధిలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి అక్రమాలు జరిగినట్లు తనిఖీ సిబ్బంది గుర్తించారు. తోకపల్లి పరిధితో మూడేళ్ల కిందట మృతి చెందిన నలుగురికి ఉపాధి పనులు చేసినట్లు తనిఖీ సిబ్బంది పరిశీలించి, వారిలో ముగ్గురికి మస్టర్లు వేసినప్పటికీ వేతనాలు ఒక్కరికి మాత్రమే ఇచ్చినట్లు నివేదికలో పేర్కొన్నారు.

సమావేశానికి ముందే అధికారి సంతకాలు

సామాజిక తనిఖీలో సిబ్బంది ఇచ్చిన నివేదికలపై జిల్లా స్థాయి అధికారి సమావేశం అనంతరం ప్రజావేదికలో ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను పూర్తిగా వినాలి. ఆ తర్వాత మాత్రమే ఆ నివేదికపై సంతకాలు చేయాలి. కానీ మంగళవారం ప్రజావేదిక జరగక ముందే ఆ అధికారి ఎంపీడీవో చాంబర్‌లో కూర్చొని తనిఖీ సిబ్బంది ఇచ్చిన నివేదికలపై సంతకాలు చేయడం అనుమానాలకు తావిస్తుంది.

పశుసంవర్ధక శాఖలో 15 మంది జేడీలకు పోస్టింగ్‌లు

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్ల నుంచి జాయింట్ డైరెక్టర్లుగా తాత్కాలిక పదోన్నతి పొందిన 15మందికి పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పి.ప్రేమ్‌చంద్- అనంతపురం జేడీ, జి.సుబ్బమ్మ- విజయవాడ ఎండీ కాఫ్, కె.శ్రీనివాసులు-విజయవాడ వీఎస్ఎస్‌హెచ్, ఎం.రత్నజ్యోతి-డైరెక్టరేట్, బి.చంద్రశేఖర్-చింతలదీవి ఎన్‌కేబీసీ, కె.మురళీకృష్ణ-విజయనగరం జేడీ, కె.భూపాల్‌రెడ్డి-డైరెక్టరేట్, డి.శంకరరావు-విశాఖపట్నం జేడీ, బి.ప్రసాదరావు-ఏలూరు జేడీ, ఎస్.వెంకటేశ్వరరావు- ఒంగోలు జేడీ, టి.వి.సుధాకర్-డైరెక్టరేట్, డి.ఉమామహేశ్వరి-చిత్తూరు జేడీ, వి.దుర్గాప్రసన్నబాబు-డైరెక్టరేట్, కె.వి.వి.సత్యనారాయణ-గుంటూరు జేడీ, పి.వెంకటరమణ-శ్రీకాకుళం జేడీగా నియమితులయ్యారు. కాగా తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ నియంత్రణలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు రాయల్‌రెడ్డి, శివసాగర్‌రెడ్డిల డిప్యూటేషన్‌ను మరో ఏడాది పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పర్చూరులో పిచ్చికుక్క దాడి

- పదిమందికి తీవ్రగాయాలు
- ప్రజలు బెంబేలు





పిచ్చికుక్క దాడిలో గాయపడిన ఇద్దరు బాలురు

పర్చూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పిచ్చికుక్క దాడిచేసి పదిమందిని గాయపరచిన ఘటన మంగళవారం పర్చూరులో చోటుచేసుకుంది. ఈ దాడిలో గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పిచ్చికుక్క దాడి ఘటనతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. బాధితులతో పర్చూరు ప్రభుత్వ వైద్యశాల కిక్కిరిసింది. ఒక్కసారిగా కుక్కదాడిలో గాయపడిన వారు వైద్యశాలకు తరలి రావడంతో అసలు ఏమి జరిగిందో అర్థంకాక వైద్యులు సైతం ఆందోళనకు గురయ్యారు. ఆ దాడిలో అధిక సంఖ్యలో చిన్నారులు ఉన్నారు. వీధి కుక్కలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, అనేక మార్లు పంచాయితీ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకున్న నాధుడే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. పశువులను, అనేక వీధికుక్కలను సైతం పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచిందని స్థానికులు తెలిపారు. దీంతో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



వలంటీర్ ఉపాధ్యాయులకు వయోజన విద్య పుస్తకాలను అందజేస్తున్న ఏపీఎం, వయోజన విద్య పర్యవేక్షకులు

నూరుశాతం అక్షరాస్యత సాధించాలి

చినగంజాం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ఉల్లాస్-అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యతను నిర్మూలించి, నూరుశాతం అక్షరాస్యతను సాధించడానికి కృషి చేయాలని ఏపీఎం గద్దె పెదసుబ్బారావు, వయోజన విద్య పర్యవేక్షకులు కొణిదల మనోరంజన్‌బాబులు అన్నారు. వెలుగు కార్యాలయంలో డీఆర్‌డీఏ సీసీలు, యానిమేటర్ల, వలంటీర్ ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం-2020 కి నిర్దేశించిన ప్రకారం చదువురాని వారికి ప్రాథమిక అక్షరాస్యతతో పాటు 21వ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన నైపుణ్యాలను అందజేయటానికి భారత ప్రభుత్వం ఉల్లాస్ పథకం రూపొందించినట్లు తెలిపారు. ఉల్లాస్ పథకం ద్వారా మన రాష్ట్రంలో 2029 సంవత్సరం నాటికి రాష్ట్రంలో నూరుశాతం అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంలో మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్ అక్షర ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో 15 సంవత్సరాలు దాటి చదువురాని వయోజనులను గుర్తించి ,వారి వివరాలు నమోదు చేసుకోలన్నారు. వారికి వలంటరీ ఉపాధ్యాయుల చదువు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీవోలు, స్వచ్ఛంద్ర సంస్థలు, పీ4 మార్గదర్శులు, సహాయ సహకారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షులు, సీసీలు పాల్గొన్నారు.

ఇంటి బాట పట్టిన వలస గొర్రెలు

- రెండు మాసాల నుంచి 10 వేల గొర్రెలు మేతకు బల్లికురవకు రాక
- తిరిగి తమ సొంత ప్రాంతానికి తరలిస్తున్న కాపరులు



బల్లికురవ, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): వలసవచ్చిన గొర్రెల మందలు తిరిగి తమ స్వగ్రామాల బాట పట్టాయి. గత రెండు మాసాల నుండి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు ప్రాంతం నుండి వలస వచ్చిన 10 వేల గొర్రెలు బల్లికురవ మరియు పరిసర గ్రామాల పరిధిలో ఉన్నాయి. తమ ప్రాంతంలో వరి నాట్లు ముందుగా వేయటంతో గొర్రెలకు మేత లేకపోవటంతో వలస వచ్చామని గొర్రెల కాపరులు అంటున్నారు. తిరిగి ఇప్పుడు తమ వద్ద మేత అందుబాటులో ఉండటంతో గొర్రెలను మేపుకుంటు తిరిగి వెళుతున్నామన్నారు. బల్లికురవ సంతమాగులూరు రోడ్డులో గొర్రెల మందలు పెద్ద ఎత్తున ఉన్నాయి. గొర్రెల కాపరులు ఈసందర్భంగా మాట్లాడుతూ తిరిగి తాము మరో పది రోజుల్లో స్వగ్రామాలకు వెళతామని తెలిపారు. ఏటా తాము గొర్రెలను తోలుకొని వస్తుంటామని వారు తెలిపారు.

పచ్చి మేత కొరకు గొర్రెలను తీసుకొచ్చాం

మా ప్రాంతంలో వరి నాట్లు ఉండడంతో మేత అందుబాటులో లేదు. అందుకే మేము 10 వేల గొర్రెలను తోలుకొని వచ్చాం. రెండు మాసాల నుంచి బల్లికురవ ప్రాంతంలో మేత మేపుకున్నాం. తిరిగి మా స్వగ్రామాలకు బయలుదేరాం. ఏటా గొర్రెలను వలస తీసుకస్తుంటాం. వస్తే రెండు మూడు నెలలు ఇక్కడే ఉంటాం.

- ఆదియ్య, గొర్రెల కాపరి, ఏలూరు

అర్జీలను వేగంగా పరిష్కరించేందుకు కృషి

- చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు



అద్దంకి, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు అన్నారు. అద్దంకి నియోజకవర్గానికి సంబంధించి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై ఆయన విచారించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అర్జీదారులను పిలిచి, అధికారులు సమక్షంలో సమస్య పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. మొత్తం 44 అర్జీలు రాగా, అద్దంకి మండలం 20, బల్లికురవ మండలం 9,పంగులూరు మండలం 5, కొరిశపాడు మండలం 6, సంతమాగులూరు మండలం 6 అర్జీలు పెండింగ్ లో ఉండగా ఆర్డీవో విచారించారు. తహసీల్దార్‌లు శ్రీచరణ్, శింగారావు, సుబ్బారెడ్డి, రవినాయక్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు. ముందుగా శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం లో ఆర్డీవో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు చర్యలు
- నేటి నుంచి పదిరోజులపాటు స్పెషల్ డ్రైవ్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపై పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి పది రోజులపాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు. అందుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను కూడా రూపొందించారు. రోజూ ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరుచేసి తీసుకొని వాటిని సంపద తయారీ కేంద్రాలకు తరలించనున్నారు. గ్రామాల చివర్లో చెత్త నిల్వలు లేకుండా చూడటంతోపాటు పక్కా, కచ్చా కాలువల్లో పూడికతీత పనులు చేపట్టనున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోనున్నారు. గ్రామాల్లో కాలువలను శుభ్రం చేయించి మురుగు నిల్వ లేకుండా, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టనున్నారు. బైటెక్స్ ఆయిల్, మలాథిన్‌ను ఫాగింగ్ చేయనున్నారు. ప్రభుత్వం ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయడంతో పంచాయతీల్లో నిధులు కూడా అందుబాటులో ఉన్నాయి. దీంతో కార్యక్రమాన్ని వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శుల సహకారంతో బుధవారం నుంచి స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టనున్నారు. డీడీవోలు, డీఎల్‌డీవోలు, డీఎల్‌పీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు ప్రతిరోజూ ఏదో ఒక గ్రామ పంచాయతీని సందర్శించి అక్కడ జరుగుతున్న స్పెషల్ పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొనాలని డీపీవో వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి బస్టాండ్ ఆవరణలో మంగళవారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2001లో జరిగిన కార్మిక ఐక్య పోరాటమే ఆర్టీసీని నిలబెట్టిందని, ఆనాటి పోరాటంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ కీలకపాత్ర పోషించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎలక్ట్రికల్ బస్సులను నేరుగా ఆర్టీసీకే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి డీపీవీ సుబ్బారావు, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాసరావు, శంషావలి, కామేశ్వరరావు, యేసు, రత్నకుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా డ్వాక్రా సంఘాల లెక్కలు



మాట్లాడుతున్న వెలుగు ఏపీడీ లక్ష్మారెడ్డి

కొండపి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా సంఘాల లెక్కలు ఇకపై పక్కాగా ఉంటాయని వెలుగు ఏపీడీ బి.గోపీనాథ్ తెలిపారు. అందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్‌ను తీసుకొచ్చిందని చెప్పారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం గ్రామ సంఘ సహాయకులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీడీ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ ద్వారా తీసుకున్న నిర్ణయం వలన సభ్యుల లావాదేవీలకు ఆర్థిక భద్రత ఏర్పడుతుందని తెలిపారు. కొత్త యాప్‌ను తీసుకొచ్చినందున ఆర్థిక లావాదేవీలను ఆన్‌లైన్ విధానంలో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం గోపీనాథ్, మల్లికార్జున, వి.కృష్ణారెడ్డి, గోవిందమ్మ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉంటేనే ఉన్నత స్థాయి

మార్టూరు, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి):మద్యపానం, ధూమపానం, గంజాయి అలవాటు, తదితర వ్యసనాలకు దూరంగా ఉంటేనే ఉన్నత స్థాయికి చేరుకో గలుగుతారని, సీఐ ఎం.శేషగిరిరావు విద్యార్థులకు సూచించారు. మంగళవారం మార్టూరులో రాయల్ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన వారితో మాట్లాడుతూ సోషల్ మీడియాను మంచికి వినియోగించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

బల్లికురవ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తజమ్ములమడక ఎస్సీకాలనీకి చెందిన గద్దల పేతురు(36) రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు జమ్ములమడక గ్రామానికి చెందిన గద్దల పేతురు నూనే రమేష్ అను ఇరువురు ద్విచక్రవాహనంపై వినుకొండ వెళుతున్నారు. కూకట్లపల్లి గ్రామ సమీపంలోకి వచ్చేసరికి బొలెరో వాహనం సోమవారం వారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని నర్సారావుపేట వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో పేతురు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాద ఘటనపై మంగళవారం మృతుని బంధువు నూనే సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన

మార్టూరు, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఉద్యానశాఖ తరఫున ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రోత్సాహకాలపై ఉద్యాన శాఖాధికారి బి హనుమంతనాయక్ రైతులకు వివరించారు. మంగళవారం మండలంలోని నాగరాజుపల్లి గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి మురళీ కృష్ణ అధ్యక్షత వహించారు.అనంతరం హనుమంతనాయక్ రైతులతో మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు,పంట దిగుబడి గురించి రైతులకు వివరించారు.పంట సాగుకు ఆసక్తిగలిగిన రైతులకు ఉద్యాన శాఖ ప్రోత్సాహం కల్పిస్తుందన్నారు.ఇంకా ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధి భాషా రైతులకు మరిన్ని విషయాలను వివరించారు.ఈ కార్యక్రమంలో మిన్నెకంటి రవికుమార్, సర్పంచ్ దాసరి నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మో భవానీ సెంటర్

- అద్దంకిలో ఒక వైపు ట్రాఫిక్ జామ్ ... మరో వైపు గోతులు
- చినుకు పడితే వాహనచోదకుల ఇక్కట్లు



అద్దంకి, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవానిసెంటర్ అంటే వాహనచోదకులు హడలి పోతున్నారు. ఐదు రోడ్ల కూడలిగా ఉండడం, అన్ని రోడ్లలో పెద్దఎత్తున వాహనాలు ప్రయాణిస్తుండడంతో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతుంది. భవానిసెంటర్ దాటితే హమ్మయ్య అంటూ వాహనచోదకులు ఊపిరిపీల్చుకునే పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు లేని సమయంలో అయితే వాహనాలు అడ్డదిడ్డంగా ప్రయాణిస్తూ మరింత ఇబ్బందిగా మారుతోంది. ఇది చాలదన్నట్లు రేణింగవరం రోడ్డులో మురుగు నీటిప్రవాహానికి ఏర్పాటు చేసిన పైప్ కల్వర్టు తరచూ పగిలిపోతుంది. విజయవాడ-బెంగళూరు హైవే రోడ్డుకు గ్రావెల్ తరలించే ఎక్కువ బరువు ఉండే టిప్పర్ల ప్రయాణిస్తుండడంతో తరచూ గోతులు పడుతున్నాయి. గోతులలో తాత్కాలికంగా గ్రావెల్ పోసి చదును చేస్తుండడంతో చిన్నపాటి వర్షంకురిసా. మరోసారి గోతులు పడుతున్నాయి. అదేసమయంలో పైప్ కల్వర్ట్ దెబ్బతిని రంధ్రాలు పడుతున్నాయి. దీంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇక దర్శి రోడ్డులో పరిస్థితి కూడా మరింత ఇబ్బందిగా ఉంది. నామ్ రోడ్డులో నుంచి దర్శి రోడ్డులో కలిసే చోట సీసీ రోడ్డు ఏర్పాటు చేయకుండా తారురోడ్డు తో సరిపెట్టడం, వర్షపు నీరు సైడ్ డ్రైన్లలోనికి వెళ్లే వీలు లేక పెద్ద గోతులు పడుతున్నాయి. దీంతో వర్షం పడితే గోతులలో నీరు నిలిచి వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇలా అన్ని విధాలుగా భవానిసెంటర్ అంటే వాహనచోదకులు హడలి పోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించడంతో పాటు తరచూ గోతులు పడే ప్రాంతంలో శాశ్వతంగా కల్వర్టు నిర్మాణం చేసి సీసీ రోడ్డు వేయాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

అశోక్‌కుమార్‌కు వైసీపీ నేతల శుభాకాంక్షలు

అద్దంకి,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి):అద్దంకి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా నియమితుడైన డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్‌ను మంగళవారం సాయంత్రం పిడుగురాళ్లలో అద్దంకి పట్టణ వైసీపీ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అద్దంకి పట్టణ వైసీపీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఈదా శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎస్తేరమ్మ, వైస్‌ఛైర్మన్ అనంతలక్ష్మి, కౌన్సిలర్లు బాలు, కోటేశ్వరరావు, రమణ, నేతలు మురహరి, భువనేశ్వరి, నాగరాజు, పరిమి ప్రసాద్, సోమా శ్రీనివాసరెడ్డి, విప్పర్ల వెంకటేశ్వర్లు తదితరులు అశోక్‌కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ మండల కమిటీ ఏకగ్రీవం



సింబోతుల సత్యనారాయణ

మేదరమెట్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కొరిశపాడు మండల టీడీపీ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ముప్పవరంలోని పార్టీ కార్యాలయంలో సమావేశమైన టీడీపీ నేతలు సమావేశమయ్యారు. మండల పార్టీ అధ్యక్షుడుగా సింబోతుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా గండే ఎస్కేల్, ఉపాధ్యాక్షుడిగా మోపర్తి లక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నక్కల బుల్లిబాబు, కందిమళ్ల విశ్వనాథ్, కోణికి అశోక్‌లు, కార్యదర్శులుగా మామిళ్లపల్లి సుమా, ఈ.సుబ్బారెడ్డి, బొమ్మిశెట్టి రాజ్యలక్ష్మిలు, కోశాధికారిగా రేగుల నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటిని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభినందించారు. అందరిని సమన్వయం చేసుకుంటూ ఐక్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. నూతనంగా ఎంపికైన కమిటి మంత్రి రవికుమార్‌కు, తమను ఎన్నుకున్న మండల పార్టీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

పశుసంవర్ధకశాఖ జేడీగా వెంకటేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్‌గా వెంకటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం జిల్లాలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును ఉద్యోగోన్నతిపై ఇక్కడ నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న జేడీ డాక్టర్ బేబిరాణి సెలవుపై వెళ్లడంతో పశుక్షేత్రంలో డీడీగా పనిచేస్తున్న డాక్టర్ రవి ఇన్‌చార్జి జేడీగా పనిచేస్తున్నారు. ఆ స్థానంలో వెంకటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెళ్లకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్వాయిపాడు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు... ప్రకాశం జిల్లా తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన రంపతోటి శ్రీనివాసరావు(31) శ్రీకాళహస్తి వైపు మోటార్‌బైక్‌పై వెళ్తుండగా తిరుపతి జిల్లా తాళ్వాయిపాడు సర్వీస్‌రోడ్డు వద్ద అదుపుతప్పి కింద పడిపోయాడు. హెల్మెట్ తల నుంచి విడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడికే మృతిచెందాడు.

ఉన్నత విద్యామండలిలో ఇద్దరు వైస్ ఛైర్మన్ల నియామకం

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలిలో రెండు వైస్ ఛైర్మన్ పోస్టులను భర్తీ చేస్తూ ఉన్నత విద్యాశాఖ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. వైస్ ఛైర్మన్-1గా శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావును, వైస్ ఛైర్‌పర్సన్-2గా నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ రత్నశీల మణిని నియమించింది. వీరి పదవీ కాలం మూడేళ్లు. గత ప్రభుత్వం నియమించిన ఇద్దరు వైస్ ఛైర్మన్లలో ఒకరి పదవీకాలం ఇటీవల ముగియగా, మరొకరు రాజీనామా చేశారు. ఆయా స్థానాలను కూటమి ప్రభుత్వం ఇప్పుడు భర్తీ చేసింది.

వేగంగా 'వెళ్తున్నారు'!

- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- జాతీయ రహదారిపై జాగ్రత్తలు లేని ప్రయాణం
- గత ఏడాది 46చోట... ఈ ఏడాది ఇప్పటికి 14 చోట్ల యాక్సిడెంట్లు


గతేడాది బస్సు టిప్పర్ ఢీకొన్న దృశ్యం

త్రిపురాంతకం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొంతమంది మితిమీరిన వేగంతో వెళ్తూ మృత్యువాత పడుతున్నారు. రోడ్డు బాగుందని వేగం పెంచటం నిర్లక్ష్యపు డ్రైవింగ్‌లతో రహదారిని రక్తమోడేలా చేస్తున్నారు. రహదారి నిబంధనలు ఎన్ని ఉన్నా, ఎందరు చెబుతున్నా పట్టించుకోని కొందరివల్ల జాగ్రత్తగా వెళుతున్నవారు కూడా కొందరు ప్రమాదాల బారినపడి ఇబ్బందులు పడుతున్నారు.

- ఇటీవల అన్నసముద్రం మెట్ట వద్ద భార్యాభర్తలు బైక్‌పై త్రిపురాంతకం వైపు వస్తూ జాతీయ రహదారిపైకి ఎక్కిన కొద్దిసేపటికే వినుకొండవైపు వెళ్లే వాహనం తన పక్క వాహనాన్ని ఓవర్‌టేక్ చేయాలని చూడటంతోనే వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యభర్తలు ఇద్దరు అక్కడికక్కడే మరణించారు.
- త్రిపురాంతకం మండల పరిధిలోని ఎన్‌హెచ్ 544డీపై గత ఏడాది నుంచి జరిగిన రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే అన్ని ప్రమాదాల్లో 80 శాతం ప్రమాదాలకు కారణం మాత్రం అతివేగం, నిర్లక్ష్యం అని పోలీసుల రికార్డుల్లో నమోదై ఉన్నాయి. జాతీయ రహదారిపై పలు సూచికల బోర్డులు ఉన్నప్పటికీ వాటిని గమనించే స్థితిలో కూడా వారి వేగం ఉండటం లేదనేది ప్రమాద సమయంలో ప్రత్యక్షంగా చూసినవారు చెబుతున్నారు. కొన్ని ప్రమాదాలకు ద్విచక్ర వాహనదా రులు కారణమవుతున్నారు. వారికి వాహన చోదకంపై సరైన అవగాహన లేకపోవటం,



త్రిపురాంతకం పరిధిలో జరిగిన ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	క్షతగాత్రులు	మరణాలు
2024	46	46	18
2025 (ఇప్పటికీ)	14	14	7

జాతీయ రహదారిపై ఇష్టారీతిగా ప్రయాణించటం, హెల్మెట్ లేని ప్రయాణం కారణంగా ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నవారు కొందరైతే ఎదుటివారి మరణానికి కారణమవుతున్నవారు మరికొందరు. మరికొన్ని ప్రమాదాలు జాతీయ రహదారి పక్క గ్రామాల నుంచి వస్తూ రోడ్డుపైకి చేరుకునే సమయంలో చోటుచేసుకుంటున్నాయి. ఉదాహరణకు అన్నసముద్రం మెట్ట వద్ద ఆ గ్రామం నుంచి జాతీయరహదారిపైకి ఎక్కగానే ఏదోఒక వైపునుంచి వస్తున్న వాహనాలు వారిని ఢీకొని ప్రమాదాలు జరగుతున్నాయి. 2024 నుంచి ఇప్పటివరకు ఇదే స్థలంలో రెండు ప్రమాదాల్లో ఇద్దరేసి చొప్పున నలుగురు మరణించారు. మొత్తానికి రహదారి భద్రతా ప్రమాణాలు తెలుసుకోకుండా రోడ్డు నిబంధనలు పాటించకుండా మితిమీరిన వేగంతోపాటు నిర్లక్ష్యంతో వాహనాలు నడపటం, మద్యం సేవించి నడపటం లాంటి కారణాలెన్నైనా చివరకు మరణాల పాలవుతున్నవారే ఎక్కువవుతున్నారు.

జాగ్రత్తగా నడిపితే నీకు ఎదుటివారికీ రక్షణ

మీ వాహనం మీ ఇష్టం అన్నట్టు కాకుండా మీపై మీ కుటుంబం ఆధారపడి ఉందని గుర్తుచేసుకుంటూ జాగ్రత్తగా వాహనాలు నడిపితే నీకు, ఎదుటివారికి కూడా రక్షణ ఉంటుంది. పోలీసుశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు అవగాహన కార్యక్రమాలు ఫలితాలిస్తున్నాయి. అందువల్లే గతేడాది కన్నా ఈ ఏడాది ప్రమాదాల సంఖ్య తగ్గింది. ఇంకా రహదారి నిబంధనలు తెలుసుకుని వాహనచోదకులు తగిన జాగ్రత్తలతో నడిపి సురక్షితంగా మీరు, ఇతరులు ఇళ్లకు చేరండి. **- శివ బసవరాజు, ఎస్సై, త్రిపురాంతకం**

18న ఆర్టీసీ కార్గోలో పలు పార్శిళ్లు వేలం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో నడపబడుతున్న కార్గో సర్వీసులో బుక్ చేసుకుని తీసుకుని వెళ్లని గుర్తింపులేని పార్శిళ్లలోని వస్తువులను ఈనెల 18న బహిరంగ వేలం వేస్తున్నట్లు బాపట్ల, ప్రకాశం ఆర్టీసీ ఏటీఎం (కమర్షియల్) అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు గురువారం ఉదయం 10 గంటలకు, ఒంగోలు, బాపట్ల కార్గో సెంటర్‌లో వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

పీఆర్సీ కమిటీని నియమించాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీని ఇచ్చేందుకు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో కమిటీని నియమించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పే అండ్ అకౌంట్స్ ఆఫీసు ఆవరణలో 'రండి టీ తాగుతూ మాట్లాడకుందాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పీఆర్సీ కమిటీని నియమించి ఉద్యోగులకు ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులకు రావాల్సిన డీఎలతో పాటు ఆర్థిక బకాయిలను విడుదల చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు, శ్రీనివాసులు, చంద్రశేఖర్, ఉద్యోగులు నరసింహరావు, రమేష్, వెంకటేశ్వరరావు, భాష పాల్గొన్నారు.

అనుమతి మేరకే పొగాకు పండించాలి

మద్దిపాడు, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి):రైతులు తమకు కేటాయించిన కోటాకు లోబడి పొగాకు సాగు చేసుకోవాలని పొగాకు బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ తెలిపారు. మంగళవారం వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతూ బ్రెజిల్, జింబాబ్వే, చైనాలాంటి దేశంలో అధిక పొగాకు ఉత్పత్తి కారణంగా మన రైతులు తమ పంటను మంచి ధరకు అమ్ముకోలేకపోతున్నారన్నారు. లోగ్రేడ్ పొగాకు అమ్మకాలు మందకొడిగా ఉన్నాయని, రైతులు అధిక ధరలకు బ్యారన్, భూములు కౌలుకి తీసుకుంటే నష్టపోతారన్నారు. వేలం కేంద్రం కార్యనిర్వహణాధికారి రామకృష్ణ మాట్లాడుతూ ఈ సంవత్సరం నుంచి రిజిస్ట్రేషన్ మూడేళ్లకు ఒకసారి మంజూరు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు అబ్బూరి శేషగిరిరావు, నారిపెద్ది వరహాల చౌదరి, బోయపాటి వెంకయ్య చౌదరి, బి.సురేంద్ర బాబు, బోడపాటి శ్రీనివాసరావు, కనపర్తి ఆంజనేయులు, సుబ్బారెడ్డి, అన్నాబత్తిని శ్రీనివాసరావు, మండవ గోవిందరాజులు, మండవ శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూరి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి పట్టివేత

- ఇద్దరిపై కేసులు నమోదు ● 13.500 కిలోల సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రైల్వే డీఎస్పీ మురళీధర్



ఒంగోలుక్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పూరి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహించి 13.500 కిలోల గంజాయి, రూ.75 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే డీఎస్పీ జి.మురళీధర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సోమవారం ఒంగోలు రైల్వేస్టేషన్‌లో క్రాసింగ్‌లో ఉన్న రైలులో ఈగల్ టీమ్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రైల్వే పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో రెండు బోగీల్లో గంజాయి తరలిస్తున్న ఇరువురుని అదుపులోకి తీసుకున్నారు. కేరళలోని కానూర్‌కు చెందిన ముజిరబ్ రహమాన్ పూరి ఎక్స్‌ప్రెస్‌లో ఓ బోగిలో పోలీసులను చూసి పరారీ అవుతుండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 5.350 కిలోలు గంజాయి, రూ.75 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. రహమాన్ ఒరిస్సాలోని రాయఘడ్ వెళ్లి అక్కడ గుర్తుతెలియని వ్యక్తి వద్ద గంజాయిని రూ.10 వేలకు కొనుగోలు చేశాడు. ఈ గంజాయిని కేరళ తీసుకెళ్లి అధిక ధరకు విక్రయిస్తుంటాడు. రహమాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

8.150 కిలోలు గంజాయి స్వాధీనం

పూరీ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహిస్తున బృందం మరో బోగీలో సోదాలు చేస్తుండగా అక్కడ అనుమానితంగా ఉన్న మహిళ వద్ద 8.150 కిలోలు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే డీఎస్పీ తెలిపారు. ఒడిశాకు చెందిన రెణుబ్యాల బేహర్ అనే మహిళ తిరుపతిలో కూలి చేసుకునేందుకు వెళుతూ తనతోపాటు గంజాయి కొనుగోలు చేసి తీసుకెళుతోంది. మొత్తం గంజాయి రూ.16 వేలకు కొనుగోలు చేసింది. తిరుపతిలో ప్యాకెట్లు చేసి విక్రయిస్తుంది. అమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సమావేశంలో రైల్వే సీఐ ఎస్‌కే.మౌలషరీఫ్, ఆర్పీఎఫ్ సీఐ కొండయ్య, ఎస్సై సుబ్బమ్మ, రైల్వే ఎస్సై మధుసూదనరావు సిబ్బంది పాల్గొన్నారు.

టార్గెట్ బాల్ జాతీయ పోటీలకు
పాతసింగరాయకొండ విద్యార్థులు


టార్గెట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

సింగరాయకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతసింగరాయకొండ జడ్పీ హైస్కూల్‌కి చెందిన ముగ్గురు విద్యార్థులు టార్గెట్‌బాల్ జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టార్గెట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని ప్రకాశం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టులో విశేష ప్రతిభ కనబరిచిన పాతసింగరాయకొండ హైస్కూల్ విద్యార్థులు ఎం.దీలీప్, డి.అక్షర, ఏ.వర్షిణి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. వీరు అక్టోబరు నెలలో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను మంగళవారం హెచ్‌ఎం సీహెచ్ పద్మజ, వ్యాయామ ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఎండీ అన్వర్, గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

రైతు ఆత్మహత్యపై విచారణ

తర్లుపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతలపాడులో అప్పుల బాధతో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న రాచకొండ కాశయ్య మృతిపై త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టింది. కాశయ్య ఇంటికి వెళ్లి ఆయనకు ఎంత అప్పు ఉంది, గతంలో ఏయే పంటలు వేశారు, ఎంత నష్టం వచ్చిందని కుటుంబ సభ్యులను అడిగి నమోదు చేశారు. గతేడాది ఐదెకరాల మిర్చి, బర్లీ పొగాకు మూడెకరాలు వేసి తీవ్రంగా అప్పుల పాలైనట్లు కుటుంబ సభ్యులు అధికారులకు చెప్పారు. సుమారు రూ.15లక్షల మేర అప్పులు ఉన్నట్లు తెలిపారు. త్రిసభ్య కమిటీలో తహసీల్దార్ కేకే కిశోర్ కుమార్, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు, వ్యవసాయ అధికారి జోత్స్నదేవి ఉన్నారు.


మురారిపల్లి చెరువు వద్ద పిచ్చిచెట్ల మధ్య తొట్టె



తొట్టె నిండా నిర్లక్ష్యం

పశువుల దాహం తీర్చేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన పశువుల తొట్టెలను నిర్లక్ష్యంగా వదిలేశారు. నీరు నింపడం మాట అటుంచితే.. అవి చిల్లచెట్లతో నిండిపోయాయి. సమీపంలో ఉన్న రైతులైనా వీటిని బాగుచేస్తే పశువుల దాహార్తి తీరుతుందన్న ఆలోచన కూడా రాకపోవడం బాధాకరం. ఆ శాఖ సిబ్బంది కూడా వీటిపై శ్రద్ధపెట్టి రైతుల్లో అవగాహన తెచ్చి నిర్వహణ బాధ్యతలు చూడకుంటే లక్షలు ఖర్చుపెట్టి నిర్మిస్తున్న తొట్టెలు నిరుపయోగంగానే మిగిలిపోతాయి. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇలాంటివి చాలాచోట్ల కనిపిస్తున్నాయి. ఈ ఫొటోల్లో కనిపించేది ఎర్రగొండపాలెం మండలం మురారిపల్లి చెరువు వద్ద ఒకటి, పుల్లలచెరువు మండలం రంగన్నపాలెం వద్ద మరొకటి. ఇప్పటికైనా అధికారులు వాటిని వినియోగంలోకి తీసుకురావలసిన అవసరం ఉంది. - త్రిపురాంతకం, ఆంధ్రజ్యోతి

జిల్లాకు పెరిగిన నీటి పరిమాణం

- సాగర్ కాలువల్లో సమృద్ధిగా ప్రవహిస్తున్న జలాలు ● ముమ్మరంగా వరినాట్లు వేస్తున్న రైతులు

దర్శి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువలకు నీటి పరిమాణం గణనీయంగా పెరిగింది. జిల్లాకు వాటా ప్రకారం నీరు విడుదల చేస్తున్నారు. దీంతో అన్నదాతలు మాగాణి దమ్ము చేసి ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. ఇటీవల వరకు జిల్లాకు సాగునీరు తక్కువగా పంపిణీ చేస్తుండటంతో మేజర్లు, మైనర్లకు నీరందక రైతులు ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. ఆంధ్రజ్యోతి ప్రకాశంలో ఈనెల 14వ తేదీన 'సాగర్ నీరందక గగ్గోలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. దీంతో జిల్లాలోని సాగర్ కాలువలకు నీటి పరిమాణం పెంచారు. ప్రస్తుతం సాగర్ ప్రధాన కాలువలతో పాటు బ్రాంచ్ కాలువలకు పుష్కలంగా నీరు విడుదల అవుతుండటంతో అన్ని ప్రాంతాల్లోని మేజర్లు మైనర్లకు నీరు చేరుతుంది.

నీటి పంపిణీ వివరాలు

సాగర్ జలాశయం నుంచి సాగర్ కుడి కాలువకు అధికారుల లెక్కల ప్రకారం 9500 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా బుగ్గవాగుకు చేరుతుంది. బుగ్గవాగు నుంచి సాగర్ ప్రధాన కాలువకు 9170 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు. ఆ నీటిని గుంటూరు బ్రాంచ్ కాలువకు 1900 క్యూసెక్కులు, అద్దంకి బ్రాంచ్ కాలువకు 1350 క్యూసెక్కుల నీరు పంపిణీ చేస్తున్నారు. సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలుకు (ప్రకాశం బార్డర్) 2947 క్యూసెక్కుల నీరు సరఫరా



చేస్తున్నారు. ఆ నీటిని దర్శి బ్రాంచ్ కాలువకు 1976 క్యూసెక్కులు, పమిడిపాడు బ్రాంచ్ కాలువకు 612 క్యూసెక్కులు, ఒంగోలు బ్రాంచ్ కాలువకు 809 క్యూసెక్కులు పంపిణీ చేస్తున్నారు. వారం రోజుల క్రితం జిల్లా బార్డర్ 85/3 మైలుకు కేవలం 2350 క్యూసెక్కుల నీరు మాత్రమే అందించారు. అందువల్ల ఒంగోలు బ్రాంచ్ కాలువకు వచ్చేసరికి కేవలం 530 క్యూసెక్కుల నీరు అందుతుంది. దీంతో ఇక్కడ మేజర్లు, మైనర్లకు నీరందక వరినాట్లు నిలిచి అన్నదాతలు గగ్గోలు పెట్టిన విషయం తెలిసిందే. రైతుల ఇబ్బందులను గుర్తించిన ఉన్నతాధికారులు జిల్లాకు ప్రస్తుతం పుష్కలంగా నీరు విడుదల చేస్తున్నారు. కొంతకాలం నీరు సరఫరా చేస్తే అన్ని ప్రాంతాల్లో సకాలంలో వరినాట్లు పూర్తయ్యే అవకాశం ఉంటుంది.

సచివాలయ సెక్రటరీలు.. సత్తా చాటారు..!

టీచర్ ఉద్యోగాలకు ఎంపికైన వైనం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వారంతా నిన్న మొన్నటివరకు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చేందుకు పనిచేశారు.. ప్రతి నిత్యం ప్రజలతో మమేకమై, వివిధ సంక్షేమ పథకాలను అమలులో వారి వంతు కృషిని చూపారు. ఇకపై వారు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించనున్నారు. ప్రజాప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ ఫలితాల్లో ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో పలు సచివాలయాలలో పనిచేస్తున్న 14 మంది సచివాలయ సెక్రటరీలు మెగా డీఎస్సీలో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ కే వెంకటేశ్వరరావు వారిని ప్రత్యేకంగా అభినందించారు. శానిటరీ విభాగంలో సెక్రటరీలుగా ఉన్న ఏడుగురిలో ముగ్గురు స్కూలు అసిస్టెంట్లుగా, మరో ముగ్గురు టీజీటీ, ఒకరు పీజీటీకి ఎంపికకాగా, వెల్ఫేర్ సెక్రటరీలుగా పనిచేస్తున్న నలుగురిలో ముగ్గురు స్కూలు అసిస్టెంట్లుగా, ఒకరు టీజీటికి, అలాగే ఇద్దరు అడ్మిన్ సెక్రటరీలు స్కూలు అసిస్టెంట్లుగా, ఎడ్యుకేషన్ సెక్రటరీలుగా ఒకరు స్కూలు అసిస్టెంట్‌గా ఎంపిక కావడం ఆనందంగా ఉందని కమిషనరు తెలిపారు. అనంతరం ఎంపికైన సెక్రటరీలు మాట్లాడుతూ డీఎస్సీకి సిద్ధం కావడానికి సెలవులు మంజూరు చేసిన కమిషనరుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న దినకర్‌బాబు

చారిత్రక ప్రాంతాల అభివృద్ధికి కృషి

- 20 సూత్రాల పథకం ఛైర్మన్ దినకర్‌బాబు

కంభం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ప్రకాశంలో చారిత్రాత్మక ప్రదేశాలు, చరిత్ర సృష్టించిన వ్యక్తులు జన్మించిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యమని 20 సూత్రాల పథకం రాష్ట్ర ఛైర్మన్ లంకా దినకర్‌బాబు తెలిపారు. మంగళవారం మార్కాపురం డివిజన్ ప్రాంత పర్యటనలో భాగంగా ఆసియా ఖండంలోనే అతి పెద్ద చెరువుగా పేరుగాంచిన కంభం చెరువు, ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మించిన మోక్షగుండం, సంగీత విద్వాంసులు త్యాగయ్య జన్మించిన అర్ధవీడు మండలం కాకర్ల గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా దినకర్‌బాబు కంభంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కంభం చెరువులో బోటు షికారు, కట్టపై విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా మారుస్తామన్నారు. ప్రసిద్ధ సంగీత విద్వాంసుడు త్యాగయ్య పూర్వీకులు జన్మించిన అర్ధవీడు మండలం కాకర్లలో త్యాగరాజు స్మారక మందిరాన్ని ఏర్పాటు చేసి అభివృద్ధి చేసి త్యాగయ్య విశిష్టతను తెలియజేయాలన్నారు. అంతకు ముందు ఆయన మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, అధికారులతో ఇరవై సూత్రాల కార్యక్రమాలపై దినకర్ ఎంపీడీవో కార్యాలయంలో సమావేశమయ్యారు.

మంత్రి స్వామిని కలిసిన కలెక్టర్ రాజాబాబు



ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామిని కలెక్టర్ రాజాబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. మూడు రోజుల క్రితం కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజాబాబు మంగళవారం రాత్రి తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రికి బొకే ఇచ్చి అభినందించారు. అనంతరం జిల్లాకు సంబంధించిన అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజా సమస్యలపై చర్చించారు.

చీమకుర్తిలో రేపటి నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు


మాట్లాడుతున్న ఎస్‌జీఎఫ్ సెక్రటరీ స్వరూపావాణి

చీమకుర్తి, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి పోటీలను చీమకుర్తి మండలంలో గురు, శుక్రవారాల్లో రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన సన్నాహక సమావేశాన్ని మంగళవారం చీమకుర్తి ఉన్నతపాఠశాల ఆవరణలో నిర్వహించారు. 18వ తేదీన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా, బ్యాడ్మింటన్, చెస్ పోటీలు చీమకుర్తి ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో, 19న అథ్లెటిక్స్ బండ్లమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ డి.స్వరూపావాణి తెలిపారు. ఈ సమావేశంలో ఎంఈఓలు నరసింహారావు, శివాజీ, హెచ్‌ఎంలు ఎన్‌వీఎస్ కుమార్, పద్మావతి, శ్రీనివాసరావు, భాస్కరశాస్త్రి, జీఎస్‌ఆర్ సాయి, పీడీలు పాల్గొన్నారు.

ఘనంగా ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం

ఒంగోలు విద్య, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన, వ్యక్తిత్వ పోటీలను నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కళ్యాణి ఓజోన్ పొర ప్రాధాన్యతను వివరించారు. ఓజోన్ పొర భూమిపైకి వచ్చే అతినీల లోహి కిరణాలను ఆపివేసి భూమికి రక్షణ పొరగా పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీలు డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పీవీ హేమలత, డాక్టర్ కే ప్రతాప్, డాక్టర్ ఈ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బసవన్నపాలెం విద్యార్థులు

మద్దిపాడు, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసవన్నపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్ పోటీలకు ఆర్.సుదర్శన్, బొమ్మల తయారీ పోటీలకు దర్శిత్, ఆర్ ఆరాధ్య ఎంపికయినట్లు హెచ్‌ఎం కోటేశ్వరరావు తెలిపారు. ఇటీవల షైనంపాడు డైట్‌లో జరిగిన కళా ఉత్సవ్‌లో సుదర్శన్ మొదటి బహుమతి, ఆరాధ్య ద్వితీయ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా వారిని శ్రీనివాసరావు, మంజుల, రమణమ్మ, శివపార్వతి, ఉషారాణి, అంకయ్య, శ్రీదేవి అభినందించారు.

పశువుల పెంపకంతో ఆర్థిక తోడ్పాటు

మద్దిపాడు, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : పశువుల పెంపకం ద్వారా రైతు ఆర్థికంగా తోడ్పాటు లభిస్తుందని సహాయ సంచాలకులు డాక్టర్ పి.కిషోర్‌కుమార్ చెప్పారు. మంగళవారం లింగంగుంట గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు పశువుల పెంపకంపై దృష్టిసారించాలన్నారు. ఈ సందర్భంగా 23 గేదెలకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించి, 180 గేదెలకు గొంతువాపు వ్యాధి టీకాలు వేసినట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు పశుగ్రాస విత్తనాలు సబ్సిడీ కింద సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.హర్షశ్రీ, పారా వెటర్నరీ సిబ్బంది, పశుసంవర్థక శాఖ సహాయకులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

కొప్పోలు కృష్ణ మందిరంలో చోరీ

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కృష్ణ దేవాలయంలో హుండీ పగులకొట్టి సుమారు రూ.25 వేలు నగదును అపహరించుకెళ్లారు. సోమవారం రాత్రి ఒంగోలు నగరం శివారు ప్రాంతమైన కొప్పోలులో కృష్ణ దేవాలయంలో దొంగలుపడ్డారు. ఆలయ గేటును ఎక్కి లోపలకు దూకి హుండీని పగలకొట్టారు. సుమారు రూ.25 వేలు అపహరించుకెళ్లారు. ఈ మేరకు దేవాలయం నిర్వాహకులు తాలుకా పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలాన్ని సీఐ విజయకృష్ణ పరిశీలించి కేసు నమోదు చేశారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

ఒంగోలురూరల్ సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : త్రోవగుంట పశువైద్యశాలలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాలను పశుసంవర్ధక శాఖ ఏడీఏ బి. బసవశంకరరావు వేశారు. మండలంలో తెల్లపశువులు(ఎద్దులు, ఆవులు) 468, నల్లపశువులు(గేదలు, పాడి గేదలు)7182 ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికి 58 తెల్లపశువులకు టీకాలు వేశామన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్స్‌డే వేడుకలను ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇంజనీర్ ఇన్ చీఫ్ అడ్మిన్ బూసం శ్యాంప్రసాద్ పాల్గొని మాట్లాడారు. నిర్మాణంలో ఇంజనీర్ల పాత్రను వివరించారు. ఈసందర్భంగా శ్యాప్రసాద్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మీ, కన్‌స్ట్రక్షన్స్ ఎస్ఈ అబుసలీం, నాగార్జునసాగర్ కుడికాలువలు, లింగంగుంట ఎస్ఈ కృష్ణమోహన్, డిప్యూటీ ఎస్ఈలు హరికృష్ణంరాజు, రామకృష్ణ, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ రాధాకృష్ణ, పీ కృష్ణారెడ్డి, సీహెచ్ శ్రీనివాస్, ఆర్ రాజగోపాలకృష్ణమూర్తి, ఆర్ వెంకటేశ్వర్లు, దివాకర్‌రావు, ఎం.మురళీధర్, అసోసియేషన్ అధ్యక్షుడు రాకేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి జే శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు తేజ్‌కుమార్, కోశాధికారి నిఖేష్ ఉన్నారు.

పేస్ విద్యార్థికి బంగారు పతకం

ఒంగోలు విద్య, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం సీఎస్ఈ చదువుతున్న ఫాతిమా రాష్ట్ర స్థాయిలో గట్కా క్రీడా చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించారు. విజయవాడలో ఇటీవల జరిగిన పోటీల్లో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సింగిల్ సొట్టి(టి) విభాగంలో ఫాతిమా ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఇలాంటి పతకాలను మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు.

నగరానికి 'పచ్చ'లహారం

ఒక్కో మొక్క ఒక్కో విద్యార్థికి.. దత్తతకు ప్రణాళిక

కమిషనర్, విద్యాసంస్థల యాజమాన్యాలతో ఎమ్మెల్యే దామచర్ల సమావేశం



అధికారులు, విద్యాసంస్థల ప్రతినిధులతో సమావేశం అయిన దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పదికాలాలపాటు.. అందరూ చెప్పుకునేలా.. ప్రతి ఒక్కరికీ చల్లని నీడనిచ్చే విధంగా నగరం పచ్చలహారంగా తీర్చిదిద్దడంపై ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రత్యేక దృష్టి సారించారు. నగర అభివృద్ధిలో భాగంగా విద్యుత్ దీపాలు.. రోడ్లు, డ్రైయిన్లు, డివైడర్ల నిర్మాణంతోపాటు నగరానికి 'పచ్చ'లహారం వేసేందుకు శ్రీకారం పలికారు. ఈ మేరకు ఒంగోలు కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరమంతా సుమారు 5వేల మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకు సంబంధించిన ఎమ్మెల్యే దామచర్ల మంగళవారం నగర కమిషనరు కే వెంకటేశ్వరరావుతోపాటు పలు ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీలు, పలు విద్యా సంస్థల యజమానులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దామచర్ల అధికారులకు, విద్యా సంస్థల యజమానులకు పలు సూచనలు చేశారు. నగరంలో పచ్చదనం పెంపుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ముఖ్యంగా మొక్కలు వేసి, అలాగే వదిలేయకుండా ఒక్కో మొక్కను, ఒక్కో విద్యార్థికి దత్తత ఇచ్చి, వాటి సంరక్షణ బాధ్యతలు అప్పగించడం ద్వారా భవిష్యత్‌లో నగరం అందమైన మొక్కలు, పచ్చదనంతో సుందరంగా మారుతుందని తెలిపారు. నగర అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో సమష్టిగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగులు అనుసంధానకర్తలుగా ఉండాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బంగారు కుటుంబాలు, మార్గదర్శకులు మధ్య సచివాలయ ఉద్యోగులు అనుసంధానకర్తలుగా వ్యవహరించాలని ప్రణాళిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుధారాణి చెప్పారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో మంగళవారం జీరో ప్రావర్టీ పీ4పై సచివాలయ స్థాయిలో మండల, మునిసిపాలిటీలో ఎంపిక చేసిన మాస్టర్ ట్రైనర్స్, ఇతర పది మంది ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా ప్రవేశపెట్టిన మొబైల్ యాప్‌పై అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సుధారాణి మాట్లాడుతూ నిర్ధీత సమయంలో బంగారు కుటుంబాల అవసరాలను మార్గదర్శకులకు తెలియజేయాలన్నారు. మార్గదర్శకులు చేసిన సహాయం బంగారు కుటుంబాలకు అందించడం వంటి అన్ని వివరాలనూ మొబైల్ యాప్‌లో పొందుపర్చాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అర్థగణాంక శాఖ అధికారి ఎం.స్వరూపారాణి, సంతనూతలపాడు, దర్శి నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు ఎస్. వరకుమార్, ఎస్. జాన్సన్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో బాలమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ సుధారాణి

117 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని 21 గ్రామాలకు చెందిన 117 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.56,26,000 విలువైన చెక్కులను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. మంగళవారం లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని సీసీ రోడ్లు, సైడుకాల్వలను పరిశీలించారు. ఆయన వెంట ఏఎంసీ ఉపాధ్యక్షుడు షేక్ ఖాజావలి, టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, క్లస్టర్ ఇంచార్జ్‌లు గుమ్మడి సాయిబాబ, ఈదర వెంకటకృష్ణారావు, చవటపాలెం ఎంపీటీసీ సభ్యురాలు ముప్పవరపు సుచిత్ర, నియోజకవర్గ రైతు అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ నాయకులు చాట్ల నారాయణ, మిరియాల రమణమ్మ, ఈదర రాజా, కొమ్మినేని రమేష్, పెనుబోతు సునీల్, నెప్పల శివకృష్ణ, తెలగతోటి జాన్సన్, ఉప్పుటూరి హరినాథ్, గూడూరి ఝాన్సీ, మెట్ట సుబ్బయ్యనాయుడు, రమణారెడ్డి, కొంజేటి ధనుష్, పల్లపోతు సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.



మద్దిరాలపాడులో చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత

మండల పరిధిలోని టి.అగ్రహారం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అశుతోటి నరసింహారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయనకు టీడీపీ సభ్యత్వం ఉంది. ఈ నేపథ్యంలో అతని కుటుంబానికి మంజూరైన రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అందజేశారు. పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు నారా లోకేష్ పార్టీ కార్యకర్తల సంక్షేమం కొరకు బీమా సౌకర్యం కల్పించారని ఎమ్మెల్యే చెప్పారు.

పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలి

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు ఈ ఏడాది రబీలో పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు సూచించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఉప్పుగుండూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు నల్లబర్లీ పొగాకును సాగుచేయవద్దని చెప్పారు. జిల్లాలో యూరియా కొరత లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఏడీఏ బి.రమేష్‌బాబు, ఏవో పోతినేని వెంకట్రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఏవో శ్రీనివాసరావు

యూరియాకు కొరతలేదు

ఒంగోలు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : యూరియాకు ఎలాంటి కొరత లేదని మండల వ్యవసాయ అధికారి కె.రమేష్‌బాబు చెప్పారు. మండలంలోని ఉలిచి గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెల్లబర్లీ పొగనారు మళ్ల సాగు రైతులు వ్యవసాయశాఖకు సమాచారమివ్వాలని చెప్పారు. నల్లబర్లీ పొగాకు సాగును రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందన్నారు. తెల్లబర్లీ పొగాకు వ్యాపారులు కొనుగోలుకు అనుమతి ఇస్తే సాగు చేసుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైనరసింహారావు, నన్నపనేని సుబ్బారావు పాల్గొన్నారు

తెగిపడిన విద్యుత్‌తీగ.. నిలిచిన రాకపోకలు



జాతీయ రహదారిపై ఇరువైపులా నిలిచిన రాకపోకలు

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి గ్రామాలకు విద్యుత్‌సరఫరా చేసే ప్రధాన లైన్‌లోని తీగ మంగళవారం సాయంత్రం స్థానిక మండల కార్యాలయాల సముదాయం ఎదురు 216 జాతీయ రహదారిపై తెగి పడింది. దాంతో రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులు, ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గరయ్యారు. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకొన్న లైన్ ఇన్‌స్పెక్టర్ తిరుపాలు ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసి తీగను తొలగించడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి. మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఘనంగా మంత్రి సత్యకుమార్ జన్మదిన వేడుకలు



కేక్‌ను కట్ చేస్తున్న కల్యాణ్‌చక్రవర్తి, డాక్టర్ వంశీకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలాజీనగర్‌లోని మునిసిపల్ హైస్కూలులో మంగళవారం జీఎంఆర్ పాలిటెక్నిక్ మదనపల్లి పూర్వవిద్యార్థుల వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకల్లో రాష్ట్ర బీజేపీ సెల్స్ కో కన్వీనర డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శ్రీరామ్ వైద్యశాల అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ ఉచిత వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లి రమేష్, జిల్లా కన్వీనర్ డాక్టర్ కే చంద్రశేఖర్, ఎన్, చంద్రశేఖర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు, నాయకులు అమరసింహం, గరికపాటి వంశీకృష్ణ, హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న ఉన్నారు.

కారుమంచి కాలువకు మరమ్మతులు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు బ్రాంచి కెనాల్ నుంచి వెళ్లే కారుమంచి కాలువ మరమ్మతులలను వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కోరారు. మంగళవారం స్థానిక ఎస్ఎస్‌పీ కార్యాలయంలో సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే మాబు, బెజవాడ శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ఇవ్వాలి

ఒంగోలురూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులుకు, ఉద్యోగులుకు వెంటనే 12వ పీఆర్‌సీని ఏర్పాటు చేయాలని, అదేక్రమంలో ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల డిమాండ్ చేశారు. ప్రకాశం భవనం ఎదుట మంగళవారం ఉపాధ్యాయ, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిందిజిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎస్.గరునాథ శర్మ, నాయబ్‌రసూల్, హనుమంతరావు, బషీరున్నీ, శేషారావు, పి.శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. డీఆర్వోకి వినతపత్రం సమర్పించారు.

క్విస్‌లో విద్యార్థులకు అతిథి ఉపన్యాసం

ఒంగోలు విద్య, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ, ట్రిబుల్‌ఈ విద్యార్థులకు అతిథి ఉపన్యాసం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అప్టికల్ సబ్‌స్టేషన్ ప్లానింగ్ అండ్ ఫీడర్ డిజైన్ ఇన్ అర్బన్ అండ్ రూరల్ పవర్‌సిస్టమ్ అనే అంశంపై పొదిలి ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి. సుబ్రహ్మణ్యం అవగాహన కల్పించారు. సీఎస్ఈ విద్యార్థులకు మరో అంశంపై అతిథి ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో విద్యా సంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి, హెచ్‌వోడీలు డాక్టర్ మౌళీచంద్ర, డాక్టర్ ఎన్, శ్రీను, ఆర్, మానస పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న అధ్యాపకులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి

అవీఇవీ



మాట్లాడుతున్న శరత్‌బాబు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర సంఘం తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా పనిచేయడంజరుగుతుందని ఏపీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కూచిపూడి శరత్‌బాబు అన్నారు. స్థానిక ఎన్‌జీవో భవన్‌లో మంగళవారం సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలపరిష్కారం విషయంలో ఎన్‌జీవో సంఘం ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. అనంతరం జిల్లా నుంచి బాపట్ల జిల్లా పరిధిలోకి వెళ్ళిన నాలుగు తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులను, బాపట్ల జిల్లా అహాడ్ కమిటి ఛైర్మన్ నాగేశ్వరరావులను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలోసంఘం జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి, సంఘం నాయకులు కే శివకుమార్, ఎం. వెంకటేశ్వరరావు,పీ మాధవి, తోట శ్రీనివాస్, పీ రామాంజనేయులు, బి. కృష్ణకిశోర్, షేక్ మోమిన్, పి. విజయ్‌కుమార్, కొత్తపల్లి మంజేష్, సీహెచ్ శిరీషా తదితరులు ఉన్నారు.

నేడు సూపర్ సిక్స్ సూపర్ హిట్

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 17వ తేదీ బుధవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ ర్యాలీ, సభ నిర్వహిస్తున్నట్లు టీడీపీ కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30గంటలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి విఠా సుబ్బరత్నం కల్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విఠా సుబ్బరత్నం కల్యాణ మండపంలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ ప్రకటనలో తెలిపారు.

18 నుంచి ఉరుసు మహోత్సవం

గిద్దలూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రావిచెట్టు బజారు దర్గాలో ఈనెల 18 నుంచి ఉరుసు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 18న గంధం పూజ, 19న ఉరుసు, 20న ఊరేగింపు ఉంటుందని, ఉరుసు రోజు రాత్రి అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

అకడమిక్ క్యాలెండర్ ఆవిష్కరణ

కంభం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రంగా వీధి ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎంఈవో అబ్దుల్ సత్తార్ అకడమిక్ క్యాలెండర్‌ను టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ కిట్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా పంపిణీ చేసిన టరల్ కిట్స్, అకడమిక్ క్యాలెండర్ విద్యా కార్యక్రమాల నిర్వహణకు బహుళ ప్రయోజనకరంగా ఉన్నాయని, ఉపకరణాలను సద్వినియోగం చేయడం ద్వారా నాణ్యమైన విద్యా ప్రమాణాలను అందించవచ్చని అన్నారు. అనంతరం పాఠశాల రికార్డులను, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను, సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సయ్యద్, అదిల్, ఉపాధ్యాయుడు భాస్కర్ ఉన్నారు.

మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను నిర్వహించనున్నట్లు ఎంఈవో అబ్దుల్ సత్తార్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని పీడీలతో సమావేశమై క్రీడా మైదానంలోని ఏర్పాట్లను పరిశీలించారు. అండర్ 14, అండర్ 17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, బాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ విభాగాల్లో మండల స్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్రీడా పోటీలు విజయవంతం చేయాలి

పెద్ద దోర్నాల : ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంఈవో మస్తాన్ నాయక్ అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో 17, 18వ తేదీల్లో నిర్వహించనున్న మండల స్థాయి క్రీడా పోటీలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ అండర్-14, 17 కేటగిరీల్లో బాల బాలికలకు వివిధ క్రీడాంశాలపై పోటీలు నిర్వహిస్తున్న క్రమంలో అన్ని పాఠశాల విద్యార్థులు పాల్గొనేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తోడ్పడాలని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థుల అర్హతలు, నియమ నిబంధనలు గురించి పీడీ రామానాయక్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని శ్యాంప్రసన్న తాంజలి, ఝాన్సీ లక్ష్మీబాయి, వ్యాయామ ఉపాధ్యాయుడు తులసీనాయక్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆంజనేయులు, అధ్యాపకులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి అని సొసైటీ ఫర్ సోషల్ ఇన్ఫర్మేషన్ కర్నూల్‌కు చెందిన ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు అన్నారు. శ్రీసాధన డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా. కె.మధుసూధన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత నైపుణ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంజనేయులు మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థ రోజుకో కొత్త విధానాలను సంతరించుకుంటూ శరవేగంగా దూసుకెళ్తున్న తరుణంలో విద్యార్థులు బ్యాంకుల ద్వారా అందించే అన్ని సేవలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు నిర్వహణ అధికారి వెంకటేశ్వర్లు, బ్యాంకు అధికారులు ప్రతాప్ రెడ్డి, కృష్ణ చైతన్య, శ్రీకాంత్ నెహ్రూ, ఎన్.హరి, వైస్ ప్రిన్సిపల్ శ్రీధర్ కుమార్ పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ అన్నారు. మార్కాపురంలో బుధవారం వివిధ ఆటో కార్మికులు ఎస్‌వీకేపీ కళాశాల నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రూబెన్, బాషా, నారాయణరెడ్డి, నాగరాజు, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలి



మాట్లాడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఉపయోగించుకోవాలని కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. మున్సిపాలిటీలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ భాగస్వామ్యంతో చెత్త కాగితాలు, ప్లాస్టిక్ డబ్బాలను సేకరించి జీవించే వేస్ట్ పిక్కర్ల నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుకునేవారు, జుట్టు సేకరించేవారికి గుర్తింపు కార్డులు ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దంతాలపై శ్రద్ధ వహించాలి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దంతాలపై శ్రద్ధ వహించాలని దంత వైద్యుడు కిరణ్ కుమార్ అన్నారు. రాష్ట్ర ఆరోగ్య మంత్రి, బీజేపీ నాయకుడు సత్యకుమార్ పుట్టిన రోజు సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో వివేకానంద మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు దంత వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్.సరోజిని, కృష్ణారావు, చెన్నయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులు.. వివాహిత ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భర్త వేధింపులు తట్టుకోలేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ పీ చౌడయ్య తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన సిమోను భార్య యెలకపాటి లిడియ కిరణ్‌ను తరచూ కట్నం కోసం వేధిస్తుండేవారు. దీంతో మనస్థాపం చెందిన ఆమె సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం కిరణ్ అన్న వినోద్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం

» ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

» గిద్దలూరులో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు ప్రారంభం



జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ సెలక్షన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం శారీరక దృఢత్వం పెంపొందుతుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని క్లబ్ రోడ్డు నందు టెన్నిస్ కోర్టులో అండర్-14, 17 బాలబాలికల జిల్లా స్థాయి టెన్నిస్ టోర్నమెంట్, సెలక్షన్స్‌ను మంగళవారం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. చిన్నారులను పరిచయం చేసుకుని వారికి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలు నేటి సమాజంలోని యువతకు మానసిక ఉల్లాసాన్ని ఇవ్వడంతోపాటు స్నేహ సంబంధాలను పెంపొందించుకునేందుకు దోహదం చేస్తాయన్నారు. జిల్లా స్థాయిలో జరిగే టోర్నమెంట్‌లో ప్రతి ఒక్కరూ విజ యం సాధించాలని ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, సింగిల్‌విండో బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, ఎంఈవోలు నాగేశ్వర్‌రెడ్డి, అశ్వనీకుమార్, జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్ధేశ్వరశర్మ, టోర్నమెంట్ సెలక్షన్స్ నిర్వాహకులు జి.శోభన్‌బాబు, ఎస్.శ్రీనివాసరెడ్డి, సువర్ణలత, జగజ్జీవన్‌కుమార్, ధనలక్ష్మి, టెన్నిస్‌కోచ్ మురళి పాల్గొన్నారు.

సేంద్రియంతో భూమికి ఆరోగ్యం

ఏడీఏ బాలాజీ నాయక్



కంది సాగుపై సూచనలు ఇస్తున్న పొదిలి ఏవో శ్రీనివాసరెడ్డి

పెద్దారవీడు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల వినియోగంతో భూమికి ఆరోగ్యం మెరుగుపడుతుందని ఏడీఏ బాలాజీ నాయక్ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకుందుకు రైతులు కృషి చేయాలన్నారు. రైతులు ఈ ఏడాది నల్లబర్లీ పొగాకును సాగుచేయకూడదన్నారు. వైట్ బర్లీ సాగు కూడా కంపెనీలతో ఒప్పంద పత్రాలు తీసుకొని మాత్రమే సాగుచేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో లక్ష్మీ నారాయణ, వీఏఏ లావణ్య, టీడీపీ నాయకులు గొట్టం రామ నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తర్లుపాడు : నల్లబర్లీ పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించిందని వ్యవసాయ అధికారి జోత్స్నదేవి అన్నారు. మండలంలోని తాడివారిపల్లి, మంగళకుంటలలో ఆమె పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. వైట్ బర్లీ పొగాకు కంపెనీలు ఒప్పంద పత్రాలు తీసుకున్న రైతులు మాత్రమే సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏవో దేవేంద్ర గౌడ్, సహాయకులు పాల్గొన్నారు.

రాచర్ల : రబీ సీజన్‌కు సబ్సిడీపై అందించే విత్తనాలు సిద్ధంగా ఉంచుతామని వ్యవసాయ అధికారి షేక్ మహబూబ్ బాషా అన్నారు. ఆకవీడు, ఆరవీటి కోట గ్రామాల్లో మంగళవారం రైతులతో పొలంపిలుస్తోంది నిర్వహించారు. రబీ సాగుకు కావలసిన ఎరువులను సిద్ధం చేసి రైతు సేవా కేంద్రాల ద్వారా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వీఏఏ శివ రాములు, ఫాతిమా రైతులు పాల్గొన్నారు.

గిద్దలూరు : మండలంలోని అంబవరం, వెల్లుపల్లి గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగైన పంటలకు సంబంధించి ఈపంట నమోదు కార్యక్రమం జరుగుతున్నదని, రైతులు పంటలను నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సహాయకులు హనుమంత రెడ్డి, వరలక్ష్మి పాల్గొన్నారు.

త్రిపురాంతకం : వరిలో ఆకుముడతకు కారణం యూరియాను అధికంగా వాడటమేనని ఏవో బి. సంగమేశ్వరరెడ్డి అన్నారు. వెల్లంపల్లి, విశ్వనాథపురం గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన వరిపంటను పరిశీలించారు. అందులో ఆకుముడత, రసం పీల్చు పురుగు ఉన్నట్లు గుర్తించారు. యూరియా బదులుగా నానోయూరియాను తగిన మోతాదులో వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జాషువా, మాదాసి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : పత్తి సాగు చేసిన ప్రతి రైతు పత్తిలో వర్షాల కారణంగా వచ్చే తెగుళ్లను దృష్టిలో ఉంచుకొని సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని ఏవో ప్రకాష్ చెప్పారు. మునగపాడు, వెలిగండ్ల గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి విక్రమ్, సహాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, పశువైద్య శాఖ అసిస్టెంట్ వీరామని పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని గజ్జలకొండలో మంగళవారం ఏవో బుజ్జిబాయి రైతులతో కలిసి పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని రైతు సేవా కేంద్రంలో, ఎరువుల షాపులలో అందుబాటులో ఉందని తెలిపారు.

పొదిలి : నల్లబర్లీ సాగును ప్రభుత్వం నిషేధించిందని ఏవో శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మల్లవరం, కుంచేపల్లిలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు.

పెద్ద దోర్నాల : మండలంలోని చింతల గిరిజన గూడెంలో పొలంపిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ గిరిజనుల పెరటి తోటలను పరిశీలించారు. రసాయన ఎరువులు వాడకూడదని, స్థానికంగా లభించే సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. వీఏఏ పరిపూర్ణ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో సర్వేలను పూర్తి చేయాలి

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్టు ద్వారా చేస్తున్న సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఏపీఎం పిచ్చయ్య తెలిపారు. స్థానిక ఎస్సీ, బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో వీవోఏలు, సీసీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ఈ ప్రాజెక్టు ద్వారా అందే సేవలు, రాయితీని ప్రజలకు తెలియజేయాలని పిచ్చయ్య తెలిపారు. సమావేశంలో ఎల్‌సీ నాగభూషణం, సీసీలు నాగయ్య, మనోకుమారి, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, అకౌంటెంట్ నాగమణి, వీవోఏలు పాల్గొన్నారు.

మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

కొమరోలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిరక్షరాస్యులైన మహిళలందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని మండల కోఆర్డినేటర్ రవీంద్రారెడ్డి అన్నారు. వెలుగు కార్యాలయంలో మంగళవారం జరిగిన నిరక్షరాస్యతపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రవీంద్రారెడ్డి మాట్లాడుతూ వీవోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

లక్కిశెట్టిపాలెంలో వైద్య శిబిరం

పొదిలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరపంచాయతీ పరిధిలోని లక్కిశెట్టిపాలెం వైద్యాధికారి డాక్టర్ శరత్‌చంద్ర అధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ప్రస్తుతం జ్వరాలు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి తెలిపారు. ప్రతి ఒక్కరూ కాచిచల్లార్చిన నీటిని తాగాలన్నారు. దోమలనివారణకు దోమతెరలు వాడాలని చెప్పారు. అనంతరం సిబ్బందితో ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించారు.

మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి

5 నెలలుగా బిల్లుల కోసం నిరీక్షణ



నిర్మాణం పూర్తయిన మరుగుదొడ్డి

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు అవసరమైన నీటి వసతి, మరుగుదొడ్లు నిర్మాణాలు పూర్తయ్యాయి. ఎర్రగొండపాలెం నియోజవకర్గ పరిధిలోని ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లో నీటి వసతి, మరుగు దొడ్లు లేని వాటిని గుర్తించి పనులు చేపట్టి మార్చి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీంతో కాంట్రాక్టర్ ఎర్రగొండపాలెం 13, పుల్లలచెరువు 12, త్రిపురాంతకం 13 మొత్తం 38 మరుగుదొడ్లను అలాగే ఎర్రగొండపాలెంలో 27, పుల్లలచెరువు 20, త్రిపురాంకతం 26 మొత్తం 73 అంగన్వాడీ కేంద్రాలకు నీటి వసతిని పూర్తి చేశారు. ఒక్కో మరుగు దొడ్డికి రూ.36వేలు కాగా నీటి సరఫరా పనులకు రూ.17వేల నిధులు రావల్సి ఉంది. ఐదు నెలలు అవుతున్నా బిల్లులు మంజూరు కాలేదు. బిల్లులు విడుదల చేయాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

మర్రిపూడి అడ్డరోడ్డుపై గుంత

» తరచూ ప్రమాదాలు » రహదారిని బాగుచేయాలని ప్రజల విజ్ఞప్తి



అడ్డరోడ్డుపై ఏర్పడిన గుంత

పొదిలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పొదిలి - మర్రిపూడి వెళ్లే ప్రధాన రహదారి వద్ద పెద్ద గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు మీదుగా మర్రిపూడి, టంగుటూరు వెళ్లే వాహనదారులు రాత్రి వేళ గుంత కనపడక ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారిలో బస్సులు లేకపోడంతో ప్రజలు ఆటోలపైనే ప్రయాణిస్తుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకొని రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అమూల్య

పారదర్శకంగా ప్రజా పంపిణీ

కొమరోలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించాలని మండల ఫుడ్ కమిటీ చైర్మన్, ఎంపీపీ కామూరి అమూల్య అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మండల ఫుడ్ కమిటీ సమావేశాన్ని చైర్మన్, ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ అమూల్య మాట్లాడుతూ వృద్ధులకు ఇస్తున్న రేషన్ మండలంలో సక్రమంగా జరగడం లేదని, దానిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అదనపు రేషన్ షాపులను కేటాయించాలన్నారు. తహసీల్దార్ దేవరశెట్టి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రేషన్ బియ్యాన్ని డీలర్ల సహాయంతో ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చెన్నారావు, డీటీ వెంకటయ్య, సొసైటీ అధ్యక్షుడు ముత్తుముల సంజీవరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కామూరి శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ తిరుమలరెడ్డి, టీడీపీ నాయకులు వీరశేఖర్, వీఆర్వో రమణారావు, నాయక్ పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల వార్డు పర్యటన

గిద్దలూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వార్డులలో మున్సిపల్ అధికారులు పర్యటించారు. కోటగడ్డవీధి, అర్బన్‌కాలనీ, కొంగళవీడు రోడ్డు, గాయత్రినగర్, శ్రీరామ్‌నగర్, ఏబీఎం పాలెంలలో కమిషనర్ రమణబాబు, మున్సిపల్ ఏఈలు రవీంద్ర, పోర్షియా, సచివాలయ సిబ్బంది పర్యటించారు. ఆయా వీధుల్లో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రోడ్ల నిర్మాణం, డ్రైన్ల నిర్మాణాన్ని పరిశీలించి నాణ్యంగా పనులు చేపట్టాలని సూచించారు.

సెలవుల్లో విద్యార్థులకు ఆధార్ క్యాంపులు

రాచర్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : దసరా సెలవుల్లో ఆధార్ క్యాంపులను విద్యార్థులు వినియోగించుకునేలా చూడాలని ఎంఈవో వీ గిరిధర్ శర్మ అన్నారు. మంగళవారం ఆయన ఎడవల్లి, చర్లోపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలను సందర్శించి దసరా సెలవుల్లో భాగంగా 23 నుంచి 26వరకు అన్ని సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించాలన్నారు.

నేటి నుంచి ప్రభుత్వ మెడికల్ క్యాంప్‌లు

కొమరోలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమరోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏడు మెడికల్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నట్లు వైద్యులు చంద్రశేఖర్, శాంతి తెలిపారు.

అక్షర ఆంధ్రలో భాగస్వాములు కావాలి

కురిచేడు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఎంపీడీవో కేజీఎస్ రాజు పిలుపునిచ్చారు. మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం అక్షర ఆంధ్ర వలంటీర్ల సమావేశం వయోజన విద్య పర్యవేక్షకులు చౌడిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎంపీడీవో కేజీఎస్ రాజు, ఎంఈవో-2 సుబ్బారావు హాజరయ్యారు. రాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో 3,045 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే లక్ష్యంతో ఆవులమంద, కల్లూరు, పడమరనాయుడుపాలెం సచివాలయాల పరిధిలో కార్యక్రమం నిర్వహించేలా ఏర్పాట్లుచేసినట్లు తెలిపారు. శిక్షణకు హాజరైన స్వచ్ఛంద ఉపాధ్యాయులకు వయోజన విద్య ద్వారా సరఫరా చేసిన అక్షరాంధ్ర పాఠ్యపుస్తకాలు, వర్క్‌పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం సైమన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

భూమిని ఆక్రమించేందుకు యత్నం

తాళ్లూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దోసకాయలపాడు గ్రామంలో నివేశన స్థలపట్టాలు పొందిన ఎస్సీలకు చెందిన భూమిని గ్రామంలోని కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ఆక్రమించుకునేందుకు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని కాలనీవాసులు ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 270/ 10,17లో 2 ఎకరాల 08సెంట్ల ప్రభుత్వ భూమిలో కొంత భూమిని ఎస్సీ కాలనీకి చెందిన 8 మందికి నివేశనస్థల పట్టాల పొజిషన్ సర్టిఫికెట్లు అందజేసినట్టు చెప్పారు. ఈ పొలం ప్రక్కన యాచవరపు నీలాంబరంకు ఎకరా 61సెంట్ల భూమి ఉందని తెలిపారు. భూముల ధరలకు రెక్కలు రావటంతో పొజిషన్ పట్టాలు పొందిన 8 మందికి చెందిన భూమిపై కన్నేసి ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారన్నారు. గత శనివారం నీలాంబరం, మరో నలుగురు ఎక్స్‌కవేటర్‌తో అక్కడకు వచ్చి తమ భూమితో పాటు నివేశనస్థలాలు పొందిన 8 మందికి చెందిన స్థలాలను చదును చేసేందుకు యత్నించగా అడ్డుకున్నామన్నారు. ప్రభుత్వం మంజూరుచేసిన స్థలాన్ని ఆక్రమించేందుకు దౌర్జన్యం చేయబోయిన ఉద్యోగులపై తగుచర్యలు తీసుకోవాలని ఎస్ఐకి ఫిర్యాదు చేశారు.

క్రీడాపోటీలను విజయవంతం చేయాలి

తాళ్లూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల విద్యార్థులకు ఈనెల19 నుంచి మండల స్థాయిలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలను విజయవంతం చేయాలని ఎంఈవో జి.సుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తూర్పుగంగవరం హైస్కూల్ హెచ్ఎం వైఎస్ఆర్‌కే ప్రసాద్ అధ్యక్షతన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలు జరుగుతాయన్నారు. మండల గేమ్స్ కోఆర్డినేటర్‌గా ఎన్.రవిప్రసాద్‌రెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఎల్.సుధాకర్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఆరాధన వేడుకలు

పామూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుమునిగిరి క్షేత్రంలో వెలసిఉన్న శ్రీ శివరామబ్రహ్మేంద్రస్వామి 130వ ఆరాధన వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అనుముని గిరిక్షేత్రాన్ని విద్యుత్ దీపాలతో, పుష్పాలతో అలంకరణ చేశారు. ఉదయం కలశతీర్థం, పూజ కార్యక్రమాలు, మహానైవేద్యం కార్యక్రమాలు జరిగాయి. విశ్వబ్రాహ్మణ అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలను పూర్తిచేయాలి

పామూరు సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇంకుడు గుంతలను త్వరితగతిన పూర్తిచేయాలని ఏపీవో బి.మాల్యాద్రి ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పామూరు మండలంలో 625 ఇంకుడు గుంతలు నిర్మాణం చేయాల్సి ఉండగా, ఇప్పటికీ మూడు వందలు పూర్తయ్యాయని అన్నారు. 120 ఎకరాల్లో ఉద్యాన పంటలు వేయాల్సి ఉండగా ఇప్పటికి 70 ఎకరాల్లో సాగు చేస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో టీఏలు మనోహర్, తేజా, జోయేల్‌రాజు, రాజేంద్ర, వెంకటేశ్వర్లు, ఈసీలు శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఈపంట నమోదు చేయించుకోవాలి

పామూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులందరూ ఈపంట నమోదు చేసుకోవాలని ఏవో టి. అబ్రహంలింకన్ తెలిపారు. మంగళవారం మండలంలోని తిరగళదిన్నె, తాతాయిపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాగులో ఉన్న కంది పంటను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. నానో యూరియా గురించి మహిళా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ ప్యారీ, పీవీ అనూష, తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: ఖరీఫ్‌లో సాగుచేసిన రైతులందరూ ఈ పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.రంగాక్రిష్ణ అన్నారు. మండలంలోని చింతగుంపల్లి, పిల్లివారిపల్లి, అడివిలోపల్లి గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీమా చేయించిన పంటలకు ఈ-పంట నమోదు కాకపోతే బీమా వర్తించదని తెలిపారు. మండలంలో యూరియా కొరత లేదన్నారు. అధునాత పద్ధతుల్లో సాగుచేస్తే కందిలో అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు.

సొంత నిధులతో సేవా కార్యక్రమాలు

పామూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎంఈవో పెద్దిరెడ్డి కోటిరెడ్డి తన సతీమణి పేరుపై ఏర్పాటుచేసిన పీఆర్ఎఎల్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరమ్మతులకు గురై ఉన్న సుమారు 50 బెంచీలను ఎంఈవో 1, ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి కోటిరెడ్డి రూ.70 వేలు వెచ్చించి మరమ్మతులు చేయించారు. తనకు వచ్చే జీతంలో కొంతభాగాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగించడం అభినందనీయమని పాఠశాల పేరంట్స్ కమిటీ అధ్యక్షుడు గుత్తి కొండలరావు కొనియాడారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

పీసీపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ తరఫున మంగళవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు అందుకున్న ఈశ్వరీభూషణ్, జిల్లాస్థాయి అవార్డు అందుకున్న సంజీవి, పాన్ ఇండియా బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్న రమణయ్య, కేజీబీవీ ప్రిన్సిపాల్ సుజాతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఆర్.శ్రీనివాసులు, జి.సంజీవి పాల్గొన్నారు. అనంతరం ఇటీవల పీసీపల్లి నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సీఎస్‌పురం ఎంఈవో రాజాల కొండారెడ్డి, మాజీ ఎంఈవో ఎం.నరసింహారావు, గోగడ రత్నయ్య పాల్గొన్నారు.

బాల్యవివాహాలకు దూరంగా ఉండాలి

తాళ్లూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ జిల్లా డీఆర్పీ వీరాంజనేయులు తెలిపారు. స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో మంగళవారం ప్రిన్సిపాల్ పి.సుజిత అధ్యక్షతన మహిళాభివృద్ధి, శిశుసంక్షేమం కార్యక్రమాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు చిన్న వయస్సులోనే వివాహాలు చేసేందుకు యత్నిస్తే నచ్చజెప్పాలన్నారు. యువతులకు ఎదురవుతున్న సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో డీఆర్పీ సభ్యురాలు సమాధానం, అంగన్‌వాడీ టీచర్లు రమణకుమారి, విజయలక్ష్మి, నాగబాల, ఏఎన్ఎం చంద్రమ్మ, పద్మజ, సునమ్మ జ్యోతి, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సూపర్‌వైజర్‌ను తొలగించాలి

కనిగిరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల పట్ల దురుసుగా వ్యవహరిస్తూ వేధింపులకు పాల్పడుతున్న సూపర్‌వైజర్‌ను తొలగించాలని డీఎం షయానబేగంకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకుడు కేశరావు మాట్లాడుతూ డిపోలో పనిచేస్తున్న వాషింగ్, స్వీపింగ్, మ్యాపింగ్ కాంట్రాక్టు కార్మికులను సూపర్‌వైజర్ తొలగించారన్నారు. తొలగించిన కార్మికుల జీతాలను కూడా విధులు నిర్వహించినట్లుగా ఇతర కార్మికుల బ్యాంకు ఖాతాల్లో వేయించి డ్రా చేసి తీసుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరేంద్ర, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎన్ఏపీ అతిథి గృహం

» మరమ్మతుల గురించి పట్టించుకోని అధికారులు


మూలనపడ్డ ఎన్ఏపీ గెస్ట్‌హౌస్

దర్శి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): దర్శిలో ఎన్ఏపీ అతిథి గృహం శిథిలావస్థకు చేరింది. ఏళ్ల తరబడి మరమ్మతుల గురించి పట్టించుకోకపోవటంతో చిల్లచెట్లు పెరిగి అధ్వానంగా మారింది. నెదర్లాండ్ ప్రభుత్వం దర్శి ప్రాంత ప్రజలను ఫ్లోరిన్ బారి నుంచి కాపాడేందుకు స్వచ్ఛమైన మంచినీరు అందించేందుకు 1978లో ఎన్ఏపీ రక్షిత మంచినీటి పథకం నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతోనే 127 గ్రామాలకు మంచినీరు అందించే విధంగా ఎన్ఏపీ రక్షిత పథకం నిర్మించారు. అదే సమయంలో కట్టమీద అద్భుతమైన అతిథి గృహం నిర్మించారు. పథకం నిర్మాణ సమయంలో, ప్రారంభం తర్వాత అనేకసార్లు నెథర్లాండ్ ప్రభుత్వ ప్రతినిధులు ఇక్కడకు వచ్చేవారు. స్కీం నిర్వహణ పరిశీలించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుతున్నందుకు సంతృప్తి చెంది వెళ్లేవారు. ఆ సమయంలో అన్నిహంగులతో సుందరంగా అతిథి గృహం నిర్మించారు. చుట్టూ ఫ్లడ్‌లైట్లు, వాటర్ ఫౌంటేన్ ఏర్పాటుచేశారు. జిల్లా అధికారులు సైతం పశ్చిమ ప్రకాశం పర్యటనకు వచ్చినప్పుడు ఈ అతిథి గృహంలో బస చేసేవారు. అలాంటి అతిథి గృహం ప్రస్తుతం మూలనపడింది. జిల్లా అధికారులు అతిథి గృహానికి మరమ్మతులు చేయించి పూర్వవైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ వైద్యశాలను సందర్శించిన కేంద్ర బృందం


వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకుంటున్న బృందం సభ్యులు

పీసీపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్రబృందం సభ్యులు మంగళవారం సందర్శించారు. డాక్టర్ అజయ్ మిశ్రా నేతృత్వంలోని బృందం సభ్యులు వైద్యశాలలో వైద్యులు, రోగులతో విడివిడిగా సమావేశమయ్యారు. వీహెచ్‌సీ పరిధిలోని పీఎంఎస్ఎంఏ ద్వారా గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలను వైద్యులు యషిత, మంజులను అడిగి తెలుసుకున్నారు. కుక్కకాటు, పాముకాటు ఇంజెక్షన్‌లు సరిపడా అందుబాటులో ఉన్నాయా, లేదా ఆరాతీశారు. రోజువారీ వైద్యశాలకు ఎన్ని ఓపీలు వస్తున్నాయి, నెలలో ఎన్ని కాన్పులు జరుగుతున్నాయని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ఆరోగ్యకేంద్రంలో అందుతున్న వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యశాల పరిసరాలను పరిశీలించిన బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రబృందంలో ఎం.చరిత, ఎస్.వర్ష, ఎ.భార్గవి, ఎస్‌డీ హకీమ్, కేవీ సుబ్బలక్ష్మి తదితరులు ఉన్నారు.

ప్రకృతి వనరులను సంరక్షించుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఉషారాణి

కనిగిరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వనరులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఉషారాణి అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాలలో ఓజోన్ పొరపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భూమిపై సంచరించే ప్రతి జీవరాశికి సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాల నుంచి ఓజోన్ పొర ఎంతో రక్షిస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి విద్యార్థి తప్పనిసరిగా మొక్కలు నాటాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో ఎకో క్లబ్ కోఆర్డినేటర్ డి.జయకుమారి డిజిటల్ వీడియో ద్వారా విద్యార్థులకు ఓజోన్ పొర సంరక్షణపై అవగాహన కల్పించారు.

జేవీవీ ఆధ్వర్యంలో పట్టణంలోని మాంటిస్సోరి స్కూల్‌లో ఓజోన్ పొర పరిరక్షణపై జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పిచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

ముండ్లమూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో 41 రోజుల క్రితం ప్రతిష్ఠించిన గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అర్చకులు దుర్భాకుల నగేష్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు.

పలువురికి ఆర్థికసాయం

పామూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మానవతా స్వచ్ఛంద సంస్థ తరుపున మంగళవారం పలువురు బాధితులకు ఆర్థిక సమాయం అందజేశారు. కాకర్ల మాల్యాద్రి వైద్య అవసరాల కోసం సంస్థ ద్వారా రూ.5 వేలు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు వై.మాలకొండయ్య ద్వారా రూ.5 వేలు అందజేశారు. అలాగే, కనీయంపాడుకు చెందిన కె.ప్రవీణ్‌కు రూ.5 వేలు, ఇనిమెర్ల పేద విద్యార్థికి రూ.వేలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వి.వెంకటేశ్వరరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, కన్వీనర్ టి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణలో అవగాహన కలిగిఉండాలి

తాళ్లూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళా సంఘాలకు చెందిన రుణాల రికార్డుల నిర్వహణలో వీవోఏలు పూర్తిస్థాయిలో అవగాహన కలిగిఉండాలని ఏపీఎం ఐ.నారాయణ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం దేవరాజ్, సీసీలు పాల్గొన్నారు.

సర్పంచ్ ఆరోపణలపై ఖండన

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం సర్పంచ్ శ్రీరాం పద్మావతి తనపై అసత్య ఆరోపణలను ఖండిస్తున్నట్టు సీపీఎం నాయకుడు ఊసా వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోపణలను రుజువుచేయని పక్షంలో బహిరంగంగా క్షమాపణ చేప్పాలని డిమాండ్ చేశారు.

నల్లబర్లీ పొగాకు సాగు చేయొద్దు!

» ఏడీఏ బాలాజీ నాయక్

తాళ్లూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నల్లబర్లీ పొగాకు సాగును నిషేధించిందని ఏడీఏ కె.బాలాజీనాయక్ అన్నారు. రైతులు ఈ పంటను సాగు చేయవద్దని సూచించారు. మంగళవారం మండలంలోని బొద్దికూరపాడు, వెలుగువారిపాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో పొగాకుకు డిమాండ్ తగ్గుతుందన్నారు. నల్లబర్లీ సాగుచేస్తే తీవ్రంగా నష్టపోతారన్నారు.

ఈవిషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో చిన్ని కృష్ణయ్య, ఉపసర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ బాలకోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

కురిచేడు: నల్లబర్లీ సాగును ప్రభుత్వం నిషేధించిందని మండల వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ తెలిపారు. రైతులు సాగుచేయవద్దని ఆయన సూచించారు. మంగళవారం మండలంలోని పడమర గంగవరం, పొట్లపాడు గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నల్లబర్లీ సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. రైతులు తాము సాగుచేసిన పంటలను ఈక్రాప్ చేయించుకోవాలన్నారు.

కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు చంద్రకాంత్, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగుచేయాలి

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్ష ఆధారంగా పంటలు సాగుచేయాలని ఏవో పి.మధుబాబు అన్నారు. మంగళవారం సీఎస్‌పురం మండలంలోని సీఎస్‌పురం, ముండ్లపాడు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. పంటకు అవసరమైన యూరియా మొత్తం మోతాదులో సగ భాగం యూరియా, సగభాగం నానో యూరియాను వాడాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో పి.శ్రీనివాసులు, వ్యవసాయ సహాయకులు వి.శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువుల వాడకాలను తగ్గించాలని ఏవో ఏ.తిరుమలరావు రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని పోలవరం, వేంపాడు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూసార పరీక్షా ఫలితాలను అనుసరించి మాత్రమే ఎరువులను వాడాలన్నారు. ద్రవ రూపంలో ఉన్న నానో ఎరువులను ఉపయోగించాలన్నారు. రైతులు తప్పనిసరిగా ఈపంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు ఆంజనేయులు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

ముండ్లమూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పర్యావరణం పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని టీడీపీ లీగల్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని చిన ఉల్లగల్లు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న వృక్ష సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బారావు, జి.నారాయణరావు, ఉపాధ్యాయులు షేక్ మస్తాన్‌వలి, అనురాధ, పద్మ, బాలనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో భారీవర్షం

ముండ్లమూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముండ్లమూరుతో పాటు తమ్మలూరు, నాయుడుపాలెం, ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, భీమవరం, పసుపుగల్లు, ఉల్లగల్లు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం అరగంటకు పైగా భారీ వర్షం కురిసింది. మిగతా గ్రామాలైన మారెళ్ళ, పోలవరం, శంకరాపురం, కెల్లంపల్లి, పులిపాడు, ఈదర, బొప్పూడివారిపాలెం గ్రామాల్లో ఓమోస్తరు వర్షం కురిసింది. ఈవర్షం మొక్కజొన్న, కంది, మిరప పంటలకు జీవం పోసింది.

మండలస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

పీసీపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి క్రీడలను మంగళవారం అధికారులు ప్రారంభించారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలను ఎంఈవోలు జి.సంజీవి, ఆర్.శ్రీనివాసులు ప్రారంభించారు. తొలిరోజు అండర్ 14,17 విభాగాల్లో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతగా పీసీపల్లి విద్యార్థులు, రన్నర్‌గా గుంటుపల్లి విద్యార్థులు నిలిచారు. కార్యక్రమంలో పీడీ పూజల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి

పామూరు సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని శిక్షణ ప్రోగ్రాం అసోసియేట్ గోపి తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాయలంలో జరిగిన సమావేశానికి ఏపీఎం జి.విద్యాసాగర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. పొదుపుగ్రూపు మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పొదుపు క్లస్టర్ కోఆర్డినేటర్లు పొదుపు గ్రూపు సంఘాలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. బ్యాంకు లింకేజి, శ్రీనిధి, సీసీఎల్, ఉన్నతి రుణాల రికవరీ చేపట్టాలన్నారు. హాజరు తక్కువగా ఉన్న వీవోఏలకు జీతాలు నిలిపివేస్తామన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు ఓ.సుబ్బమ్మ, ఉమ్మడి పద్మావతి, సీసీలు సుబ్రమణ్యం, సరళ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మన్‌పై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

ముండ్లమూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద ఉల్లగల్లు సచివాలయంలో జూనియర్ లైన్‌మన్‌గా పని చేస్తున్న ఎంఎన్ రాజేష్ పై అదే పంచాయతీ పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన పేరం రాజమోహన్‌రెడ్డి ఈనెల 13వ తేదీ ఉదయం విధులకు ఆటంక పరస్తూ దాడి చేశారు. ఈమేరకు ఫిర్యాదు చేయగా మంగళవారం సాయంత్రం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.కమలాకర్ తెలిపారు. లక్ష్మీనగర్ సమీపంలో ఒక రైతు పొలంలో డ్రోన్ కెమెరా మందు పిచికారి చేస్తూ సమీపంలో ఉన్న 11కేవీ విద్యుత్ వైర్‌ను తగలటంతో అవి తెగిపోయాయి. ఈవిషయంలో ఏఈ చిన అంకబాబు ఆదేశాల మేరకు నష్టపరిచిన యజమానులతో మాట్లాడుతుండగా నిందితుడు ఐన రాజమోహన్‌రెడ్డి తీవ్ర పదజాలంతో జూనియర్ లైన్‌మన్‌పై దాడిచేశారు. లైన్‌మన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు

దొనకొండ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని 18 గ్రామ పంచాయతీ ల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేసింది. సర్పంచ్‌లు, కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు



బుధవారం 17 సెప్టెంబరు 2025

అమృత్.. అంతేనా

టెండర్ ప్రక్రియలో తీవ్ర జాప్యం



అమృత్ పథకంలో నరసరావుపేటలో నిర్మించిన వాటర్ ట్యాంక్

- ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూపు
- మునిసిపల్ పరిపాలనా విభాగంలో కదలని దస్త్రం
- పెరిగిన వ్యయం రూ 43.70 కోట్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అమృత్ 2.0 పథకం అమలు అడుగు ముందుకు పడటలేదు. పురాల్లో తాగు నీటి సమస్యలు పరిష్కారం కాక పౌరులు ఇక్కట్లు పడుతున్నా అమృత్ పనులు ఇప్పట్లో చేపట్టే పరిస్థితులు లేవు. రాష్ట్రంలోనే తొలి సారిగా అమృత్ పథకం 2.0 కింద చేపట్టే ప్రగతి పనులను నూతన విధానంలో చేపనున్నారు. ఇప్పటి వరకు జాతీయ రహదారుల నిర్మాణంలో విని యోగించిన పీపీపీని, మునిసిపాలిటీల్లో చేపట్టే ప్రగతి పనులకుఅమలు చేస్తోంది. 50 శాతం నిధులు ప్రభుత్వం ఇస్తోంది. 50 శాతం నిధులు కాంట్రాక్టర్ భరించాలి. సదరు సంస్థ ఖర్చు చేసే 50 శాతం నిధులను వడ్డీతో కలిపి 40 వాయిదాల్లో ప్రభుత్వం చెల్లిస్తుంది. తాగునీటి పథకాల విస్తరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు నిర్మాణం, చెరువుల ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు టెండర్లు నిర్వహించాలి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని అమృత్ 2.0 పథకం పనులను ఒకే ప్యాకేజి కింద టెండర్ నిర్వహిస్తున్నారు. పనులకు సబంధించిన టెండర్ నిర్వహణ వాయిదాల పర్వంగా మారింది. ఇప్పటికే రెండు సార్లు టెండర్ వాయిదా వేసిన విషయం తెలిసిందే. ముచ్చటగా మూడోసారి టెండర్ పిలిచేందుకు అధికారులు సమాయత్తమైనా ఇందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు లభించడంలేదు. పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల పరిధిలోని గుంటూరు నగరంతో సహా మునిసిపాలిటీల్లో రూ. 1092.40 కోట్ల వ్యయంతో పీపీపీ తరహా విధానంలో ప్రజారోగ్యం,మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ ప్రగతి పనుల టెండర్‌ను పిలిచినా రెండు సార్లు వాయిదా పడింది. ప్రామాణిక రేట్లు పెరగడంతో పనుల వ్యయం రూ 1,136 కోట్లకు పెరిగింది.

రోడ్డు వేసి ఇబ్బందులు

తొలగించండి

- చెన్నుంబొట్లఆగ్రహారం వాసుల డిమాండ్
- వాడరేవు-పిడుగురాళ్ల హైవేపై రాస్తారోకో

పర్చూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాడరేవు- పిడుగురాళ్ల హైవే నిర్మాణంలో పర్చూరు మండలం చెన్నుంబొట్ల ఆగ్రహారం గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టి హైవే నుంచి తమ గ్రామానికి రాకపోకలకు అనుమతించాలంటూ గ్రామస్థులు గళమెత్తారు. మంగళవారం హైవే పనుల కోసం వినియోగిస్తున్న వాహనాలను నిలుపుదల చేసి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో తమ గ్రామానికి రాకపోకలు సాగించేలా ఉన్న రోడ్డు హైవే నిర్మాణంతో ఆనావాళ్లు కూడా లేకుండా చేశారన్నారు. దీంతో రాకపోకలు సాగించలేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. హైవే అధికారులు హామీ ఇస్తే తప్ప ఆందోళనను విరమించేది లేదని భీష్మించారు. సమాచారం తెలుసుకున్న హైవే అధికారులు మూడు రోజుల్లో దెబ్బ తిన్న రోడ్డుకు మరమ్మతులు చేసి రాకపోకలకు ఎలాంటి ఇబ్బం ది లేకుండా చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.



రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న చెన్నుంబొట్ల ఆగ్రహారం గ్రామస్థులు

2026కి హార్బర్ విస్తరణ

- పర్యాటకం, ఆక్వారంగంపై దృష్టి పెట్టాలి
- బీచ్ ఫెస్టివల్ ద్వారా పెట్టుబడులకు ఆహ్వానం
- సదస్సు ముగింపులో ముఖ్యమంత్రి చంద్రబాబు
- మార్గనిర్దేశనం విపత్తుల దృష్ట్యా ఆర్టీజీఎస్ కోరిన కలెక్టర్ వినోద్‌కుమార్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని నిజాంపట్నం హార్బర్ విస్తరణ పనులు 2026 మార్చి కల్లా పూర్తయ్యేటట్లు చూడాలని సీఎం చంద్రబాబు కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సూచించారు. రాజధాని అమరావతి వెలగపూడి సచివాలయంలో రెండు రోజులు జరిగిన కలెక్టర్ల సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణపై కలెక్టర్, ఎస్పీలకు ముఖ్యమంత్రి మార్గ నిర్దేశనం చేశారు. జిల్లాలో పర్యాటక, ఆక్వా రంగాల అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని, వాటిపై మరింతగా దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ పథకానికి సంబంధించి క్షేత్రస్థాయి ఫలితాలు కనబడాలని తెలిపారు. సూర్యలంక తీరంలో జరిగే బీచ్ ఫెస్టివల్ కోసం రూ.3 కోట్లు కేటాయించిందన్నారు. బీచ్ ఫెస్టివల్ ద్వారా పెట్టుబడులకు ఆహ్వానం పలకాలన్నారు. ఆక్వా ఇంటిగ్రేటెడ్ పార్కు నిర్మాణంతో పాటు ఆక్వారంగం గ్రోత్ ఇంజన్‌గా ఉపయోగపడుతుందని, ప్రత్యేక ప్రణాళికలు రచించుకోవాలని సదస్సులో సీఎం చెప్పినట్లు కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, మున్సిపాలిటీ, కాలుష్య నివారణతో పాటు అటవీశాఖ ప్రగతిపై



సీఎం సమీక్షించారు.

విపత్తుల దృష్ట్యా..

జిల్లాలో ఎక్కువగా విపత్తులు సంభవిస్తుంటాయని, తుఫాన్లు కూడా అధికమేనని రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ (ఆర్టీజీఎస్)ను జిల్లాకు ఇస్తే బాగుంటుందని సదస్సులో భాగంగా ముఖ్యమంత్రిని కలెక్టర్ వినోద్‌కుమార్ కోరారు. దీనికి సీఎం స్పందిస్తూ సెల్‌ఫోన్ చేతిలో ఉంటే రియల్ టైం ఉన్నట్లేనని, రాష్ట్రంలో ఏం జరుగుతుందో ఫోన్ చూసుకుంటే తెలిసిపోతుందని చంద్రబాబు తెలిపారు. అనవసర ఖర్చుకు కూడా దూరంగా ఉండాలని కలెక్టరేట్‌లోని సిబ్బంది ఆర్టీజీఎస్‌తో సమన్వయం చేసుకుంటే చాలని సీఎం సూచించారు. పెట్టుబడులకు గమ్యస్థానంగా జిల్లాలు ఉండాలంటే శాంతి భద్రతలే కీలకమని తెలిపారు. అప్పుడే పెట్టుబడుదారులకు భరోసా కలుగుతుందని ఎస్పీల సమావేశంలో సీఎం అభిప్రాయపడినట్లు సమాచారం.



రెండేళ్ల నుంచి మూతపడి ఉన్న హద్దు రాళ్ల తయారీ యూనిట్

రూ.16 కోట్ల వృథా

- మూలనపడిన సర్వే రాళ్ల తయారీ యూనిట్
- పట్టించుకోని ఖనిజాభివృద్ధి సంస్థ అధికారులు

బల్లికురవ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను అలాగే వదిలేస్తున్నారు. దీంతో రూ.కోట్లలో ప్రజాధనం వృథాగా మారుతోంది. బల్లికురవలో గత ప్రభుత్వం రూ.16 కోట్లతో ఏర్పాటు చేసిన సర్వే హద్దు రాళ్ల తయారీ యూనిట్ రెండేళ్లుగా వినియోగం లేదు. దీంతో యంత్రాలు తుప్పు పడుతుండగా, షెడ్లు కూలిపోతున్నాయి. రెండేళ్ల నుంచి పరిశ్రమ మూత పడినా ఖనిజాభివృద్ధి సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. బల్లికురవలో ఓ రైతు వద్ద ఆరు ఎకరాలను మూడేళ్లకు లీజుకు తీసుకుని 2021లో అప్పటి వైసీపీ ప్రభుత్వం సర్వే హద్దు రాళ్ల తయారీకి ఖనిజాభివృద్ధి సంస్థ సుమారు రూ.16 కోట్లను వెచ్చించి యూనిట్‌ను ఏర్పాటు చేసింది. సర్వే హద్దు రాళ్లపై జగన్ ఫొటోతో మొదట్లో కొంతకాలం హద్దు రాళ్ల తయారు చేసి వివిధ ప్రాంతాలకు తరలించారు. బల్లికురవ ప్రాంతంలో అత్యధికంగా గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలు ఉన్నా రూ.కోట్ల నిధులను తమకు అనుకూలమైన వారికి కట్టబెట్టేందుకు ఖనిజాభివృద్ధి సంస్థతో ప్రత్యేకంగా యూనిట్‌ను ఏర్పాటు చేయిం చిందన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఏపీఎండీసీ హద్దు రాళ్ల తయారీ యూనిట్‌ను గ్రానైట్ వ్యాపారులకు అద్దెకు ఇస్తే ప్రభుత్వ నిధులు వృథా కాకుండా ఉంటాయని ప్రజలు అంటున్నారు.



తుప్పు పడుతున్న మిషనరీలు

నిరుపయోగంగా రాళ్లు ఎత్తే క్రేన్



సీసీఆర్‌సీ జాప్యం

కౌలు రైతులకు శాపం

- కార్డుల జారీ లక్ష్యం లక్ష... ఇప్పటికి ఇచ్చింది 45,000
- కౌలు రైతులకు అందే రాయితీ ప్రయోజనాలపై ప్రభావం
- సేద్యంలో కౌలు రైతాంగమే అధికం
- అవగాహన కల్పించడంలో యంత్రాంగం విఫలం

వ్యవసాయానికి ఊతమివ్వడానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. కౌలు రైతాంగానికి వాటి తాలూకా రాయితీ ఫలాలు అందాలంటే సీసీఆర్‌సీ(క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డ్) కలిగి ఉండాలి. జిల్లాలో సేద్యం చేస్తున్న వారిలో కౌలు రైతులదే అధికశాతం. వైసీపీ ఐదేళ్ల పాలనలో కౌలు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. సీసీఆర్‌సీ కార్డుల జారీలోనూ తలాతోక లేని నిబంధనలతో వారిని తీవ్ర ఇక్కట్లకు గురిచేసింది. ఈ ప్రభుత్వంలో గతేడాది జిల్లా వ్యాప్తంగా దాదాపు 78,000 వరకు కౌలు రైతాంగానికి సీసీ ఆర్‌సీ కార్డులు ఇవ్వగా, ప్రస్తుత సీజన్‌లో లక్ష కార్డుల లక్ష్యాన్ని వ్యవసాయశాఖకు ప్రభుత్వం విధించింది. కార్డుల జారీలో ఆశించినంత వేగం కనిపించకపోవడం కౌలు రైతులకు శాపంగా మారింది. 11 నెలల గడువుతో ఇచ్చే ఈ కార్డుల విషయం లో కొన్ని పునరుద్ధరించడం, మరికొన్ని కొత్తవి జారీ చేయడం జరగాల్సి ఉంది. లక్ష కార్డుల జారీ లక్ష్యాన్ని సెప్టెంబరు చివరికి పూర్తి చేయాలనేది ప్రభుత్వ ఆదేశాలుగా ఉన్నాయి.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ఇప్పటికే దాదాపు మూడు నెలలు దాటింది. వార్షిక పద్దులో భాగంగా అన్నదాతలకు బ్యాంకులు ఇచ్చే రుణాలు కూడా దాదాపు 70 శాతం చేరుకున్నట్లు తెలుస్తోంది. కానీ కౌలు రైతులకు ఇచ్చే సీసీఆర్‌సీ కార్డుల సంఖ్య మాత్రం ఇప్పటి వరకూ 45,000కు మించలేదని తెలుస్తోంది. ప్రభుత్వం



అందించే ఎరువుల సబ్సిడీ, బీమా పరిహారం, విత్తనాల రాయితీతో పాటు బ్యాంకులు అందించే రుణాలకు కూడా సీసీఆర్‌సీ కార్డే ప్రామాణికంగా ఉండనుంది. కానీ లక్ష్యంలో 50 శాతం కూడా ఇప్పటి వరకు పూర్తి కాకపోవడం కౌలు రైతాంగం ప్రయోజనాలను కాలరాసే విధంగా ఉంది. అంతే కాకుండా సీసీఆర్‌సీ కార్డుల విషయంలో భూయజమానులకు ఉన్న అపోహాలు తొలగించడానికి గ్రామాల వారీగా అవగాహన సదస్సులు పెట్టాలని గతంలోనే ప్రభుత్వం సూచించిన సంగతి తెలిసిందే. క్షేత్రస్థాయిలో ఈ నిర్ణ యాలు ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేకపోగా, సీసీఆర్‌సీ కార్డుల జారీ నత్తనడకన సాగడానికి భూ యజమానుల సహకారం దక్కకపోవడం కూడా ఓ కారణంగా కనబడుతోంది.

కౌలు రైతులే అధికం

జిల్లాలో దాదాపు 3.75 లక్షల ఎకరాలు ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం కాగా రైతుల సంఖ్య రెండు లక్షలుగా ఉండనుంది. ఇందులో కౌలు రైతులే దాదాపు లక్షన్నర వరకు ఉండనున్నారు. ప్రభుత్వం గతేడాదితో పోలిస్తే కౌలు రైతులకు ఇచ్చే సీసీఆర్‌సీ కార్డుల లక్ష్యాన్ని 20,000 పెంచి లక్షకు చేర్చింది. సేద్యానికి సంబంధించి ప్రభుత్వం అందించే ప్రతి రాయితీ పథకం కౌలు రైతుల చెంతకు చేరాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కార్డుల జారీ సంఖ్యను భారీగా పెంచింది. కౌలు రైతులకు బ్యాంకులు ఇచ్చే రుణాల విషయంలో కూగా ఈ ఏడాది గణనీయంగా పెరుగుదల కనబడాలని కూడా ప్రభుత్వం బ్యాంకర్లను కోరిన సంగతి తెలిసిందే

సెప్టెంబరు చివరి కల్లా..

నిర్దేశించిన లక్ష కార్డుల లక్ష్యాన్ని ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ప్రభుత్వం గతంలోనే ఆదేశాలిచ్చింది. నిజానికి జూన్ మొదటివారం నుం చే సీసీఆర్‌సీ కార్డుల జారీ ముమ్మరంగా ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ అధిక శాతం కార్డుల రెన్యువల్ గడువు ఆగస్టు, సెప్టెంబరు నెల చివరికి పూర్తవుతుందని, ఆ సమయానికి వంద శాతం లక్ష్యం చేరుకుంటామని యంత్రాంగం చెప్పింది. కానీ సెప్టెంబరు ముగింపుకొచ్చినా ఇప్పటికీ 50 శాతం కార్డుల జారీ కాకపోవడం వ్యవసాయశాఖ ఉదాసీనతగా కనబడుతోంది. మరో వైపు ప్రకృతి విపత్తులతో అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఇటీవల ఎడతెరిపి లేని వర్షాలకు వరిపైరు ముంపుకు గురై రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిన సంగతి తెలిసిందే. వీరిలో అధిక శాతం మంది కౌలు రైతులే కాగా ప్రభుత్వం ఇస్తానన్న రాయితీ విత్తనాలు వీరి దరికి చేరాలన్నా కూడా సీసీఆర్‌సీ కార్డు వారికి జారీ అయి ఉండాలి. కానీ క్షేత్రస్థాయిలో చాలా మంది కౌలు రైతాంగం వద్ద సీసీఆర్‌సీ కార్డు లేకపోవడంతో రాయితీ ఫలాలు అందని పరిస్థితి కనబడుతోంది. ఈ బాలారిష్టాలతో పాటు సీఆర్‌సీ కార్డుల విషయంలో భూ యజమానులకు ఉన్న అపోహాలు కూడా జారీకి ప్రతిబంధకంగా ఉంటున్నట్లు తెలుస్తోంది.



వెలగపూడి సచివాలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్

సీఎం పర్యటనకు

విస్తృత ఏర్పాట్లు

కలెక్టర్ తమీమ్ అన్సారియా

తుళ్లూరు, (వెలగపూడి) సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబు డీఎస్సీ నియామక పత్రాలు అందజేయనున్న ప్రాంగణంలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. 19వ తేదీన వెలగపూడిలో రాష్ట్ర సచివాలయం దగ్గర ఎన్-9 రోడ్డు వద్ద డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రా లు అందించే కార్యక్రమం జరుగనుంది. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. సంబంధిత ఏర్పాట్లను ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలిలతో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ప్రధాన వేదిక, పార్కింగ్ తదితర ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఎల్ఈడీ స్క్రీన్‌లను, బారికేడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశిం చారు. జిల్లాల నుండి వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా తగు సూచన బోర్డులు ఏర్పాటు చేయాలని, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, తుళ్లూరు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ ము రళీకృష్ణ, జిల్లావిద్యాశాఖ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో పాలన

- వాట్సాప్ గవర్నెన్స్‌తో ప్రజలకు చేరువ
- అవకతవకలకు పాల్పడితే డీలర్లపై చర్యలు
- స్మార్ట్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ఆనందబాబు తెలిపారు. మండలంలోని జంపనిలో మంగళవారం ఆయన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని ప్రవేశ పెట్టామన్నారు. అన్ని సేవలను ప్రజలకు చేరువచేయాలన్న సంకల్పంతో పౌర సరఫరా వ్యవస్థలో మార్పులు తీసుకువస్తూ స్మార్ట్ కార్డులను ప్రవేశ పెట్టామన్నారు. పీ-4 పథకం ద్వారా పేదరిక నిర్మూలనకు శ్రీకారం చుట్టామన్నారు. 2027 కల్లా ప్రజల తలసరి ఆదాయం పెంచేందుకు ముఖ్యమంత్రి బృహత్తరమైన ప్రణాళికను రూపొందించారన్నారు. రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జగన్ ప్రజాధనాన్ని వృథా చేయడంతో పాటు రేషన్ వ్యవస్థను కూడా పాడు చేశారని విమర్శించారు. గతంలో రేషన్ పంపిణీలో 2జీ నెట్‌వర్క్ కారణంగా సర్వర్ల సమస్యలు ఏర్పడ్డాయని, ఇప్పుడు 5జీ నెట్‌వర్క్ వినియోగం ద్వారా రేషన్ పంపిణీ వేగవంతంగా సాగుతుందన్నారు. వేలిముద్రలు పని చేయకపోయినా స్కాన్ ద్వారా కానీ స్వైప్ ద్వారా స్మార్ట్ కార్డులతో రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, టీడీపీ పార్లమెంటరీ స్థాయి అధికారి ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, మండల అధ్యక్షుడు గాజుల వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి వేల్పుల రవిప్రసాద్, యార్డు ఉపాధ్యక్షుడు అమ్మిశెట్టి కిశోర్‌బాబు, రాష్ట్ర మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరి షేక్ హనీఫ్, న్యాయవాదుల విభాగం కన్వీనర్ జయప్రకాష్, గవిని లక్ష్మీదుర్గ, వట్టిప్రోలు యోబు, బీసీ సంఘ నాయకులు పల్లా వాసుదేవనాయుడు, పంచాయతీ కార్యదర్శి భూపతిరెడ్డి పాల్గొన్నారు.



జంపనిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

లెక్కల్లోనే.. మొక్కలు

- ఆర్భాటంగానే వన మహోత్సవాలు
- మొక్కల సంరక్షణల్లో అంతులేని నిర్లక్ష్యం



చీరాలలో డివైడర్ల మధ్య మొక్కలు

చీరాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవాలు ఆర్భాటాలకే పరిమితమవుతున్నాయి. రూ.లక్షలు వెచ్చించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారే కానీ క్షేత్రస్థాయిలో మొక్కలు కనిపించడంలేదు. లక్షల్లో మొక్కలు లెక్కలు చూపుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఆ లెక్కలకు, మొక్కలకు పొంతన ఉండటం లేదు. పెరిగిపోతున్న పర్యావరణ కాలుష్యాన్ని అడ్డుకునేందుకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రభుత్వాలు, పర్యావరణ వేత్తలు సూచిస్తున్నా అధికారుల్లో చిత్తశుద్ధి కొరవడింది. చీరాల మున్సిపాలిటీలో 33 వార్డులు, అద్దంకి 20 వార్డులు, బాపట్ల 34 వార్డులు, రేపల్లె 28 వార్డుల్లో లక్షల మంది జనాభా ఉన్నా పర్యావరణ పరిరక్షణపై అధికారులు దృష్టి సారించడంలేదు. పేరుకే మొక్కలు నాటుతున్నారు కానీ వాటి పర్యవేక్షణ కానరావడంలేదు. దీంతో మొక్కలు మూణ్నాళ్ల ముచ్చటకే పరిమితమవుతున్నాయి. నీరు సకాలంలో అందకపోవడంతో మొక్కలు నాటిన వెంటనే ఎండిపోతున్నాయి. గత ప్రభుత్వంలో మాదిరిగా అరకొర మొక్కలు నాటే కార్యక్రమాలకు చెక్ పెడుతూ కూటమి ప్రభుత్వం జియో ట్యాగ్ విధానం తెచ్చింది. అయినా మొక్కల లెక్కలు తారుమారవుతున్నాయి. లెక్కల్లో చూపినవాటిలో పది శాతం మొక్కల పర్యవేక్షణ జరగడంలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అంచనా వేయవచ్చు.

ఈ సారైనా సంరక్షణ ఉండేనా?

పట్టణాల్లో రహదారుల వెంబడి ఎవెన్యూ కల్చర్(రోడ్ల వెంబడి మొక్కలు నాటడం)పై అధికారులు తాజాగా అంచనాలు సిద్ధం చేశారు. గతంలో నాటిన మొక్కల ప్రదేశాన్ని మినహాయించి మిగిలిన చోట మొక్కలు నాటేందుకు ఎన్ఆర్ఈజీఈఎస్‌శాఖకు అధికారులు సూచనలు చేశారు. త్వరలోనే వాటిని కార్యరూపం దాల్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సారైనా అనుకున్న మేర మొక్కలు నాటి ప్రభుత్వ లక్ష్య సాధనకు అధికారులు కృషి చేయాలని ప్రజలు భావిస్తున్నారు.

పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలి



మాట్లాడుతున్న డీఏవో శ్రీనివాసరావు

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు ఈ ఏడాది రబీలో పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు సూచించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఉప్పుగుండూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు నల్లబర్లీ పొగాకును సాగుచేయవద్దని చెప్పారు. జిల్లాలో యూరియా కొరత లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఏడీఏ బి.రమేష్‌బాబు, ఏవో పోతినేని వెంకట్రావు పాల్గొన్నారు.

యూరియాకు కొరతలేదు

ఒంగోలురూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : యూరియాకు ఎలాంటి కొరత లేదని మండల వ్యవసాయ అధికారి కె.రమేష్‌బాబు చెప్పారు. మండలంలోని ఉలిచి గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెల్లబర్లీ పొగనారు మళ్లు సాగు రైతులు వ్యవసాయశాఖకు సమాచారమివ్వాలని చెప్పారు. నల్లబర్లీ పొగాకు సాగును రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందన్నారు. తెల్లబర్లీ పొగాకు వ్యాపారులు కొనుగోలుకు అనుమతి ఇస్తే సాగు చేసుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో వై.నరసింహారావు, నన్నపనేనిసుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా ఓజోన్‌పొర పరిరక్షణ దినోత్సవం

ఒంగోలు విద్య, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కళ్యాణి ఓజోన్ పొర ప్రాధాన్యతను వివరించారు. ఓజోన్ పొర భూమిపైకి వచ్చే అతినీల లోహి కిరణాలను ఆపివేసి భూమికి రక్షణ పొరగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీలు డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పీవీ హేమలత, డాక్టర్ కే ప్రతాప్, డాక్టర్ ఈ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బసవన్నపాలెం విద్యార్థులు

మద్దిపాడు, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసవన్నపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్ పోటీలకు ఆర్.సుదర్శన్, బొమ్మల తయారీ పోటీలకు దర్శిత్, ఆర్ ఆరాధ్య ఎంపికయినట్లు హెచ్‌ఎం కోటేశ్వరరావు తెలిపారు. ఇటీవల మైనంపాడు డైట్‌లో జరిగిన కళా ఉత్సవ్‌లో సుదర్శన్ మొదటి బహుమతి, ఆరాధ్య ద్వితీయ బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా వారిని శ్రీనివాసరావు, మంజుల, రమణమ్మ, శివపార్వతి, ఉషారాణి, అంకయ్య, శ్రీదేవి అభినందించారు.

పశువుల పెంపకంతో ఆర్థిక తోడ్పాటు

మద్దిపాడు, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : పశువుల పెంపకం ద్వారా రైతు ఆర్థికంగా తోడ్పాటు లభిస్తుందని సహాయ సంచాలకులు డాక్టర్ పి.కిషోర్‌కుమార్ చెప్పారు. మంగళవారం లింగంగుంట గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు పశువుల పెంపకంపై దృష్టిసారించాలన్నారు. ఈ సందర్భంగా 23 గేదెలకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించి, 180 గేదెలకు గొంతు వాపు వ్యాధి టీకాలు వేసినట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు పశుగ్రాస విత్తనాలు సబ్సిడీ కింద సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.హర్షశ్రీ, పారా వెటర్నరీ సిబ్బంది, పశుసంవర్ధక శాఖ సహాయకులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

కొప్పోలు కృష్ణ మందిరంలో చోరీ

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కృష్ణ దేవాలయంలో హుండీ పగులకొట్టి సుమారు రూ.25 వేలు నగదును అపహరించుకెళ్లారు. సోమవారం రాత్రి ఒంగోలు నగరం శివారు ప్రాంతమైన కొప్పోలులో కృష్ణ దేవాలయంలో దొంగలుపడ్డారు. ఆలయ గేటును ఎక్కి లోపలకు దూకి హుండీని పగలకొట్టారు. సుమారు రూ.25 వేలు అపహరించుకెళ్లారు. ఈ మేరకు దేవాలయం నిర్వాహకులు తాలుకా పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలాన్ని సీఐ విజయకృష్ణ పరిశీలించి కేసు నమోదు చేశారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

ఒంగోలురూరల్ సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : త్రోవగుంట పశువైద్యశాలలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాలను పశుసంవర్థకశాఖ ఏడీఏ బి. బసవశంకరరావు వేశారు. మండలంలో తెల్లపశువులు(ఎద్దులు, ఆవులు) 468, నల్లపశువులు(గేదలు, పాడి గేదలు)7182 ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికి 58 తెల్లపశువులకు టీకాలు వేశామన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్స్‌డే వేడుకలను ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంజనీర్ ఇన్ చీఫ్ అడ్మిన్ బూసం శ్యాంప్రసాద్ పాల్గొని మాట్లాడారు. నిర్మాణంలో ఇంజనీర్ల పాత్రను వివరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌ఈ వరలక్ష్మీ, కన్‌స్ట్రక్షన్స్ ఎస్‌ఈ అబుసలీం, నాగార్జునసాగర్ కుడికాలువలు, లింగంగుంట ఎస్‌ఈ కృష్ణమోహన్, డిప్యూటీ ఎస్‌ఈలు హరికృష్ణంరాజు, రామకృష్ణ, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలిలో ఇద్దరు వైస్ చైర్మన్ల నియామకం

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలిలో రెండు వైస్ చైర్మన్ పోస్టులను భర్తీ చేస్తూ ఉన్నత విద్యాశాఖ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. వైస్ చైర్మన్-1గా శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావును, వైస్ చైర్‌పర్సన్-2గా నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ రత్నశీల మణిని నియమించింది. వీరి పదవీ కాలం మూడేళ్లు. గత ప్రభుత్వం నియమించిన ఇద్దరు వైస్ చైర్మన్లలో ఒకరి పదవీకాలం ఇటీవల ముగియగా, మరొకరు రాజీనామా చేశారు. ఆయా స్థానాలను కూటమి ప్రభుత్వం ఇప్పుడు భర్తీ చేసింది.

పశుసంవర్ధక శాఖలో 15 మంది జేడీలకు పోస్టింగ్‌లు

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్ల నుంచి జాయింట్ డైరెక్టర్లుగా తాత్కాలిక పదోన్నతి పొందిన 15మందికి పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పి.ప్రేమ్‌చంద్- అనంతపురం జేడీ, జి.సుబ్బమ్మ- విజయవాడ ఎండీ కాప్, కె.శ్రీనివాసులు-విజయవాడ వీఎస్ఎస్‌హెచ్, ఎం.రత్నజ్యోతి-డైరెక్టరేట్, బి.చంద్రశేఖర్-చింతలదీవి ఎన్‌కేబీసీ, కె.మురళీకృష్ణ-విజయనగరం జేడీ, కె.భూపాల్‌రెడ్డి-డైరెక్టరేట్, డి.శంకరరావు-విశాఖపట్నం జేడీ, బి.ప్రసాదరావు-ఏలూరు జేడీ, ఎన్.వెంకటేశ్వరరావు- ఒంగోలు జేడీ, టి.వి.సుధాకర్-డైరెక్టరేట్, డి.ఉమామహేశ్వరి-చిత్తూరు జేడీ, వి.దుర్గాప్రసన్నబాబు-డైరెక్టరేట్, కె.వి.వి.సత్యనారాయణ-గుంటూరు జేడీ, పి.వెంకటరమణ-శ్రీకాకుళం జేడీగా నియమితులయ్యారు. కాగా తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ నియంత్రణలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు రాయల్‌రెడ్డి, శివసాగర్‌రెడ్డిల డిప్యూటేషన్‌ను మరో ఏడాది పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పర్చూరులో పిచ్చికుక్క దాడి

- పదిమందికి తీవ్రగాయాలు
- ప్రజలు బెంబేలు



పిచ్చికుక్క దాడిలో గాయపడిన ఇద్దరు బాలురు

పర్చూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పిచ్చికుక్క దాడిచేసి పదిమందిని గాయపరచిన ఘటన మంగళవారం పర్చూరులో చోటుచేసుకుంది. ఈ దాడిలో గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పిచ్చికుక్క దాడి ఘటనతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. బాధితులతో పర్చూరు ప్రభుత్వ వైద్యశాల కిక్కిరిసింది. ఒక్కసారిగా కుక్కదాడిలో గాయపడిన వారు వైద్యశాలకు తరలి రావడంతో అసలు ఏమి జరిగిందో అర్థంకాక వైద్యులు సైతం ఆందోళనకు గురయ్యారు. ఆ దాడిలో అధిక సంఖ్యలో చిన్నారులు ఉన్నారు. వీధి కుక్కలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, అనేక మార్లు పంచాయితీ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకున్న నాధుడే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. పశువులను, అనేక వీధికుక్కలను సైతం పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచిందని స్థానికులు తెలిపారు. దీంతో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



వలంటీర్ ఉపాధ్యాయులకు వయోజన విద్య పుస్తకాలను అందజేస్తున్న ఏపీఎం, వయోజన విద్య పర్యవేక్షకులు

నూరుశాతం అక్షరాస్యత సాధించాలి

చినగంజాం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ఉల్లాస్-అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యతను నిర్మూలించి, నూరుశాతం అక్షరాస్యతను సాధించడానికి కృషి చేయాలని ఏపీఎం గద్దె పెదసుబ్బారావు, వయోజన విద్య పర్యవేక్షకులు కొణిదల మనోరంజన్‌బాబులు అన్నారు. వెలుగు కార్యాలయంలో డీఆర్‌డీఏ సీసీలు, యానిమేటర్ల, వలంటీర్ ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం-2020 కి నిర్దేశించిన ప్రకారం చదువురాని వారికి ప్రాథమిక అక్షరాస్యతతో పాటు 21వ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన నైపుణ్యాలను అందజేయటానికి భారత ప్రభుత్వం ఉల్లాస్ పథకం రూపొందించినట్లు తెలిపారు. ఉల్లాస్ పథకం ద్వారా మన రాష్ట్రంలో 2029 సంవత్సరం నాటికి రాష్ట్రంలో నూరుశాతం అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంలో మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్ అక్షర ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో 15 సంవత్సరాలు దాటి చదువురాని వయోజనులను గుర్తించి ,వారి వివరాలు నమోదు చేసుకొలన్నారు. వారికి వలంటరీ ఉపాధ్యాయుల చదువు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీవోలు, స్వచ్ఛంద్ర సంస్థలు, పీ4 మార్గదర్శులు, సహాయ సహకారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షులు, సీసీలు పాల్గొన్నారు.

ఇంటి బాట పట్టిన వలస గొర్రెలు

- రెండు మాసాల నుంచి 10 వేల గొర్రెలు మేత కోసం బల్లికురవకు రాక
- తిరిగి తమ సొంత ప్రాంతానికి తరలిస్తున్న కాపరులు



బల్లికురవ, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): వలసవచ్చిన గొర్రెల మందలు తిరిగి తమ స్వగ్రామాల బాట పట్టాయి. గత రెండు మాసాల నుండి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు ప్రాంతం నుండి వలస వచ్చిన 10 వేల గొర్రెలు బల్లికురవ మరియు పరిసర గ్రామాల పరిధిలో ఉన్నాయి. తమ ప్రాంతంలో వరి నాట్లు ముందుగా వేయటంతో గొర్రెలకు మేత లేకపోవటంతో వలస వచ్చామని గొర్రెల కాపరులు అంటున్నారు. తిరిగి ఇప్పుడు తమ వద్ద మేత అందుబాటులో ఉండటంతో గొర్రెలను మేపుకుంటు తిరిగి వెళుతున్నామన్నారు. బల్లికురవ సంతమాగులూరు రోడ్డులో గొర్రెల మందలు పెద్ద ఎత్తున ఉన్నాయి. గొర్రెల కాపరులు ఈసందర్భంగా మాట్లాడుతూ తిరిగి తాము మరో పది రోజుల్లో స్వగ్రామాలకు వెళతామని తెలిపారు. ఏటా తాము గొర్రెలను తోలుకొని వస్తుంటామని వారు తెలిపారు.

పచ్చి మేత కొరకు గొర్రెలను తీసుకొచ్చాం

మా ప్రాంతంలో వరి నాట్లు ఉండడంతో మేత అందుబాటులో లేదు. అందుకే మేము 10 వేల గొర్రెలను తోలుకొని వచ్చాం. రెండు మాసాల నుంచి బల్లికురవ ప్రాంతంలో మేత మేపుకున్నాం. తిరిగి మా స్వగ్రామాలకు బయలుదేరాం. ఏటా గొర్రెలను వలస తీసుకస్తుంటాం. వస్తే రెండు మూడు నెలలు ఇక్కడే ఉంటాం.

- ఆదియ్య, గొర్రెల కాపరి, ఏలూరు

అర్జీలను వేగంగా పరిష్కరించేందుకు కృషి

- చీరాల ఆర్‌డీవో చంద్రశేఖరనాయుడు



అద్దంకి, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చీరాల ఆర్‌డీవో చంద్రశేఖరనాయుడు అన్నారు. అద్దంకి నియోజకవర్గానికి సంబంధించి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్‌డీవో లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై ఆయన విచారించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అర్జీదారులను పిలిచి, అధికారులు సమక్షంలో సమస్య పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. మొత్తం 44 అర్జీలు రాగా, అద్దంకి మండలం 20, బల్లికురవ మండలం 9,పంగులూరు మండలం 5, కొరిశపాడు మండలం 6, సంతమాగులూరు మండలం 6 అర్జీలు పెండింగ్ లో ఉండగా ఆర్‌డీవో విచారించారు. తహసీల్దార్‌లు శ్రీచరణ్, శింగారావు, సుబ్బారెడ్డి, రవినాయక్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు. ముందుగా శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం లో ఆర్‌డీవో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు చర్యలు
- నేటి నుంచి పదిరోజులపాటు స్పెషల్ డ్రైవ్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపై పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి పది రోజులపాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు. అందుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను కూడా రూపొందించారు. రోజూ ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరుచేసి తీసుకొని వాటిని సంపద తయారీ కేంద్రాలకు తరలించనున్నారు. గ్రామాల చివర్లో చెత్త నిల్వలు లేకుండా చూడటంతోపాటు పక్కా, కచ్చా కాలువల్లో పూడికతీత పనులు చేపట్టనున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోనున్నారు. గ్రామాల్లో కాలువలను శుభ్రం చేయించి మురుగు నిల్వ లేకుండా, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టనున్నారు. బ్లైటెక్స్ ఆయిల్, మలాథిన్‌ను ఫాగింగ్ చేయనున్నారు. ప్రభుత్వం ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయడంతో పంచాయతీల్లో నిధులు కూడా అందుబాటులో ఉన్నాయి. దీంతో కార్యక్రమాన్ని వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శుల సహకారంతో బుధవారం నుంచి స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టనున్నారు. డీడీవోలు, డీఎల్‌డీవోలు, డీఎల్‌పీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు ప్రతిరోజూ ఏదో ఒక గ్రామ పంచాయతీని సందర్శించి అక్కడ జరుగుతున్న స్పెషల్ పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొనాలని డీపీవో వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.


ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి బస్టాండ్ ఆవరణలో మంగళవారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2001లో జరిగిన కార్మిక ఐక్య పోరాటమే ఆర్టీసీని నిలబెట్టిందని, ఆనాటి పోరాటంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ కీలకపాత్ర పోషించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎలక్ట్రికల్ బస్సులను నేరుగా ఆర్టీసీకే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి డీవీ సుబ్బారావు, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాసరావు, శంషావలి, కామేశ్వరరావు, యేసు, రత్నకుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా డ్వాక్రా సంఘాల లెక్కలు



మాట్లాడుతున్న వెలుగు ఏపీడీ లక్ష్మారెడ్డి

కొండపి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా సంఘాల లెక్కలు ఇకపై పక్కాగా ఉంటాయని వెలుగు ఏపీడీ లక్ష్మారెడ్డి తెలిపారు. అందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్‌ను తీసుకొచ్చిందని చెప్పారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం గ్రామ సంఘ సహాయకులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీడీ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ ద్వారా తీసుకున్న నిర్ణయం వలన సభ్యుల లావాదేవీలకు ఆర్థిక భద్రత ఏర్పడుతుందని తెలిపారు. కొత్త యాప్‌ను తీసుకొచ్చినందున ఆర్థిక లావాదేవీలను ఆన్‌లైన్ విధానంలో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం గోపీనాథ్, మల్లికార్జున, వి.కృష్ణారెడ్డి, గోవిందమ్మ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉంటేనే ఉన్నత స్థాయి

మార్టూరు, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి):మద్యపానం, ధూమపానం, గంజాయి అలవాటు, తదితర వ్యసనాలకు దూరంగా ఉంటేనే ఉన్నత స్థాయికి చేరుకో గలుగుతారని, సీఐ ఎం.శేషగిరిరావు విద్యార్థులకు సూచించారు. మంగళవారం మార్టూరులో రాయల్ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన వారితో మాట్లాడుతూ సోషల్ మీడియాను మంచికి వినియోగించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

బల్లికురవ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తజమ్మలమడక ఎస్సీకాలనీకి చెందిన గద్దల పేతురు(36) రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు జమ్మలమడక గ్రామానికి చెందిన గద్దల పేతురు నూనే రమేష్ అను ఇరువురు ద్విచక్రవాహనంపై వినుకొండ వెళుతున్నారు. కూకట్లపల్లి గ్రామ సమీపంలోకి వచ్చేసరికి బొలేరో వాహనం సోమవారం వారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని నర్సారావుపేట వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో పేతురు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాద ఘటనపై మంగళవారం మృతుని బంధువు నూనే సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన

మార్టూరు, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఉద్యానశాఖ తరఫున ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రోత్సాహకాలపై ఉద్యాన శాఖాధికారి బి హనుమంతనాయక్ రైతులకు వివరించారు. మంగళవారం మండలంలోని నాగరాజుపల్లి గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి మురళీ కృష్ణ అధ్యక్షత వహించారు.అనంతరం హనుమంతనాయక్ రైతులతో మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు,పంట దిగుబడి గురించి రైతులకు వివరించారు.పంట సాగుకు ఆసక్తిగలిగిన రైతులకు ఉద్యాన శాఖ ప్రోత్సాహం కల్పిస్తుందన్నారు.ఇంకా ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధి భాషా రైతులకు మరిన్ని విషయాలను వివరించారు.ఈ కార్యక్రమంలో మిన్నెకంటి రవికుమార్, సర్పంచ్ దాసరి నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మో భవానీ సెంటర్

- అద్దంకిలో ఒక వైపు ట్రాఫిక్ జామ్ ... మరో వైపు గోతులు
- చినుకు పడితే వాహనచోదకుల ఇక్కట్లు



అద్దంకి, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవానిసెంటర్ అంటే వాహనచోదకులు హడలి పోతున్నారు. ఐదు రోడ్ల కూడలిగా ఉండడం, అన్ని రోడ్లలో పెద్దఎత్తున వాహనాలు ప్రయాణిస్తుండడంతో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతుంది. భవానిసెంటర్ దాటితే హమ్మయ్య అంటూ వాహనచోదకులు ఊపిరిపీల్చుకునే పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు లేని సమయంలో అయితే వాహనాలు అడ్డదిడ్డంగా ప్రయాణిస్తూ మరింత ఇబ్బందిగా మారుతోంది. ఇది చాలదన్నట్లు రేణింగవరం రోడ్డులో మురుగు నీటిప్రవాహానికి ఏర్పాటు చేసిన పైప్ కల్వర్టు తరచూ పగిలిపోతుంది. విజయవాడ-బెంగళూరు హైవే రోడ్డుకు గ్రావెల్ తరలించే ఎక్కువ బరువు ఉండే టిప్పర్ల ప్రయాణిస్తుండడంతో తరచూ గోతులు పడుతున్నాయి. గోతులలో తాత్కాలికంగా గ్రావెల్ పోసి చదును చేస్తుండడంతో చిన్నపాటి వర్షంకురిసా. మరోసారి గోతులు పడుతున్నాయి. అదేసమయంలో పైప్ కల్వర్ట్ దెబ్బతిని రంధ్రాలు పడుతున్నాయి. దీంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇక దర్శి రోడ్డులో పరిస్థితి కూడా మరింత ఇబ్బందిగా ఉంది. నామ్ రోడ్డులో నుంచి దర్శి రోడ్డులో కలిసే చోట సీసీ రోడ్డు ఏర్పాటు చేయకుండా తారురోడ్డు తో సరిపెట్టడం, వర్షపు నీరు సైడ్ డ్రైన్లలోనికి వెళ్లే వీలు లేక పెద్ద గోతులు పడుతున్నాయి. దీంతో వర్షం పడితే గోతులలో నీరు నిలిచి వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇలా అన్ని విధాలుగా భవానిసెంటర్ అంటే వాహనచోదకులు హడలిపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించడంతో పాటు తరచూ గోతులు పడే ప్రాంతంలో శాశ్వతంగా కల్వర్టు నిర్మాణం చేసి సీసీ రోడ్డు వేయాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.


అశోక్‌కుమార్‌కు వైసీపీ నేతల శుభాకాంక్షలు



అశోక్‌కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న వైసీపీ నాయకులు

అద్దంకి,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి):అద్దంకి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా నియమితుడైన డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్‌ను మంగళవారం సాయంత్రం పిడుగురాళ్లలో అద్దంకి పట్టణ వైసీపీ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అద్దంకి పట్టణ వైసీపీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఈదా శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ, వైస్‌చైర్మన్ అనంతలక్ష్మి, కౌన్సిలర్లు బాలు, కోటేశ్వరరావు, రమణ, నేతలు మురహరి, భువనేశ్వరి, నాగరాజు, పరిమి ప్రసాద్, సోమా శ్రీనివాసరెడ్డి, విప్పర్ల వెంకటేశ్వర్లు తదితరులు అశోక్‌కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ మండల కమిటీ ఏకగ్రీవం



సింబోతుల సత్యనారాయణ

మేదరమెట్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కొరిశపాడు మండల టీడీపీ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ముప్పవరంలోని పార్టీ కార్యాలయంలో సమావేశమైన టీడీపీ నేతలు సమావేశమయ్యారు. మండల పార్టీ అధ్యక్షుడుగా సింబోతుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా గండే ఎస్కేల్, ఉపాధ్యాక్షుడిగా మోపర్తి లక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నక్కల బుల్లిబాబు, కందిమళ్ల విశ్వనాథ్, కోణికి అశోక్‌లు, కార్యదర్శులుగా మామిళ్లపల్లి సుమా, ఈ.సుబ్బారెడ్డి, బొమ్మిశెట్టి రాజ్యలక్ష్మీలు, కోశాధికారిగా రేగుల నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటిని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభినందించారు. అందరిని సమన్వయం చేసుకుంటూ ఐక్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. నూతనంగా కమిటి మంత్రి రవికుమార్‌కు, తమను ఎన్నుకున్న మండల పార్టీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

పశుసంవర్ధకశాఖ జేడీగా వెంకటేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్‌గా వెంకటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం జిల్లాలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును ఉద్యోగోన్నతిపై ఇక్కడ నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న జేడీ డాక్టర్ బేబిరాణి సెలవుపై వెళ్లడంతో పశుక్షేతంలో డీడీగా పనిచేస్తున్న డాక్టర్ రవి ఇన్‌చార్జి జేడీగా పనిచేస్తున్నారు. ఆ స్థానంలో వెంకటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెళ్లకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్వాయిపాడు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు... ప్రకాశం జిల్లా తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన రంపతోటి శ్రీనివాసరావు(31) శ్రీకాళహస్తి వైపు మోటార్‌బైక్‌పై వెళ్తుండగా తిరుపతి జిల్లా తాళ్వాయిపాడు సర్వీస్‌రోడ్డు వద్ద అదుపుతప్పి కింద పడిపోయాడు. హెల్మెట్ తల నుంచి విడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు.

అవీ..ఇవీ..

సీజనల్ వ్యాధులను నివారించండి


సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఇంకొల్లు, సెప్టెంబరు 16, (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్యంపై దృష్టి సారించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో ఘంటా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బండారు అనూష అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామలలో పారిశుధ్యంపై దృష్టిసారించి, విషజ్వరాలు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచిచల్లార్చిన నీటినే తాగాలని ఇంకొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి అంజలీ సూచించారు. మంజూరు చేసిన గృహాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ నటరాజ్ కోరారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు భవనం శ్రీలక్ష్మీ, తహసీల్దారు శ్రీనివాస్, ఏపీఎం అనూరాధ, ఏపీఎం బుల్లియ్య వివిధ శాఖల అధికారులతో పాటు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, గ్రామపంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు

సిద్ధూ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

పంగులూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ సిద్ధూసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పంగులూరు సీకేఎస్ వృద్ధుల ఆశ్రమంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా చందులూరి కామాక్షమ్మ, జుజ్జూరి శకుంతల జ్ఞాపకార్థం ట్రస్ట్‌ఛైర్మన్ డాక్టర్ సిద్ధు వెంకటసుబ్బారావు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. సీకేఎస్ ఆశ్రమ నిర్వాహకులు షడ్రక్ ట్రస్ట్‌ఛైర్మన్ సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వవిద్యార్థుల సహకారం అభినందనీయం


పాఠశాలకు పూర్వవిద్యార్థులు అందజేసిన వాటర్ కూలర్

ఇంకొల్లు, సెప్టెంబరు 16,(ఆంధ్రజ్యోతి) : పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని పూసపాడు ఎస్‌కెఏవీఎస్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు అన్నారు. పూసపాడు ఉన్నత పాఠశాలకు 2006-07 బ్యాచ్ పూర్వవిద్యార్థులు 40లీటర్ల కూలింత్ ఫ్రిడ్జ్, వాటర్‌క్యాన్లు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు నల్లూరి తిరుపతిరాయుడు, యార్లగడ్డ రామకృష్ణ, నల్లూరి విజయదుర్గ, నిమ్మగడ్డ అలైఖ్య ఘంట పద్మజశ్రీ, సూది సుస్మితలను హిందీ ఉపాధ్యాయినీ వి.సుబ్బాయమ్మ, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు అభినందించారు.

నేటి నుంచి స్వస్థనారి అభియాన్ ప్రారంభం

పంగులూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పంగులూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం నుంచి స్వస్థనారి - శక్తికుటుంబ అభియాన్ సేవలు ప్రారంభించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య తెలిపారు. మహిళలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం అక్టోబరు 2 వరకు కొనసాగుతుందన్నారు. పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటిక్యాన్సర్, గర్భాశయ, రొమ్ముకాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షల ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి నివారించే అవకాశం ఉందన్నారు.

కొలిక్కిరాని విచారణ

- జగనన్న మహిళా మార్టులో అవకతవకలు
- ఆరు నెలలుగా కొనసాగుతున్న విచారణ
- మంత్రికి మహిళల ఫిర్యాదు


అద్దంకిలోని జగనన్న మహిళామార్ట్(ఫైల్)

అద్దంకి, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): మెప్మా సభ్యుల సొమ్ము పెట్టుబడిగా పెట్టి ఏర్పాటు చేసిన జగనన్న మహిళామార్ట్‌లో అక్రమాలు చోటుచేసుకున్నాయి. విచారణ ప్రారంభించి సుమారు 15 నెలలు దాటినా ఇంకా కొలిక్కి రాలేదు. దీంతో సభ్యులకు విచారణపై కూడా నమ్మకం సన్నగిల్లుతోంది. వైసీపీ ప్రభుత్వంలో అద్దంకి పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ కాలనీలోని అన్నక్యాంటిన్‌లో 2022 ఫిబ్రవరి 3న జగనన్న మహిళామార్ట్‌ను ప్రారంభించారు. అద్దంకి పట్టణంలోని సుమారు 8వేల మంది స్వయం సహాయక సంఘాలు సభ్యులు(మెప్మా) ఒక్కొక్కరు 150 రూపాయలు చొప్పున సుమారు రూ.10.50 లక్షల పెట్టుబడి పెట్టించి ఏటా వచ్చే లాభాన్ని సభ్యులకు పంచుతామని నమ్మబలికి పెట్టుబడి పెట్టించారు. అంతటితో ఆగకుండా పెట్టుబడి పెట్టిన సభ్యులతో అదిక ధరకు మార్ట్‌లో సరుకులు కొనుగోలు చేయించారు. సుమారు రెండున్నర సంవత్సరాల పాటు నిర్వహించారు. అప్పటికే అవకతవకలపై పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. అప్పట్లో మెప్మా అధికారిగా పనిచేసిన అధికారిని ఇష్టారాజ్యంగా వ్యవహరించి మార్ట్‌లో వచ్చిన డబ్బులు సొంత అవసరాలకు వినియోగించుకున్నట్లు ఫిర్యాదులు అందాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సభ్యులు పెద్ద ఎత్తున మంత్రి రవికుమార్‌ను కలిసి అవకవతలపై విచారించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. అప్పట్లోనే విచారణ పేరుతో హడావుడి చేసిన జిల్లా అధికారులు అనంతరం నిమ్మకున్నారు. ఇటీవల మరలా మరోసారి మెప్మా కార్యాలయం లో అప్పట్లో మార్ట్‌లో పనిచేసిన సిబ్బంది, ఆర్‌పీల వద్ద స్టేట్‌మెంట్లు నమోదు చేశారు. అవకతకవల పై విచారణ ప్రారంభం కావడంతో మార్ట్‌కు సంబంధించిన బ్యాంక్ ఖాతాలో ఉండాల్సిన నగదును సదరు అధికారిణి పలు దఫాలు గా జమ చేసినట్లు తెలుస్తోంది. అదే సమయంలో సుమారు రూ.3.5 లక్షలు వెచ్చించి ఫర్నీచర్ కొనుగోలు చేసినట్లు చూపించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బ్యాంక్ ఖాతాలో సుమారు 8 లక్షల రూపాయలు ఉన్నట్లు సమచారం. అయితే విచారణ పూర్తి కాకపోవడంతో బ్యాంక్ ఖాతాలోని నగదును సభ్యులకు పంపిణీ చేయకుండా ఉంచారు. అదే సమయంలో ఫర్నీచర్ కూడా నిరుపయోగంగానే ఉంది. సుమారు రెండున్నర సంవత్సరాల పాటు జగనన్న మహిళామార్ట్ నిర్వహించినా సభ్యులకు నయాపైసా లాభాలు పంచలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారించి, వేగవంతం చేసి సభ్యుల పెట్టుబడి డబ్బులు పంపిణీ చేయటం తో పాటు, అవకతవకలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై చర్చ జరిగేనా..?

- గ్రామాలలో వేధిస్తున్న సమస్యలు
- నేడు మండల సర్వసభ్య సమావేశం


మండల ప్రజాపరిషత్ కార్యాలయం

బల్లికురవ, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): మూడుమాసాలకు ఒకసారి గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజాసమస్యలపై మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ప్రతిసారి మొక్కుబడి సమావేశాలు నిర్వహించడం మినహా అభివృద్ధి పనులు సమస్యలపై చర్చ జరిగిన దాఖలాలు లేవు. మండల జనరల్ బాడీ సమావేశం అంటేనే గ్రామాలలో సమస్యలపై చర్చ జరగాల్సి ఉంది. కాని పాలకమండలి సభ్యులు కూడా సకాలంలో సమావేశాలకు హాజరు కావడం లేదు. ప్రతిసారి సమావేశం ఆలస్యంగా ప్రారంభమై గంటలో ముగిస్తున్నారు. నేడు బుధవారం బల్లికురవ మండల కేంద్రంలో జరిగే మండల సర్వసభ్య సమావేశంలో అయినా, ప్రజాసమస్యలపై చర్చించి ప్రజలకు ఉపయోగపడే పనులకు నిధులు మంజూ రు చేస్తారా..? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. పాలకమండలి ఏర్పాటై నాలుగున్నరేళ్లు కావస్తున్న సమావేశంలో ఎప్పుడు పనుల ఆమోదంపై చర్చ పెట్టకుండా తదుపరి పనులు మంజూరు చేస్తున్నారని సభ్యులు ఆరోపిస్తున్నారు.

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరం


ఆటలపోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ ఈవో గంగాధర్

ఇంకొల్లు, సెప్టెంబరు 16,(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు కూడా అవసరమని చీరాల డిప్యూటీ డీఈవో గంగాధర్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇంకొల్లు మండల స్థాయిలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆటల పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.బాలకృష్ణ, రాజ్యలక్ష్మీ, కుమారి, అమ్మయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆటల పోటీలు

పంగులూరు : మండలంలోని చందలూరు ఉన్నత పాఠశాలలో 18, 19, తేదీలలో మండలస్థాయి ఆటలపోటీలు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం గిరిజ, పీడీ మధు, ప్రతిమ సంయుక్త ప్రకటనలో తెలిపారు. గురు, శుక్ర వారాలలో జరిగే ఈ ఆటల పోటీలలో ఎస్‌జీఎఫ్ మండల క్రీడాజట్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

మార్టూరు : విద్యార్థులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని, ఎంఈవో వస్రాంనాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని బొబ్బేపల్లి జడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో విజయం సాధించిన విద్యార్థులు తరువాత డివిజన్ స్థాయిలో, అనంతరం జిల్లా స్థాయిలో గెలవాలని ఆకాంక్షించారు. ఈ పోటీలలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ద్రోణాదులలో ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


ఓజోన్ అక్షరాలతో విద్యార్థులు

చినగంజాం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఓజోన్ పొరతో మనిషి జీవనం ముడిపడి ఉందని ప్రధానోపాధ్యాయులు అన్నారు. జోన్ పొర దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఓ జోన్ పొర ఫార్మేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యానికి గురైన మహిళ తిరిగి స్వదేశానికి..

చినగంజాం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : మస్కట్‌లో పని కోసం వెళ్లిన మహిళ అనారోగ్యానికి గురి కావడంతో పోలీసుల సహకారంతో తిరిగి స్వదేశానికి రప్పించారు. చినగంజాం ఎస్‌ఐ శీలం రమేష్ తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన ఓ మహిళ 2025 జూలై 7న హైదరాబాద్ నుంచి మస్కట్ వెళ్లింది. నెల్లూరుకు చెందిన ముజీబ్ అనే ఏజెంట్ ద్వారా ఆమె అక్కడకు వెళ్లారు. అయితే అక్కడ సరైన వసతులు లేకపోవడంతో ఆమె అనారోగ్యానికి గురయ్యారు. విషయాన్ని ఆమె తన భర్తకు తెలియజేసింది. దీంతో ఆయన ఇటీవల బాపట్ల ఎస్పీని కలిసి తమ పరిస్థితి వివరించడంతో ఎస్పీ సందించారు. నెల్లూరిని ఏజెంట్‌ను పిలిపించి ఆమెను సురక్షితంగా ఇక్కడికి రప్పించారు. ఎవరైనా విదేశాలకు వెళ్లే సమయంలో ఏజెంట్ల మాటలు నమ్మి మోసపోవద్దని ఎస్సై సూచించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మార్టూరు, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం మార్టూరు మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 10:30 గంటలకు మార్టూరులోని కమ్యూనిటీహెల్త్ సెంటరులో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొంటారు. తరువాత ఏలూరి క్యాంపు కార్యాలయంలో 180 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తారు. అనంతరం మధ్యాహ్నం వలపర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద స్మార్ట్ న్యూ రైస్ కార్డులను ప్రజలకు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


విద్యార్థులతో ఎంఈవో, ఉపాధ్యాయులు

బల్లికురవ, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వారధి కార్యక్రమంలో మండల స్థాయిలో విద్యార్థులకు డిబేట్, వ్యాసరచన పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో-1 శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యతను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో మెదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పంపుతామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 రమేష్, ప్రధానోపాధ్యాయులు హనుమంతురావు, జాన్, కేజీబీవీ ఉపాధ్యాయురాలు శ్రీదేవి పాల్గొన్నారు.

ఏల్చూరులో యూరియా పంపిణీ


యూరియా పంపిణీ చేస్తున్న ఏవో సైదా, ఎస్ఐ పట్టాభి రామయ్య

సంతమాగులూరు సెప్టెంబరు 16 (ఆంధ్ర జ్యోతి) మండలంలోని ఏల్చూరులోని రైతుసేవా కేంద్రం వద్ద యూరియా అందుబాటులోనికి వచ్చిందని సంతమాగులూరు ఏవో షేక్ సైదా తెలిపారు, మంగళవారం గ్రామ టీడీపీ నాయకులు దుద్దుల గాలియా అధ్యక్షతన స్థానిక ఎస్సై పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో రైతులకు 28 మెట్రిక్ టన్నులు యూరియా ను పంపిణీ చేశారు. పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులకు రెండుబస్తాలు కాడికి అందజేశారు ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఎరువుల విషయంలో అన్నదాతలు ఎవరు ఆందోళన చెందవద్దన్నారు, కార్యక్రమంలో సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

పోటీలతో విద్యార్థులలో ఆత్మస్థైర్యం

- వేటపాలెం బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం సరోజిని


ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పోటీల్లో పాల్గొనడం వలన విద్యార్థులకు ఆత్మస్థైర్యం మెరుగు పడుతుందని ప్రధానోపధ్యాయురాలు దేవరకొండ సరోజని అన్నారు. మంగళవారం వేటపాలెం బాలికోన్నత పాఠశాలలో టాటా కన్సల్టెన్సీ సర్వీస్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్వీయ ఆధారిత భారతదేశ నిర్మాణం అను అంశంపై జరిగిన పోటీలు జూనియర్స్, సీనియర్స్ విభాగంలో జరగగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమశేఖర్, అంజమ్మ, ఉమ్మిటి వేణుగోపాలరావు, సుబ్బారావు, పోతురాజు, బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో పంటలలో అధిక దిగుబడి


డ్రోన్‌తో పిచికారీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

బల్లికురవ, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు నానో యూరియాను వినియోగించి అధిక దిగుబడిని సాధించాలని, వ్యవసాయశాఖ మార్టూరు ఏడీఏ సుదర్శనరాజు పేర్కొన్నారు. మంగళవారం గుంటుపల్లి, బల్లికురవ గ్రామాలలో పోలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పంటలకు సరిపడ యూరియా అందుబాటులో ఉందన్నారు. కొందరు యూరియా దొరకడం లేదని ప్రచారం చేస్తున్నారని అలాంటి వారి మాటలు రైతులు నమ్మ వద్దన్నారు. నానో యూరియా ద్వారా రైతులకు పలు ప్రయోజనాలు ఉన్నాయన్నారు రైతులు అందరు నానో యూరియాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం నానో యూరియా వాడకంపై డ్రోన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు. ఏఈవో మౌలాలి పాల్గొన్నారు.

ఆధునిక సాగుపద్ధతులు పాటించండి : ఏవో

పంగులూరు,సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులు పంటసాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించాలని, ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని రేణంగివరం, కశ్యాపురం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మాట్లాడుతూ పురుగుమందులను తక్కువగా వినియోగించాలన్నారు. ప్రతిరైతు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. 2025-26 సంవత్సరానికి బర్లీసాగును ప్రభుత్వం నిషేధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ధూళిపాళ్ల నారాయణస్వామి, కోటేశ్వరరావు, వ్యవసాయసహాయకుడు సాయికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

మేలైనా యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ఈపూరుపాలెం(చీరాల), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో నిర్మలాదేవీ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా, మంగళవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం, విజయనగర్ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగుకు ముందు ఎకరాకు నాలుగు టన్నుల పశువుల ఎరువు, 30 కేజీల యూరియా, 150 కిలోల పొటాష్ చల్లి పొలంకు బలం చేకూరేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో బిటి జ్యోతి, వీఏఏ జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

పంగులూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన పంగులూరులో విశ్వకర్మజయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంగులూరు పీహెచ్‌సీలో రోగులకు మంగళవారం పండ్లు పంపిణీ చేశారు. సంఘనేత ఓంకారశర్మ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బత్తులవీరనారాయణ, శివచెన్నయ్య,మిడిదొడ్డిసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో రిమాండ్

బల్లికురవ, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరం నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జరిగిన ఘర్షణపై నమోదైన కేసులో ముద్దాయి ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన జాగర్లమూడి వీరాంజనేయులను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వై.నాగరాజు తెలిపారు. కేసులో నిందితుడుగా ఉన్న వీరాంజనేయులను అద్దంకి కోర్టుకు హజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల పాటు రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

గొర్రెల అపహరణ

అద్దంకి,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): దొడ్డిలోని గొర్రెలు అపహరణకు గురైన ఘటన పట్టణంలోని కాకానిపాలెంలో చోటుచేసుకోగా, స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. కాకానిపాలేనికి చెందిన పాపనబోయిన శ్రీనివాసరావుకు చెందిన 8 గొర్రెలు సోమవారం రా త్రి అపహరణకు గురయ్యాయి. మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్థులపై వివక్ష తగదు


అవగాహన కార్యక్రమంలో నిర్వాహకులు, విద్యార్థులు

వాడరేవు(చీరాల), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్థులపై వివక్ష చూపరాదని, వారిపట్ల ప్రేమగా వ్యవహరించాలని మహిళ మండలి ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని వాడరేవు ఉన్నత పాఠశాలలో ఈసీ ఇంటెన్సిఫైడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఐవీ వ్యాధి వ్యాప్తి, నియంత్రణపై అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి దేశ ప్రగతికి బాటలుగా మారాలని సూచించారు. కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ వెంకటరావు, ప్రధానోపాధ్యాయురాలు రత్నకుమారి, ప్రతినిధులు జ్యోతి, దానమ్మ, సంధ్యారాణి, శిరీష రాణి, శ్రీగీత, దివ్యభాను, విజయ్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.


గ్రామాలలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మార్టూరు, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో స్మార్ట్‌కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమయ్యింది. మంగళవారం మార్టూరులో నేతాజీనగర్, రామ్‌నగర్, ముస్లిం ఏరియా, విజయనగర్ కాలనీ, విద్యానగర్, అంబేద్కర్ కాలనీ, ఎస్‌టి కాలనీ,మద్దిసీతాదేవి కాలనీ,ఇంకా పలు కాలనీలలో స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. మార్టూరులో పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ రజాక్, కామినేని జనార్దన్, కమ్మ శివనాగేశ్వరరావు, తొండెపు ఆదినారాయణ, కాకోలు వెంకటేశ్వర్లు, గొట్టిపాటి వెంకట్రావు, మందపాటి అంజయ్య, గొట్టిపాటి అంజయ్య, పలువురు సచివాలయ సిబ్బంది, రేషను డీలర్లు తదితరులు పాల్గొన్నారు అదేవిధంగా మండలంలోని నాగరాజుపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ, టీడీపీ నాయకులు మిన్నెకంటి రవికుమార్ తదితరుల ఆద్వర్యంలో కార్డులు పంపిణీ చేశారు. జొన్నతాళి గ్రామంలో టీడీపీ నాయకులు శానంపూడి చైతన్య, గ్రామ సచివాయసిబ్బంది, రేషను డీలర్లు కార్డుల పంపిణీలో పాల్గొన్నారు.

మండలానికి 14,874 స్మార్ట్ రైస్‌కార్డులు

పంగులూరు : జె.పంగులూరు మండలానికి 14,874 కూఆర్‌కోడ్ స్మార్ట్ రేషన్‌కార్డులు మంజూరైనట్లు తహసీల్దార్ సింగారావు తెలిపారు. 21 గ్రామ పంచాయితీలలోని 34 రేషన్‌షాపులలోని లబ్దిదారులకు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ద్వారా రైస్‌కార్డులను అందజేయనున్నట్లు తెలిపారు.


ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
బుధవారం 17, సెప్టెంబరు 2025




గ్రామైక్య సంఘంలో అవినీతి బాగోతం!

- వీవోఏ చేతివాటం.. సభ్యుల గగ్గోలు
- వలేటివారిపాలెంలో వెలుగులోకి..
- కందుకూరు ఎమ్మెల్యే వద్ద పంచాయితీ, పూర్తిస్థాయి విచారణకు ఆదేశం
- ప్రాథమిక విచారణలో రూ.10 లక్షలపైనే అవినీతి జరిగినట్టు సమాచారం


8లో..



సంగం బ్యారేజీ వద్ద...



సోమశిల జలాశయం నుంచి దిగువన పెన్నా నదిలోకి పరవళ్లు తొక్కుతున్న వరద



నెల్లూరు బ్యారేజీ వద్ద...

పెన్నమ్మ పరవళ్లు!


- 'సోమశిల'లో ఇప్పటికే 2 గేట్లు ఎత్తి నీటి విడుదల
- నదిలో ప్రవహిస్తున్న వరద
- రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తత
- తీర ప్రాంతవాసులకు హెచ్చరికలు జారీ

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి వస్తున్న కృష్ణా జలాలు, వరదతో పెన్నమ్మ పరవళ్లు తొక్కుతోంది. నిండుకుండలా ఉన్న సోమశిల జలాశయం నుంచి ఇప్పటికే రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంకు వచ్చే ప్రవాహం 20వేల నుంచి 30 వేల క్యూసెక్కులకు పెరుగుతూ.. తగ్గుతూ కొనసాగుతోంది. ఈ క్రమంలో కడప, కర్నూలు, అనంతపురంతోపాటు తూర్పుకనుమలు, వెలుగొండ అడవుల్లో వర్షం కురిస్తే ప్రవాహం భారీగా ఉండవచ్చని ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు. ఇక శ్రీశైలంకు ఎగువ జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి కూడా భారీ వరద కొనసాగుతోంది. పోతిరెడ్డిపాడు హెడ్ నుంచి రాయలసీమ జిల్లాల మీదుగా సోమశిలకు నీరు ప్రవాహం వస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలు, శ్రీశైలం జలాలతో రాయలసీమలో ఇప్పటికే అక్కడ అవసరాల మేరకు నీటి లభ్యత చేకూరింది. ఇక వరద నేరుగా సోమశిల డ్యాంకు రానుండగా ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. ఈమేరకు కలెక్టర్ ఆదేశాలతో పెన్నాతీర గ్రామాల ప్రజలను నదిలోకి వెళ్లకుండా రెవెన్యూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పశువులు మేతకు పంపవద్దని, అలాగే ఇసుక ట్రాక్టర్లు నదిలో వెళ్లకుండా జాగ్రత్త చర్య లు తీసుకొన్నారు. కాగా, ప్రస్తుతం డ్యాంకు

- మిగతా 7లో..

హాహాకార్..
కోవూరు : పోతిరెడ్డిపాలెం సమీపంలో తహసీల్దారు సుబ్బయ్య పర్యవేక్షణ





తెల్లవారే వరకూ రిస్క్యూ ఆపరేషన్!

- పెన్నాలో చిక్కుకున్న 17 మందిలో 9 మంది ఒడ్డుకు..
- మిగిలిన 8 మంది గమ్యస్థానాలకు చేరి ఉంటారని అంచనా
- రాత్రంతా పెన్నాలోనే గడిపిన అధికారులు, పోలీసులు

8లో..

అరెరె.. బుచ్చిరెడ్డిపాలెం : మినగల్లు రీచ్‌లో వరదలో కూరుకుపోయిన ట్రాక్టర్



పేదల ఇళ్ల మాటున గతంలో జరిగిందే పెద్ద మాయ అనుకుంటే.. ఇప్పుడు అంతకుమించి పరిస్థితులు మారిపోతున్నాయి. అక్రమాలను నిగ్గు తేల్చే క్రమంలో హౌసింగ్ శాఖ అనుసరిస్తున్న తీరు అనేక అనుమానాలు, విమర్శలకు తావిస్తోంది. విజిలెన్స్ విభాగం జరిపిన విచారణలో జిల్లాలో రూ.110 కోట్ల వరకూ ప్రజాధనం దుర్వినియోగమైనట్లు తేల్చింది. అయితే హౌసింగ్ శాఖ సొంతంగా చేసిన విచారణలో కేవలం రూ.16 కోట్లు మాత్రమే అవినీతి జరిగినట్లు సమాచారం. ఈ రెండు శాఖల విచారణ మధ్య సుమారు రూ.వంద కోట్ల తేడా కనిపిస్తోంది. మరి ఆ సొమ్మంతా ఎక్కడికి పోయింది!? నిజంగా ఖర్చు చేసి ఉంటే ఆ మేరకు ఎందుకు ఇళ్లు పూర్తి కాలేదు? ఒకవేళ ఇళ్లకే ఖర్చు చేసి ఉంటే విజిలెన్స్ అధికారులు తప్పుడు నివేదికలు ఇచ్చారా!? లేదా హౌసింగ్ అధికారులే తప్పించుకునేందుకు అవినీతిని కప్పిపుచ్చుతున్నారా!? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

తేలనంటున్న

'హౌసింగ్'లో పక్కదారి పడుతున్న విచారణ?

'గూడు' పురాణి!

గత వైసీపీ హయాంలో జిల్లాలో 82,422 ఇళ్లను మంజూరు చేశారు. ఇందులో లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకున్న ఇళ్లతోపాటు పేదల లేఅవుట్లలో ఆప్షన్-3 ఇళ్లు కూడా ఉన్నాయి. చాలా లేఅవుట్లలో పేదలకు తెలియకుండానే వారి ఇళ్లను కాంట్రాక్టర్లకు అప్పగించారు. కొన్ని ఇళ్లు అసలు నిర్మించకుండా బిల్లులు తినేయగా, మరికొన్ని ఇళ్లను తూతూమంత్రంగా కట్టి పేదల సొమ్మును కాంట్రాక్టర్లు దిగమింగారు. నాడు హౌసింగ్ అధికారులు కూడా సహకరించినట్టు సమాచారం. అధికారుల లెక్కల ప్రకారం 26,707 ఇళ్లను పూర్తి చేయగా, అందులో 80శాతం ఇళ్లలో నివాసం ఉండడం లేదని అంచనా. ఈ అక్రమాలపై ప్రస్తుత ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. కొన్ని నెలల పాటు హౌసింగ్ అధికారులు జిల్లాలోని అన్ని లేఅవుట్లు, ఇళ్లను నేరుగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. సుమారు రూ.110 కోట్లు లెక్కకు మించి కాంట్రాక్టర్లకు చెల్లించారని గుర్తించారు. ఇందుకు బాధ్యులుగా ఏకంగా 365 మంది అధికారులను చేర్చారు. వారిలో హౌసింగ్ శాఖకు చెందిన పీడీ నుంచి ఏఈ స్థాయి వరకూ 71 మంది, సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు. ఒకరకంగా అప్పట్లో జిల్లాలో పనిచేసిన హౌసింగ్ అధికారులందరికీ ఈ కుంభకోణంలో పాత్ర ఉన్నట్లు విజిలెన్స్ విచారణ స్పష్టం చేస్తోంది.

● హౌసింగ్ విచారణలో రూ.16 కోట్లు

విజిలెన్స్ నివేదికను ప్రభుత్వం హౌసింగ్ శాఖకు పంపింది. కానీ ఈ నివేదిక ఆధారంగా ఎటువంటి చర్యలు హౌసింగ్ శాఖ చేపట్టలేదు. దీనిని బుట్టదాఖలు చేస్తూ సొంతంగా మరోసారి విచారించాలని నిర్ణయించి అందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఆప్షన్-3 ద్వారా జిల్లాలో నిర్మించిన ఇళ్ల పురోగతి వివరాలను ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయించేలా కింది స్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఆప్షన్-3 కింద కేటాయించి వివిధ దశల్లో ఉన్న 28,826 ఇళ్లను హౌసింగ్ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. నిర్మాణం ఏ దశలో ఉంది? సిమెంటు, స్టీలు, డబ్బులు ఎంత తీసుకున్నారు..? వంటి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ఈ విచారణ లెక్కల ప్రకారం జిల్లాలో సుమారు 6500 ఇళ్లకు సంబంధించి తేడాలున్నట్లు తేల్చారు. ఆ విలువ సుమారు రూ.16 కోట్లు ఉంటుందని లెక్కగట్టినట్లు సమాచారం. ఈ లెక్కలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. విజిలెన్స్ విచారణతో పోలిస్తే భారీగా వ్యత్యాసం ఉండటం గమనార్హం. నాడు విజిలెన్స్ అధికారులు అభియోగం మోపిన ప్రతి అధికారి, ఉద్యోగికి వారు చేసిన తప్పులను లెక్కలతో సహా చూపిస్తూ నోటీసులు ఇచ్చారు. అటువంటప్పుడు ఇంత తేడా ఎందుకు వచ్చిందన్నది అనుమానంగా మారింది. కాగా ఈ అంశంపై జిల్లా హౌసింగ్ అధికారులను సంప్రదించగా, ప్రత్యేక యాప్ ద్వారా విచారణ జరిపిన మాట వాస్తవమేనని, కానీ ఎంత మేర అవకతవకలు తేలాయన్న విషయం మాత్రం తమకు తెలియదని సమాధానమిచ్చారు.

> 'విజిలెన్స్'లో తేలిన అవినీతి రూ.110 కోట్లు
>
> తాజాగా హౌసింగ్ విచారణలో తేలింది రూ.16 కోట్లు
>
> ఇంత తేడా ఎలా వచ్చిందో!?
>
> విజిలెన్స్ నివేదికను బుట్టదాఖలు చేస్తున్న హౌసింగ్ శాఖ

ఇంజనీరింగ్ శాఖల్లో అంతా ఇన్‌చార్జులే..! కానరాని పర్యవేక్షణ ● అభివృద్ధి పనుల్లో కొరవడుతున్న నాణ్యత 8లో..



ముగిసిన కలెక్టర్ల సదస్సు

● రెండో రోజు పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి కలెక్టర్ల సదస్సు మంగళవారం ముగిసింది. సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రెండో రోజు కలెక్టర్ హిమాన్షు శుక్లాతోపాటు ఎస్పీ అజిత వేజండ్ల కూడా పాల్గొన్నారు. వివిధ శాఖలపై సమీక్ష జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. వాటికి అనుగుణంగా జిల్లాల్లో పనితీరు కనిపించాలని ముఖ్యమంత్రితోపాటు రాష్ట్ర ఉన్నతాధికారులు కలెక్టర్, ఎస్పీలకు దిశానిర్దేశం చేశారు. బుధవారం నుంచి కలెక్టర్, ఎస్పీలు జిల్లాలో అందుబాటులో ఉండనున్నారు.

అతివల ఆరోగ్యంపై ఫోకస్

- నేటి నుంచి ప్రత్యేక స్క్రీనింగ్
- స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ పేరుతో పరీక్షలు
- గుండె, క్యాన్సర్ వ్యాధులకు సైతం ఉచిత చికిత్సలు
- అక్టోబరు 2 వరకు నిర్వహణ

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రత్యేక కార్యక్రమా నికి శ్రీకారం చుట్టాయి. మహిళ-శక్తివంతమైన కుటుంబం(స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్) పేరుతో బుధవారం నుంచి దీనిని అమలు చేయనున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ అన్నీ రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, చికిత్స చేసేలా కార్యాచరణ రూపొందించాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ శిబిరాల ద్వారా స్క్రీనింగ్ జరగనుంది.

● 591 ప్రభుత్వ ఆసుపత్రుల ఎంపిక

మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా స్క్రీనింగ్ నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 591 ప్రభుత్వ ఆసుపత్రులను ఎంపిక చేశారు. మొదటి రోజు 117 ఆసుపత్రుల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆ తర్వాత ప్రతీ రోజు 60 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయను న్నారు. ఎక్కడెక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారో ముందుగా మహిళలకు తెలిసే విధంగా గ్రామాల్లో టాంటాం వేస్తారు. వైద్య ఆరోగ్యశాఖతోపాటు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్, పంచాయతీరాజ్, స్త్రీశిశు సంక్షేమ శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



పరీక్షలు.. చికిత్సలు ఇలా..

- మహిళలకు గుండె జబ్బులు, మధుమేహం, రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.
- మహిళలు, కిశోర బాలికలలో రక్తహీనత గుర్తించి తగిన చికిత్సలు అందిస్తారు.
- గర్భవతులకు పౌష్టికాహారం, ఆరోగ్యంపై కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.
- పిల్లలు, గర్భిణుల్లో అవసరమైన వారికి వ్యాధినిరోధక టీకాలు వేస్తారు.
- యుక్త వయసు బాలికలకు బహిష్టు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు.
- రక్తదాన శిబిరాలు కూడా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

సద్వినియోగం చేసుకోవాలి

స్క్రీనింగ్ శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకుని వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఈ శిబిరాల్లో పలు రకాల వ్యాధులకు చెందిన వైద్య నిపుణులు కూడా పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారు. నెల్లూరులో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	150
స్కిన్ చికెన్	264
స్కిన్‌లెస్	290

కోడిగుడ్ల ధర (100): 560

డ్రైనేజీ కాలువల మరమ్మతులు చేపట్టండి

కావలి(టౌన్), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనేక ప్రాంతాల్లో కాలం చెల్లిన పాత డ్రైనేజీ కాలువల మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నేతలు మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ను కోరారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పీ.పెంచలయ్య మాట్లాడుతూ శాంతినగర్, కచ్చేరిమిట్ట, బీకే నగర్, తుఫాన్‌నగర్, ఇందిరానగర్ ముసునూరు తదితర ప్రాంతాల్లో కాలువలు పగిలిపోయి మురుగు రోడ్లపై ప్రవహిస్తుందని, దీంతో వీధులు దుర్గంధభరితంగా మారి దోమలకు నిలయాలుగా మారుతున్నాయన్నారు. వర్షాలు పడినప్పుడు ఆ మురుగు నీరు ఇళ్లల్లోకి ప్రవేశించి దుర్భరంగా మారుతుందన్నారు. అధికారులు స్పందించి వెంటనే సైడ్ కాలువల నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నేతలు కృష్ణమోహన్, తిరుపాల్, ప్రవీణ్, వై ఉదయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రైతు ఆత్మహత్యపై ఆర్డీవో విచారణ

బిట్రగుంట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం తాళ్లూరు పంచాయతీ దళితవాడకు చెందిన ఏసుపోగు మెలకయ్య అనే రైతు ఏప్రిల్ నెలలో అప్పులబాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయమై కావలి ఆర్డీవో సన్నీవంశీకృష్ణ మంగళవారం గ్రామంలో విచారణ చేపట్టారు. రైతు మెలకయ్య కుటుంబ ఆర్థిక పరిస్థితి, అప్పుల వివరాలను కుటుంబ సభ్యులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి, వ్యవసాయశాఖ ఏడీ నాగరాజు, ఏవో శైలజ, ఏఎస్‌ఐ కోటేశ్వరరావు, స్థానిక టీడీపీ నేత ఎల్.మాధవరావు, తదితరులు ఉన్నారు.

మెగా వైద్యం శిబిరం

బిట్రగుంట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ది పూర్ పీపుల్స్ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ చేవూరు చిన్న ఆధ్వర్యంలో మంగళవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి క్యాన్సర్ విభాగం వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణులు జేవీపీఎన్ ధీరజ్, వై.సుదర్శన్‌రెడ్డి, సాహిత్య రెడ్డి, లోకేశ్వరిలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎన్ రెడ్డి, ఏవో ఆర్వీ రమణారెడ్డి, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ డాక్టర్ కే.లక్ష్మీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏ.కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సొసైటీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

వలేటివారిపాలెం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం సొసైటీ కార్యాలయంలో బుధవారం సొసైటీ అధ్యక్షుడుగా గుత్తా మహేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సెక్రటరీ నవీన్ తెలిపారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరుకానున్నట్లు తెలిపారు.

నేటి నుంచి 'స్వస్థ్ నారీ సశక్తి పరివార్'

ఉలవపాడు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు కరేడు ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం కరేడు పీహెచ్‌సీలో వైద్యఆరోగ్య సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. 17న ఆత్మకూరు, 18న అలగాయపాలెం, 19న కొల్లూరుపాడు, 20న మన్నేటికోట, 22న కే రాజుపాలెం, 26న రామకృష్ణాపురం, 29న ఉలవపాడు వడ్డెరపాలెంలో మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

జేఎల్‌ఏ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా గోపిచంద్ ప్రకాష్

ఉలవపాడు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉలవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న గారపాటి గోపీచంద్ ప్రకాష్‌ను జోన్-3 నుంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

టీకాల కార్యక్రమం పరిశీలన

కందుకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన గాలికుంటు వ్యాధి నివారణ ఉచిత టీకాల కార్యక్రమాన్ని పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టరు జీ.చక్రధరరావు, కందుకూరు ఏడీ జె.చంద్రమోహన్‌లు మంగళవారం మాచవరం గ్రామంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టరు ఎస్.సుధాకర్, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, గ్రామరైతులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : పోకూరులో గేదెలు, ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాల కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు సోమినేని తిరుమలరావు ప్రారంభించారు. పశువైద్యాధికారి సుదర్శన్ సుధాకర్, సిబ్బంది అశోక్, చౌడ య్య, చైతన్య, వెంకట రావు, దినేష్, మనోహర్, మహిత, మౌనిక పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కందుకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కందుకూరు ప్రాంతంలో రక్తదాతల వాట్సాప్ గ్రూప్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 17న ఉదయం 10గంటలకు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు సక్షమ్ కార్యవర్గసభ్యుడు చెన్నా రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఓజోన్ పొరపై అవగాహన

కందుకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్‌పొర పరిరక్షణ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ఓజోన్‌పొర ప్రాధాన్యత, అది దెబ్బతినకుండా కాపాడుకునేందుకు మనవంతుగా పాటించాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్, కమల్‌బాబు, ఎన్వీ శ్రీహరి, కేవీ పద్మావతి, ఐ. అనూష, పి.రాజగోపాల్, ఎం.తిరుపతిస్వామి, కె.నరేష్‌రాజా, జి.బ్రహ్మయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రహదారిపై నిలువ నీడేది..?

● రోడ్డు విస్తరణలో చెట్లు, బస్‌షెల్టర్లు కూల్చివేత ● కొత్తవి నిర్మించడంలో అలసత్వం ● ప్రయాణికులు, విద్యార్థుల అవస్థ

కలిగిరి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కావలి-దుత్తలూరు మార్గంలో జాతీయ రహదారిపై బస్సు షెల్టర్లు లేక ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టక ముందు దాదాపు ప్రతీ గ్రామంలో రహదారి వెంబడి షెల్టర్లు ఉండడంతో ప్రయాణికులు వేచి ఉండేందుకు ఎంతో అనుకూలంగా ఉండేది. అయితే జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రెండేళ్ల క్రితం రహదారి పనులు ప్రారంభమైన తరువాత రహదారి వెంబడి గ్రామ ముంగిళ్లలో ఉన్న షెల్టర్లను కూల్చివేశారు. దీంతో అప్పటి నుంచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సు షెల్టర్లతో పాటు రహదారి వెంబడి ఉండే పెద్ద పెద్ద చెట్లను కూడా కూకటి వేళ్లతో పెకిలించి తీసేశారు. దీంతో షెల్టర్లు, చెట్లు కనుమరుగయ్యాయి. రహదారి పనులు దాదాపు పూర్తయినా బస్‌షెల్టర్ల నిర్మాణాలు మాత్రం పూర్తికాకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కలిగిరి పట్టణంలో తహసీల్దారు కార్యాలయ కూడలిలోని బస్‌షెల్టర్ కూల్చివేశారు. ఈ కూడలి నుంచే కావలి, నెల్లూరు, ఉదయగిరి, కొండాపురం ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో పాటు స్థానికంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగులు, వందలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తారు. గతంలో ఈ కూడలి ప్రాంతంలో బస్ షెల్టర్‌తోపాటు పెద్ద పెద్ద చెట్లు ఉండటంతో ప్రయాణాలు చేసేవారికి ఇబ్బందులు లేకుండా ఉండేది. రహదారి విస్తరణ అంటూ ఇళ్లు, చెట్లు, బస్ షెల్టర్లు కూల్చివేసే సరికి ఈ ప్రాంతం ఎడారిగా మారింది. కనీసం నిలబడటానికి కాసింత నీడలేకపోయేసరికి ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు చేసే కాంట్రాక్టర్లు ప్రధాన కూడళ్లలో బస్ షెల్టర్ల నిర్మాణాలను పూర్తిచేసి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.



రహదారిపై మండుటెండలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు



బస్సుల కోసం రోడ్డుపై నిలుచున్న విద్యార్థులు

మండుటెండలో ప్రయాణికుల పడిగాపులు

● **వలేటివారిపాలెం:** వలేటివారిపాలెం బస్టాండు సెంటరులో నిలువ నీడలేక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఎండకు ఎండతూ వానకు తడుస్తూ చెట్లు, కిరాణాషాపులు, హోటళ్లు, దుకాణాల ముందు గంటల తరబడి నీడ కోసం నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. దుకాణాల ముందు నిలబడిన ప్రయాణికులను వ్యాపారులు తమ వ్యాపారాలకు ఆటంకం కలుగుతుందని చీదరించుకుంటున్నారు. లక్షలు వెచ్చించి ఊరి చివరన నిర్మించిన బస్‌స్టేషన్ నిరుపయోగంగా మారింది. మూడు రోడ్ల కూడలిలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా ప్రయాణికులకు సౌకర్యాల కల్పనపై ఆర్టీసీ అధికారులు దృష్టి సారించడంలేదు. బస్టాండులో నీడవసతి, మరుగుదొడ్లు, తాగునీరు తదితర వసతులు కరువే. బస్టాండు సెంటరులో ఆర్టీసీ అధికారులు కనీస సదుపాయాలు కల్పించకపోడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు సైతం లేకపోవడంతో మహిళలు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. అయినప్పటికీ సం బంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా వలేటివారిపాలెం బస్టాండు సెంటరులో బస్‌షెల్టర్, మరుగుదొడ్లు, తాగునీరు తదితర వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



వలేటివారిపాలెంలో మండుటెండలో ప్రయాణికులు

22 నుంచి కలుగోళ్ల శాంభవి శరన్నవరాత్రి ఉత్సవాలు

కావలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కావలి గ్రామదేవత కలుగోళ్ల శాంభవి నవరాత్రి ఉత్సవాలు ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు శరన్నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ముసునూరులోని ఎమ్మెల్యే నివాసంలో ఆలయ ఈవో అరవ రాధాకృష్ణతో కలిసి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేప ట్టాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఆలయ ఈవో రాధాకృష్ణ

రైల్వే అండర్‌పాస్ పనుల పరిశీలన

ముసునూరు రాఘవేంద్రకాలనీ వద్ద జరుగుతున్న రైల్వే అండర్‌పాస్ వంతెన నిర్మాణ పనులను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ అండర్‌పాస్ పూర్తి అయితే ఇందిరమ్మకాలనీ, తుఫాన్‌నగర్ తదితర రైల్వే ట్రాక్‌కు పడమరవైపున ఉన్న ప్రజల రాక పోకలకు మార్గం సుగమం అవుతోందన్నారు. ముసునూరు రైల్వే గేట్ వద్ద పడిగాపులు కాయాలల్సిన పని తప్పుతోందన్నారు.

'ఉపాధి హామీ'లో అవకతవకలపై విచారణ

కొండాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరప్పాడులో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలపై అంబుడ్స్‌మన్ వెంకటరెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి గ్రామంలో లేని వారి పేర్లతోపాటు, ఒకరి జాబ్ కార్డుపై మరొకరితో పనిచేయించి క్షేత్ర సహాయకురాలు భారీ స్థాయిలో అవినీతికి పాల్పడినట్లు గ్రామానికి చెందిన చాగంటి కృష్ణ, మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు జిల్లా అధికారులకు గతంలో ఫిర్యాదు చేశారు. దీంతో ఉపాధి హామీ ఏపీడీ గ్రామంలో జూలై నెలలో విచారణ చేపట్టారు. అందులో భాగంగా మళ్లీ ఉపాధి కూలీలను విచారించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ షేక్ సర్దార్, ఏపీవో మురళీధరరావు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి కూలీలను విచారిస్తున్న అధికారులు

నవధాన్యాలను పచ్చిరొట్ట పైర్లుగా సాగు చేయాలి

● జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి



మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి

అల్లూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నవధాన్యాలను పచ్చిరొట్ట పైర్లుగా సాగుచేసి భూసారాన్ని పెంపొందించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి అన్నారు. మండలంలోని నార్తుమోపూరు రైతు సేవా కేంద్రంలో మంగళవారం రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రైతులు విపరీతంగా రసాయన ఎరువులు వినియోగించడం వలన భూసారం తగ్గిపోవడంతోపాటు అధిక ఖర్చులు భరిస్తున్నారన్నారు. కేవలం అవగాహన లోపంతో ఈ పరిస్థితి ఏర్పడుతోందన్నారు. యూరియా అవసరం కంటే అత్యధిక మోతాదులో వినియోగిస్తున్నారని, తద్వారా పైర్లలో కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయన్నారు. మళ్లీ ఆ సమస్యలకు పురుగు మందులు వినియోగించాల్సి ఉంటుందన్నారు. ఈ కారణాలతో రైతులకు వరిసాగులో ఆర్థిక భారం పడుతుందన్నారు. అవగాహనతో పచ్చిరొట్ట పైర్లను వేయడం ద్వారా అనేక సమస్యలు తగ్గుతాయని, దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు, కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు నర్సోజీరావు, నాగరాజు, డీఆర్సీ వ్యవసాయాధికారి మధురిమ, అల్లూరు వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మోదీ జన్మదిన పక్షోత్సవాలను జయప్రదం చేయండి

కందుకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): భారతప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకుని భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన పక్షోత్సవాలను జయప్రదం చేయాలని ఆపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు, పార్టీ నాయకులు జొన్నాదుల రాఘవయ్య, మన్నేపల్లి వర ప్రసాదరావులు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. 17న ఉదయం 10 గంటలకు స్థానిక అంకమ్మ దేవాలయంలో మోదీకి సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలని, పూజలు, 20న పట్టణంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 22న పేదలపై భారంపడే వివిధరకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించినందుకు నరేంద్రమోదీ, కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు మోదీ అభిమానులు అధికసంఖ్యలో ఈ కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే ఇంటూరి



టీడీపీలో చేరిన చాకిచర్ల వైసీపీ శ్రేణులతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఉలవపాడు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని చాకిచర్ల, పెద్దపట్టుపాలెం గ్రామాల్లో రూ.45 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లుకు శంకుస్థాపన చేశారు. నూతన సచివాలయం భవనం ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అన్ని సమస్యలను తరిష్కరించేందుకు చర్యలు చేపడుతామన్నారు. ఈ సందర్భంగా చాకిచర్లలోని 35 వైసీపీ కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలోకి చేరగా వారికి పసుపు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనపై నమ్మకంతో పెద్దపట్టపుపాలెం ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించారని, మీ అభిమానాన్ని ఎన్నటికి మర్చిపోనన్నారు. ఆయా గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు, గ్రామపార్టీ అధ్యక్షుడు మల్లికార్జున, రమేష్, నాయకులు మిరియం భాస్కర్, సుదర్శి శ్రీనివాసులు, ఎండేటి శ్రీను, సాంబయ్య, ఆవుల వాసు తదితరులు పాల్గొన్నారు.

నవంబరుకి ప్రభుత్వ భూములు గుర్తించాలి : ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో సన్నీవంశీకృష్ణ, హాజరైన సర్వేయర్లు

కావలి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : కావలి డివిజన్‌లోని అన్ని గ్రామాల్లో ఈ ఏడాది నవంబరు చివరి నాటికి ప్రభుత్వ భూములు గుర్తించి వాటికి హద్దులను ఏర్పాటు చేయాలని కావలి ఆర్డీవో ఎం.సన్నీవంశీకృష్ణ ఆదేశించారు. డివిజన్‌లోని సర్వేయర్లతో మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు మండలాల్లో మూడు విడతలుగా జరిగిన రీసర్వేపై సమీక్షించారు. ఈ సమీక్షలో ప్రధానంగా రీసర్వేలో ఎదురైన సమస్యలు వాటిపరిష్కారానికి తీసుకోవాల్సి చర్యలపై చర్చించారు. రీసర్వే రికార్డులు ఎంతవరకు పూర్తి చేసి అప్పగించారనే దానిపై చర్చించారు. అయితే రీసర్వే పూర్తి అయ్యేసరికి ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున ముందుగా డివిజన్‌లోని అన్ని గ్రామాల సరిహద్దులను ఏర్పాటు చేసి ఆయా గ్రామాలలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని సర్వేచేసి సరిహద్దులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రీసర్వే చేసిన గ్రామాల్లో వాటి రికార్డులను ఎంతవరకు పూర్తి చేసారనే దానిపై సమీక్షించారు. భూముల సబ్‌డివిజన్లు, ఓఎస్‌డీ సంబంధించిన అంశాలు, మీసేవల ద్వారా వచ్చిన అర్జీలు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ సర్వేయర్లు శ్రీనివాసరావు. నరసింహమూర్తి, మండల, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

పెన్నమ్మ పరవళ్లు!

(5వ పేజీ తరువాయి)

23,234 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో నీటి నిల్వ 73.450 టీఎంసీలుగా ఉంది. దిగువ డెల్టాకు గేట్ల ద్వారా 14,850, పవర్ టన్నెల్ నుంచి 2,600, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు.

● **సంగంలో 28 వేల క్యూసెక్కులు**

సంగం : పెన్నా బ్యారేజ్ వద్ద మంగళవారం 28 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం నమోదైంది. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.2 అడుగుల చేరింది. బెజవాడ పాపిరెడ్డి కాలువకు 350 క్యూసెక్కులు, కనుపూరు కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మిగతా 27,400 క్యూసెక్కుల నీటిని 26 గేట్ల ఎత్తి దిగువ పెన్నానదికి విడుదల చేస్తున్నట్లు సెక్షన్ ఏఈ వినయ్ కుమార్ తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్ల వద్ద ప్రైవేట్ బస్సులు ఆపకుండా చర్యలు

కావలి(టౌన్), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఆపకుండా చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ డీపీటీవో ఎస్‌కె షమీమ్ తెలిపారు. మంగళవారం కావలి డిపోను ఆమె సందర్శించి తనిఖీలు నిర్వహించారు. అనంతరం విలేకర్లతో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేసినప్పటి నుంచి కావలి డిపో 92శాతం ఆక్సుపెన్సీ సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. మహిళా ప్రయాణికుల శాతం విపరీతంగా పెరిగి ఇబ్బందికరంగా మారినట్లు వాపోతున్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకుపోగా స్త్రీశక్తి పథకం వలన కండక్టర్ల ఉద్యోగం మరింత సులభం అయిందని, 0 టిక్కెట్ వలన ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. కొత్త పథకాలు ప్రవేశపెట్టినప్పుడు కొత్తలో కొంత తడబాటు ఉండడం సహజమేనన్నారు. ఉచితం వల్ల సంస్థకు ఎటువంటి నష్టంలేదని ప్రభుత్వ రీయింబర్స్‌మెంట్ ద్వారా మరింత లాభాలు పెరుగుతాయన్నారు. డిపో పరిసరాల్లో ప్రైవైట్ ట్రావెల్స్ నిలపకుండా చర్యలు తీసుకోవాలని కావలి డీఎంను ఆదేశించారు. కార్యక్రమంలో కావలి డీఎం ఆదినారాయణ, అసిస్టెంట్ మేనేజర్ కల్పన రెడ్డి, ఎఫ్ఎం ఖాజామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్టీసీ డీపీటీవో

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

జలదంకి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు సభ్యులు కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. వ్యవసాయశాఖ అమలు చేస్తున్న పలు పథకాలపై ఏవో శ్రీవాణి వివరించారు. వేములపాడు ఎంపీటీసీ గొర్రెపాటి యలమందారెడ్డి మాట్లాడుతూ ధాన్యం ధరలు ప్రభుత్వ మద్దతు ధర కంటే రూ.3వేలు తక్కువకు దళారులు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాల ఆవశ్యకతను వివరించారు. దీనికి జలదంకి సొసైటీ అధ్యక్షుడు కరియావుల అప్పలనాయుడు స్పందిస్తూ సమా వేశంలో సభ్యులు తీర్మానం ఇస్తే ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ద్వారా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. ఈ సమావేశంలో సోమశిల ప్రాజెక్ట్ వైస్‌చైర్మన్ వీ.మధురెడ్డి, వైస్‌ఎంపీపీ మేకల ధనమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో శ్రీవాణి

డాక్యుమెంట్ పోయినది

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గుడ్లూరు మండలం, పరకొండపాడు గ్రామ కాపురస్థులాలు చీర్ల తిరుపతమ్మ భర్త మాల్యాద్రి అను నాకు సంబంధించిన డాక్యుమెంట్ నెం:825 / 2004 డాక్యుమెంట్ 14-09-2025 తేదిన పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో జెరాక్స్ తీయించుకొను సమయములో పొరపాటున పోయినది. ఎవరికైనా దొరికిన యెడల మాకు తెలియజేయగలరని మనవి.
సెల్:9505792300

అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

కందుకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అర్హులైన కౌలు రైతులకు గుర్తింపుకార్డులు దక్కేలా గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్‌వోలు సమన్వయంతో కృషి చేయాలని తహసీల్దారు లావణ్య, మండల వ్యవసాయాధికారి అబ్దుల్‌రహీంలు కోరారు. మంగళవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో వీఏఏలు, వీఆర్‌వోలతో నిర్వహించిన సమావేశంలో కౌలురైతు గుర్తింపు కార్డులపై పలు సూచనలు చేశారు. వీఏఏలంతా పంటకోత ప్రయోగాలు పూర్తిచేసి నివేదికలు పంపడం ద్వారా రైతులకు క్రాఫ్ ఇన్సూరెన్స్ అందేలా చూడాలని కోరారు.

వేతనాల కోసం పారిశుధ్య కార్మికుల నిరసన

బిట్రగుంట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నెలంతా చెత్తాచెదారం తొలగించే పారిశుధ్య కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వకుంటే బ్రతికేది ఎలాగయ్య అని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బోగోలు మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు మంగళవారం నిరసన చేపట్టారు. పంచాయతీ కార్యాలయం నుంచి బోగోలు బజారు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు పనిముట్లు చేత పట్టి ర్యాలీ నిర్వహించారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు అధికారులట ఫోన్లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పుష్కరిణిలో మండపం పనుల ప్రారంభం

బిట్రగుంట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పుష్కరణిలో మండపం పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. కోనేటిలో పేరుకుపోయిన పూడిక తొలగింపు అనంతరం వీపీఆర్ ట్రస్ట్ అధినేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులచే శంకుస్థాపన చేయించిన కోనేరులో మండపం కాంక్రీట్ పనులు జరుగుతున్నాయి. వీపీఆర్ ట్రస్ట్ ఇంజినీరు కాకు వెంకటస్వామి రెడ్డి, నరసారెడ్డి పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు రావి.రంగయ్య, ఆర్.విజయ్‌కుమార్, కే.బసిరెడ్డి, వై.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



కోనేటి నడుమ చేపట్టిన మండపం పనులు

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

బిట్రగుంట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోవూరుపల్లిలో వెలసి ఉన్న పోలేరమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వనాథరావుపేట పంచాయతీ సర్పంచు గండూరి మంజుల, శ్రీనివాసులు దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి సద్ది, నైవేద్యాలను అర్పించారు. కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి దంపతులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వారివెంట భాస్కర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, మురళీరెడ్డి, ఓబులురెడ్డి, శ్రీధర్, సమీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ చెక్కుల పంపిణీ

బిట్రగుంట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ మద్దూరుపాడు కావలి బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బోగోలు మండలం పాతబిట్రగుంటలో మంగళవారం పాడి రైతులకు 2024-25 సంవత్సరపు బోనస్‌కు సంబంధించిన చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా సంగం డెయిరీ జోనల్ మేనేజర్ డాక్టర్ వినోద్ హాజరై సంగం డెయిరీకి పాలు పోసే పాడిరైతులు 22 మందికి రూ.66,994 అందచేశారు. ఈ కార్యక్రమంలో డెయిరీ అధికారి వెంకయ్య, పాల సేకరణ కేంద్ర కార్యదర్శి లక్ష్మీప్రసన్న, పాడిరైతులు తదితరులు పాల్గొన్నారు.



చీకట్లో జలనిధి..!

జిల్లా జలనిధి సోమశిల జలాశయం వద్ద రాత్రే యితే చీకటి అలముకుంటోంది. ఉన్న దీపాలు వెలగక.. కీలక ప్రాంతాల్లో దీపాలు లేక అంధకారం కమ్ముకుంది. దీంతో ఇక్కడ జలాశయం వుందా? అనే సందేహం వ్యక్తమవుతోంది.. ఇదిలా ఉంటే ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుండగా దిగువకు గేట్లు ఎత్తి నీరు సరఫరా చేస్తున్న పరిస్థితి. ఇలాంటి సమయంలో కూడా ఇంజనీర్లలో చలనం లేదు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నతాధికారులకు నివేదిక అందించి విద్యుద్దీపాలు ఏర్పాటు చేసుకొనే సౌలభ్యం ఉన్నా.. ఆ దిశగా చర్యలు కరువయ్యాయి. వచ్చామా? వెళ్లామా? జీతం తీసుకున్నామా? అనే ధోరణి అధికారుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)



కోవూరు మండల పరిధిలోని గంగవరం గ్రామ పొలిమేరల్లో రైతులు సాగు చేస్తున్న బంతి పూల తోటలు చూపరుల్ని ఆకట్టుకుంటున్నాయి. కోవూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం వెళ్ళే మార్గంలో బంతిపూల సాగును చూసి పలువురు మంత్రముగ్దులవుతున్నారు. చేమంతి సోయగాలు ఆకట్టుకుంటున్నప్పటికీ పూల ధర తగ్గడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)

బంతీ.. పూబంతీ...!

నేడు విశ్వకర్మ జయంతి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ తిక్కన భవన్‌లో నిర్వహిస్తున్నామని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య ఆచారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసిన సుమారు 300 మంది లబ్ధిదారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా పనిముట్లు పంపిణీ చేస్తారని తెలిపారు. టూల్ కిట్లకు దరఖాస్తు చేసి న వారందరూ పాల్గొనాలని కోరారు.

వింజమూరులో లేఅవుట్‌ల పరిశీలన

వింజమూరు, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు లేఅవుట్లను మంగళవారం నుడా అధికారులు పరిశీలించారు. దాదాపు 22 లేఅవు ట్లు ఉండగా వాటిలో రెండింటికి మాత్రమే అనుమతులు ఉన్నట్లు గుర్తించారు. మిగతా వా టికి నుడా అప్రూవల్ లేకపోవడంతో నోటీసు లు జారీ చేశారు. ప్రతి ఒక్కరూ ఎల్‌ఆర్‌ఎస్ స్కీంను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నుడా అధికారులు శ్రీధర్‌చౌదరి, సుష్మాంజలి పాల్గొన్నారు.

రెండోరోజుకు దస్తావేజు లేఖర్ల సమ్మె



మాట్లాడుతున్న దస్తావేజు లేఖరుల సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో లోపాలు సరిచేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా దస్తావేజుల సంక్షేమ సంఘం నాయకులు, దస్తావేజు లేఖరులు మంగళవారం రెండోరోజు కూడా పెన్‌డౌన్ సమ్మె చేశారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు జనాల్లేక బోసిపోయాయి. రిజిస్ట్రేషన్‌శాఖ ఆదాయానికి గండి పడింది. నగరంలోని ప్రధాన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జిల్లా దస్తావేజుల సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు మాట్లాడుతూ దస్తావేజుల రిజిస్ట్రేషన్ల సమయంలో ఆధార్‌కార్డు, ఓటీపీ, ఆటో మ్యూటేషన్ వల్ల ప్రజలు, డాక్యుమెంటు రైటర్లు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిటీ దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు జేవీబీ అశోక్, నాయకులు పంచాగ్నుల పవన్‌కుమార్, ములుమూడి సురేష్‌బాబు, ఎండీ జమీరుద్దీన్, పూనం మాలకొండయ్య, ఎండీ మజహరుద్దీన్, కలిశెట్టి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లిస్తేగానీ.. పనులు సాగనివ్వం!



రోడ్డు నిర్వాహకులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

కలిగిరి, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): కావలి-దుత్తలూరు జాతీయ రహదారి 167బీజీ విస్తరణలో భాగంగా కలిగిరి-వింజమూరు మార్గంలో తమ భూములకు పరిహారం చెల్లించేవరకు పనులు సాగనివ్వమని పలువురు రైతులు మంగళవారం రహదారి పనులను అడ్డుకున్నారు. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం తమ భూములకు సెంటు ఒక్కింటికి రూ.4,76,000/- చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.35,600 మాత్రమే పరిహారం చెల్లించడంపై అభ్యంతరాలను జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లామన్నారు. రోడ్డు పనులు చేసే వారు తమ భూముల్లో ఇష్టానుసారం మట్టి తోలడం, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం వంటి పనులు చేయడంపై వారు అభ్యంతరాలు తెలిపారు. తమకు పరిహారం అందించిన తరువాత మాత్రమే తమ భూముల్లో పనులు చేసుకోవాలని కరాఖండిగా తేల్చి చెప్పారు. ఈ విషయమై రోడ్డు నిర్వాహకులు బుధవారం తహసీల్దారు, ఆర్డీవోల సమక్షంలో రహదారి వెంబడి ప్రభుత్వ భూములను సర్వే చేయించి, నిర్మాణ పనులు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

పేద, బలహీన వర్గాల ఉన్నతికి పీ4 దోహదపడుతుంది

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : పేద, బలహీన, అల్పాదాయ వర్గాలను ఉన్నతిలోకి తీసుకుని రావడానికి పీ-4 విధానం దోహదపడుతుందని డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్ స్టాటిస్టిక్స్ డిప్యూటీ డైరెక్టర్ పీ శ్రీనివాస్ అన్నారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రం లో మంగళవారం చీఫ్ ప్లానింగ్ కార్యాలయం ఆధ్వర్యంలో గ్రామవార్డు సచివాలయ సిబ్బందికి పీ-4 కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పీ-4లో ఆర్థిక, ఆర్థికేతర అంశాల ద్వారా వెనుకబడిన వర్గాలను ప్రోత్సాహించి వారిని ఉన్నత స్థితికి తీసుకొస్తారని చెప్పారు. బంగారు కుటుంబాలను, మార్గదర్శులతో ఏవిధంగా లింకప్ చేస్తారో శిక్షణలో తెలియచేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి సురేష్ కుమార్ పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

తెల్లవారే వరకూ పెన్నాలో రిస్క్యూ ఆపరేషన్!

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెన్నా నదిలో చిక్కుకున్న వారిని క్షేమంగా బయటకు తీసుకు వచ్చేందుకు జిల్లా అధికార యంత్రాంగం, పోలీసులు, అగ్నిమాపక దళం రాత్రి నుంచి తెల్లవారేవరకు శ్రమించారు. వరదలో చిక్కుకుపోయిన 17 మందిలో 9 మందిని ఒడ్డుకు చేర్చగా, మిగిలిన 8 మంది క్షేమంగా ఇళ్లకు చేరి ఉంటారని పోలీసులు అంచనా వేస్తున్నారు. సోమవారం సాయంత్రం పేకాట ఆడేందుకు, మద్యం సేవించేందుకు నగర శివార్లలోని భగత్‌సింగ్ కాలనీ సమీపంలోని పెన్నా నదిలోని ఇసుక దిబ్బలోకి వెళ్లారు. అయితే, పెన్నా బ్యారేజీలో గేట్లు తెరవడంతో ఒక్కసారిగా నీరు ఉప్పొంగాయి. దీంతో 17 మంది మందుబాబులు, పేకాట రాయుళ్లు నీటిలో ఇరుక్కుపోయారు.

● 112కు సమాచారం

నీటిలో చిక్కుకుపోయిన వారు రాత్రి 8.50 గంటలకు 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. నవాబుపేట ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి అగ్నిమాపక దళానికి సమాచారం అందించారు. భగత్‌సింగ్ కాలనీకి సమీపంలో ఉన్న హైవే కింద 17 మంది నీటిలో చిక్కుకున్నారని, త్వరగా రావాలని కోరారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి సిబ్బందిని వెంటబెట్టుకుని ఘటనాస్థలికి చేరుకున్నారు. బ్రిడ్జిపై నుంచి 35 అడుగుల నిచ్చెనను నదిలోకి దించి రోప్‌ల సాయంతో ఆస్కా లైట్‌ను నదిలోకి దింపారు. అనంతరం సీఐ సహకారంతో 9మందిని గుర్తించి, వెలుపలకు తీసుకువచ్చారు. మిగిలినవారు క్షేమంగానే బయటకి వచ్చి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

● మంత్రి, అధికారుల పర్యవేక్షణ

సమాచారం అందుకున్న మంత్రి నారాయణ జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. ఆర్డీవో అనూష, కమిషనర్ నందన్, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసులరెడ్డి, డీఎస్పీలు, స్పెషల్‌పార్టీ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు పెన్నా వద్దకు చేరుకున్నారు. తెల్లవారుజామున 4.15 గంటల వరకు అక్కడే ఉండి పర్యవేక్షించారు.

ఎస్‌ఐ ఇంటిముందు మహిళ ఆందోళన

కావలి రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ముసునూరులోని పల్నాడు జిల్లా మాచర్ల ఎస్‌ఐ వెంకట్రావ్ బంధువు ఇంటి ముందు మంగళవారం రాత్రి ఓ మహిళ పెట్రోల్ బాటిల్‌తో వెళ్లి ఆందోళన వ్యక్తం చేసింది. గతంలో కావలి 1వ పట్టణ ఎస్‌ఐగా పని చేస్తున్న సమయంలో స్థానిక వివేకానందపార్కు ప్రాంతానికి చెందిన మహిళను పెళ్లి చేసుకుంటానని మోసగించాడని మే 11న ఆ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐపై కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే, వెంకట్రావు తనను పట్టించుకోవడం లేదంటూ సదరు మహిళ మంగళవారం రాత్రి ఎస్‌ఐ అత్తగారింటి ముందుకు చేరుకోవటంతో విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని ఆమెకు సర్ది చెప్పి పంపించారు.

భద్రతపై చర్యలేవీ..?

- ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగికి కానరాని భద్రత
- ప్రభుత్వ వైద్యశాలల్లో కూడా ఇలాంటివి ఎన్నో..
- ఆరోగ్యశ్రీ మాటున కొందరి పేషెంట్ల వద్ద వసూళ్లు
- నేడు ప్రపంచ రోగి భద్రత దినోత్సవం

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రులకు వచ్చే రోగులకు సరైన వైద్యం అందించి, రోగి ఆరోగ్య భద్రతపై అప్రమత్తంగా ఉండాలి. అయితే కొన్ని ఆసుపత్రుల్లో రోగుల ఆరోగ్య భద్రత డొల్లగా మారింది. ఈ నేపధ్యంలో రోగి భద్రతపై అనేక సందేహాలు లేకపోలేదు. రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకోవటంలో వైద్యులు పూర్తి స్థాయి వైద్య చికిత్సలు అందించలేదన్న విమర్శలు ఉన్నాయి.ఈ నేపధ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సెప్టెంబరు 17న (నేడు) ప్రపంచ రోగి భద్రత దినోత్సవాన్ని జరుపుకోవాలని తీర్మానించింది.

● నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉన్నా భద్రతేదీ?

జిల్లావ్యాప్తంగా నెల్లూరు జీజీహెచ్‌తోపాటు ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, 10 సీహెచ్‌సీలు, 52 పీహెచ్‌సీలు, 28 యూపీహెచ్‌సీలు ఉన్నాయి. ప్రభుత్వపరంగా ఇంతటి నెట్‌వర్క్ ఉన్నా ఆయా ఆసుపత్రుల్లో ఆశించిన స్థాయిలో రోగుల ఆరోగ్య భద్రత లేదు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉంది. ప్రతిరోజూ ఇక్కడ 550 మంది వరకు రోగులు ఇన్‌పేషెంట్‌లుగా చికిత్స పొందుతుంటారు. ఇందులో గర్భిణులకు అవసరమైన వైద్య సేవలు అందుతున్నాయి. అయితే మిగిలిన రోగుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఇక్కడ అత్యవసర రోగులకు ఐసీయూలో 36 వరకు పడకలు ఉండగా, రోగుల ఆరోగ్య చికిత్సలు అంతంత మాత్రంగానూ ఉన్నారు. రోడ్డు ప్రమాదం జరిగితే అత్యవసరంగా ముందుగా జీజీహెచ్‌కి పంపిస్తుంటారు. అయితే ఇక్కడ ఇద్దరు న్యూరాలజిస్టులు ఉన్నా ప్రయోజనం లేక పోవటంంతో వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి వెళుతున్నారు. ఇక్కడ గుండె వైద్య నిపుణులు ఒకరు ఉన్నా , ఆశించిన స్థాయిలో ఆయా వైద్యచికిత్సలు అందడం లేదు. జీజీహెచ్‌లో ప్రతినెలా పదుల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయంటే అక్కడ మెరుగైన వైద్య చికిత్సలు అందక పోవటమేనన్న విమర్శలు లేకపోలేదు. రోగి భద్రత ఇక్కడ ఎలా ఉందో దీన్ని బట్టి తెలుస్తుంది. ప్రతిఏటా వైద్య ఆరోగ్య శాఖ నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా రూ. 25 కోట్లు ఖర్చు చేస్తున్నా రోగి భద్రతకు పూర్తి స్థాయి రక్షణ లేకుండా పోతుంది.

● సరైన మందులు ఇస్తున్నారా..?

జిల్లావ్యాప్తంగా 500కిపైగా ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. వీటిలో 100కిపైగా సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులు ఉన్నాయి. అయితే వీటిలో వినియోగించే మందులలో చాలావరకు వ్యాధిని త్వరగా తగ్గించే వీలులేదు. కొన్ని మందులు అయితే ఆయా వ్యాధులకు పూర్తిస్థాయిలో పనిచేయవు. ఈ పరిస్థితిలో రోగి ఆరోగ్య భద్రత ప్రశ్నార్థకరంగా మారుతుంది. ఈ ఆసుపత్రులకు ప్రతిరోజూ 10వేల మందికిపైగా రోగులు వస్తుంటారు. అయితే ఇందులో కొన్ని ఆసుపత్రులలోనే రోగులకు సరైన చికిత్సలు అందుతున్నాయి. జీజీహెచ్‌లోనే దాతలు రూ.కోటితో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేశారు. దాన్ని వినియోగంలోకి తీసుకు రావటానికి నెల పట్టిందంటే రోగి భద్రత ఎలా ఉందో తెలుస్తుంది.

● రోగికి తప్పని పాట్లు

ప్రభుత్వం ఆరోగ్యశ్రీ(ఎన్టీఆర్ వైద్యసేవ) ద్వారా ఉచిత చికిత్సలు అందిస్తున్నది. జిల్లాలో 71 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉండగా, ఇందులో ఏటా 50వేల చికిత్సలు ఆరోగ్యశ్రీ కింద చేస్తున్నారు. ప్రభుత్వం కూడా ఆరోగ్యశ్రీ కింద రూ. 120 కోట్లు చెల్లిస్తుంది. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకు పోయి ఉండటంతో కొన్ని నెట్‌వర్క్ ఆసుపత్రులు రోగుల వద్ద నుంచి కొంత మొత్తం వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రోగి భద్రతకు ఆర్థిక భారం తప్పటం లేదు.



జీజీహెచ్‌లో రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

రోగుల భద్రతకు ఎక్కువ ప్రాధాన్యం



జీజీహెచ్‌లో రోగుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నాం. స్పెషాలిటీ వైద్యులను కూడా నియమిస్తున్నాం. ప్రతిరోజూ ఆసుపత్రికి 1500 మంది వరకు రోగులు వస్తుంటారు. ఇందులో 550కిపైగా ఇన్‌పేషెంట్‌లుగా రోగులు వైద్య చికిత్సలు పొందుతున్నారు. ఆసుపత్రికి వచ్చే వారంతా పేదవారే... ఇలాంటి స్థితిలో రోగి భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. అయితే రోగి భద్రతలో కొన్ని సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరిస్తున్నాం.

-డాక్టర్ కొండేటి మాధవి, జీజీహెచ్ సూపరింటెండెంట్



విద్యుత్ కనెక్షన్లు తొలగించారని రాస్తారోకో

కావలి రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుడంగుంట ఎస్సీ కాలనీలోని నివాసాల విద్యుత్ కనెక్షన్లను ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తొలగించారని మంగళవారం రాత్రి కాలనీవాసులు కావలి - జలదంకి జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులురెడ్డి, సిబ్బందితో కాలనీలో సుమారు 300 ఇళ్లకు సరఫరా నిలిపివేశారని, ముందస్తు సమాచారం ఇవ్వకుండా సర్వీస్ వైర్లు, మీటర్లు తొలగించి తీసుకువెళ్లారని వారు ఆరోపించారు. రోడ్డుపై బైఠాయించటంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని, బుధవారం ఉన్నతాధికారులతో మాట్లాడుకోవాలని చెప్పడంతో వారు అక్కడ నుండి వెళ్లిపోయారు. ఈ విషయంపై ఈఈ బెనర్జీని వివరణ కోరగా, 4 నుంచి 5 నెలలుగా విద్యుత్ బిల్లులు చెల్లించని వారి సర్వీస్‌లు తొలగించామని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితమని, అంతకంటే ఎక్కువ వస్తే బిల్లు చెల్లించాలన్నారు. ఒక్క బుడంగుంటలో సుమారు రూ.10 లక్షల బకాయిలు ఉన్నాయన్నారు. పట్టణం పరిధిలోని బిల్లులు చెల్లించని టీచర్స్‌కాలనీలో 40 కనెక్షన్లు, బాలాజీనగర్, కమ్మపాలెంలో 20, ఇందిరమ్మకాలనీలో 26, బుడంగుంట లో 60, తుమ్మలపెంటలో 10, రాముడుపాలెంలో 14 కనెక్షన్లు కలిపి మొత్తం 160 కనెక్షన్లను తొలగించామన్నారు.

గ్రామైక్య సంఘంలో అవినీతి బాగోతం!

● వీవోఏ చేతివాటం.. సభ్యుల గగ్గోలు ● కందుకూరు ఎమ్మెల్యే వద్ద పంచాయితీ ● పూర్తి స్థాయి విచారణకు ఆదేశం

వలేటివారిపాలెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బడేవారిపాలెం గ్రామైక్య సంఘంలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఆ సంఘం అధ్యక్షురాలు (వీఓఏ), గ్రూపు లీడర్లు కుమ్మక్కయి సభ్యుల నుంచి ప్రతి నెలా వసూలు చేసిన నగదును స్వాహా చేసినట్లు వెలుగులోకి వచ్చింది. గ్రామైక్య సంఘం పరిధిలోని బడేవారిపాలెం ఎస్సీ కాలనీలో అంబేద్కర్ గ్రూపులోని 10 మంది సభ్యులు 1-12-2022లో పోకూరు స్టేట్‌బ్యాంక్‌లో రూ.10 లక్షలు ఎస్‌హెచ్‌జీ రుణం తీసుకున్నారు. నిబంధనల ప్రకారం గ్రూపులోని 10 మంది మహిళలకు ఒక్కొక్కరి వ్యక్తిగత ఖాతాలో రూ.లక్ష చొప్పున రూ.10 లక్షలు జమ చేయాలి. అయితే, అప్పటి వీఓఏ ఆదిలక్ష్మి బ్యాంకు అధికారుల వద్ద తన పలుకుబడి ఉపయోగించి ఒక్కొక్కరి ఖాతాలో రూ.80 వేలు చొప్పున 10 మంది సభ్యుల ఖాతాలో రూ.8 లక్షలు మాత్రమే జమ చేయించారు. మిగిలిన రూ.2 లక్షలు గ్రామైక్య సంఘం ఖాతాలో జమ చేయించారు. దీనిపై సభ్యులు నిలదీయగా, పాత రుణం రూ.2లక్షలు ఉన్నందున బ్యాంకు అధికారులు జమ చేసుకున్నారంటూ నమ్మబలికారు. ఆ రూ.2 లక్షలు సభ్యుల తీర్మానం లేకుండానే వీఓఏ డ్రా చేసి మరో గ్రూపుల్లోని సభ్యులకు స్త్రీనిధి కింద ఇచ్చారు. ఈ వ్యవహారం వెనుక పెద్ద తతంగమే జరిగినట్లు సమాచారం. తాజాగా 5 రోజుల క్రితం కొత్త రుణం కోసం గ్రూపు సభ్యులు పోకూరు స్టేట్ బ్యాంక్‌కు వెళ్లారు. అయితే, రికార్డులు పరిశీలించిన మేనేజరు తీసుకున్న రుణం రూ.10 లక్షలు చెల్లించకపోవడంతో అసలు, వడ్డీ సహా రూ.12.50 లక్షలు అయినట్లు పిడుగులాంటి వార్త చెప్పాడు. తాము రుణమంతా చెల్లించేశామంటూ గగ్గోలు పెట్టారు. ఈ విషయమై వెలుగు సిబ్బంది ద్వారా గ్రూపు లీడరును నిలదీయగా గ్రూపు లీడరు, వీఓఏపై చెప్పారు. గ్రూపు లీడరు, వీఓఏను ఇద్దరినీ నిలదీయగా ఒకరిపై ఒకరు చెప్పుకోవడంతో అసలు విషయం బయటపడింది. దీంతో గ్రూపు సభ్యులు కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు మొరపెట్టుకోవడంతో ఆయన వెలుగు అధికారులను పిలిపించి, అక్రమాలు నిగ్గుతేల్చాలని ఆదేశించారు. దీంతో వెలుగు అధికారులు 4 రోజుల నుంచి బడేవారిపాలెం గ్రా మైక్య సంఘంలో జరిగిన అక్రమాలపై విచారిస్తున్నారు. ప్రాథమిక విచారణలో వీఓఏ ఆదిలక్ష్మి అంబేద్కర్ గ్రూపు సభ్యులు ప్రతి నెల ఇచ్చిన నగదును బ్యాంక్‌లో చెల్లించకుండా సుమారు రూ.10 లక్షలకుపైగా సొంతానికి వినియోగించకున్నట్లు తేలిందని ఇన్‌చార్జి ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. గ్రామైక్య సంఘం పరిధిలో 42 గ్రూపులు ఉన్నాయని. పూర్తిస్థాయిలో విచారిస్తేనే మరికొన్ని అక్రమాలు బయటపడే అవకాశం ఉందని తెలిపారు. గతంలో కూడా సదరు వీఓఏ అక్రమాలకు పాల్పడటంతో రూ.8 లక్షలు రికవరీ చేశారు.

మహిళల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక శ్రద్ధ

● రాష్ట్ర క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రమేష్

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక కృషి చేస్తున్న ట్లు రాష్ట్ర క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రమేష్ వెల్లడించారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు వి శేష సహకారం అందించాలని కోరారు. నెల్లూరు జీజీహెచ్‌లో బుధవారం నుంచి ప్రారంభం కానున్న మహిళా వైద్య శిబిరాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించాలి. మహిళల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ అనే కార్యక్రమాన్ని చేపట్టాయని చెప్పారు. ఈ శిబిరాలను అం దరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కా ర్యక్రమంలో జీజీ హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మస్తాన్‌బాషా, అడ్మిని స్ట్రేషన్ అధికారి డాక్టర్ కళారాణి, ఏడీ ఏడుకొండలు, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డాక్టర్ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.



జీజీహెచ్‌లో వైద్య శిబిరాల ఏర్పాటును పరిశీలిస్తున్న వైద్య నిపుణులు

ఇంజనీరింగ్ శాఖల్లో అంతా ఇన్‌చార్జులే!

కావలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కీలకశాఖలైన ఆర్‌అండ్‌బీ, జలవనరులశాఖ, గృహనిర్మాణశాఖ, ప్రజా ఆరోగ్యశాఖల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లంతా కావలి డివిజన్‌లో ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. ఈ క్రమంలో అభివృద్ధి ఎలా సాధ్యపడుతోంది. ఒక వేళ అభివృద్ధి పనులు జరుగుతున్నా ఇన్‌చార్జులు అందుబాటులో ఉండనందున వాటి నాణ్యతా ప్రమాణాలను పట్టించుకునే వారు లేరు.

● పలువురికి పదోన్నతులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంజనీరింగ్‌శాఖలలో ఉన్న కీలక అధికారులకు కొందరికి పదోన్నతి లభించిందిజ మరి కొందరు బదిలీపై వెళ్లారు. అయితే వారి స్థానాలలో పర్మినెంట్ అధికారులను నియమించకుండా అంతా ఇన్‌చార్జీలతోనే కాలం వెళ్లబుచ్చుతన్నారు.ఈ ఇ న్‌చార్జిలు ఎక్కడో వారి మాతృస్థానాల్లో ఉంటూ మొక్కుబడిగా వచ్చి పోతున్నారు. దీంతో అభివృద్ధికి ప్రణాళికలు వేసేవారు. జరుగుతున్న పనుల నాణ్యతలను పర్యవేక్షించే వారు కరువవుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా రోడ్లపై గుంటలు ఉండకూడదని, వాటిని వెంటనే పూడ్చాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆ గుంటలను గుర్తించేందుకు అందుకు అవరమైన ప్రణాళికలు సిద్ధం చేసి పంపేందుకు కీలక మైన ఇంజనీరింగ్ అధికారులే లేకపోతే ఇన్‌చార్జిలకు ఆ బాధ్యత ఎందుకు ంటుంది.

● ఆర్‌అండ్‌బీలో..

ఆర్‌అండ్‌బీ ఈఈగా ఉంటున్న రామక్రిష్ణ ప్రసాద్ పదోన్నతిపై నెల్లూరు ఎస్‌ఈ ఆఫీస్‌లో ఎస్‌టీపీ వీపీ వెళ్లారు. ఆయన స్థానంలో కోవూరుకు చెందిన వేణుగోపాల్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలాగే డీఈగా ఉంటున్న చక్రధర్‌రావు సెలవుపై వెళ్లారు. డీఈ ఇన్‌చార్జి బాధ్యతలను కూడా వేణుగోపాలే నిర్వహిస్తున్నారు. ఆయన రెండు పోస్టులకు ఇన్‌చార్జిగా ఉంటూ చుట్టపు చూపుగా కావలికి వచ్చి పోతున్నారు.



కావలి ప్రజా ఆరోగ్యశాఖ కార్యాలయం

● జలవనరుల శాఖలో...

జలవనరులశాఖ ఈఈగా ఉండిన క్రిష్ణ మో హన్ నెల్లూరు ఎస్‌ఈ ఇన్‌చార్జిగా కూడా కొనసాగుతూ బదిలీపై గుంటూరు వెళ్లారు. సుమా రు ఏడాది నుంచి ఇన్‌చార్జి ఈఈగా కావలి డీఈ పీఎం ఖాన్ కొనసాగుతున్నారు. చెరువుల అభివృద్ధి, చెరువుల్లో అక్రమంగా గ్రావెల్ తరలింపును అడ్డుకునే కార్యక్రమాలను ఇన్‌చార్జి స్థాయిలో ఆయన పూర్తిగా న్యాయం చేయలేక పోతున్నారు. అలాగే కావలిలో జలవనరులశాఖ ఆస్తులు ఎక్కువ భాగం అన్యాక్రాంతం అవుతున్నా వాటిని అడ్డుకుని కాపాడుకోలేక పోతున్నారు. ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరాలంటే గృహనిర్మాణవాఖ పనితీరు వేగంగా ఉం డాలి. జగనన్న ఇళ్ల నిర్మాణాలలో ఎన్నో అక్రమా లు జరిగి విజిలెన్స్ విచారణ ఎదుర్కొంటున్నా రు. అయితే ఇక్కడ కూడా ఈఈ, డీఈ ఇద్దరూ ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. కావలి ఈఈగా ఉన్న మాధవరావు బదిలీపై కందుకూరుకు వెళ్లారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. గతంలో కావలి డీఈగా ఉంటూ కందుకూరుకు బదిలీపై వెళ్లిన నారాయణరెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలాగే బదిలీపై వెళ్లిన డీఈ స్థానంలో కూడా కొంత వారిని నియమించకుండా కావలి ఏఈకి డీఈ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

● ప్రజా ఆరోగ్యశాఖలో...

ప్రజా ఆరోగ్యశాఖలో డీఈ, ఏఈ ఇద్దరు ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. గతంలో ప్రజాఆరోగ్యశాఖ డీఈగా ఉన్న విజయలక్ష్మిని విజయవాడ టిడ్కోకు బదిలీ చేసారు. ఆమె స్థానంలో ఎవరినీ నియమించకుండా కొంత కాలం కందుకూరు డీఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత రెగ్యులర్ డీఈగా సుధారాణిని నియమించినా ఆమె ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా నెల్లూరుకు డిప్యుటేషన్ వేశారు. దీంతో నెల్లూరుకు చెందిన ఎన్. జానకీరామ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రజా ఆరోగ్యశాఖలో ఇద్దరు ఏఈల పోస్టులుఉండగా ఒకరే కొనసాగుతుండారు. ఆయన కూడా బదిలీపై వెళ్లి పోగా కావలి సచివాలయ ఉద్యోగి కార్తీక్‌కు ఏఈ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ప్రజా ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో కావలిలో జరుగుతున్న మంచినీటి సరఫరా పథకం అటకెక్కింది.